# కథామంజరి

## పది కథల సమాహారం




ఫిబ్రవరి 2023

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

**ఫిబ్రవరి 2023**

సంపుటి : 4 ♦ సంచిక : 2



ఈ నెల కథామంజరి సంచిక,

తమ తల్లిదండ్రులు

కీ.శే. చిర్రావూరి సర్వేశ్వరశర్మ, లలిత గార్ల

స్మృత్యర్థం

డా. చిర్రావూరి శ్యామ్, (యుఎస్ఏ), గారి

వితరణతో వెలువడినది.

వారికి మా హృదయపూర్వక

కృతజ్ఞతలు



# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నండూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ / శ్రీమతి / కుమారి

- పప్పు భోగరావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి ఎస్ మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- లక్ష్మి గాయత్రి గారు

**శ్రావ్యసంచిక కోసం ఇక్కడ నొక్కండి**

**శ్రావ్యసంచిక సబ్ స్క్రైబ్ చేయడానికి ఇక్కడ నొక్కండి**

# ఇదీ వరుస

## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| వినదగునెవ్వరు చెప్పిన | ix |


## కథలు, వ్యాసాలూ


| | | |
|---|---|---|
| హీరో | డా. కె. వివేకానందమూర్తి | 1 |
| ఇది కథ కాదు | డా. కె. వి. కృష్ణకుమారి | 9 |
| వైద్యో నారాయణో భవః | డా. కె. బాబూరావు | 16 |
| మెరుగైన సమాజం కోసం | డా. ఎస్. ఆండాళ్ భాస్కర్ | 21 |
| జీవిత సత్యం | డా. రామకృష్ణ రాచకొండ | 25 |
| నియమం–నిష్ఠ | డా. శేషు శర్మ | 29 |
| దహన... సంస్కారం | డా. మల్లెమాల వేణుగోపాల రెడ్డి | 34 |
| అమ్మతనం | డా. ప్రయాగ మురళీ మోహనకృష్ణ | 38 |
| ముత్యాలు – రత్నాలు | డా. కేతు బుచ్చి రెడ్డి | 42 |
| తాతా! అచ్చి!! | డా. పరుచూరి రాజారామ్ | 47 |


Cover Page Credit : K. Rammohan

# కథాకీయం

కథామంజరి ప్రారంభం నుంచి ఉన్న ఆలోచన ఒకటే.. ఈ తరంవారిలో కథలు వ్రాసే ప్రతిభను కూడా వెలుగులో తీసుకురావాలనీ, కొత్తవారిని వ్రాయడానికి ప్రోత్సహించాలనీ.. ప్రయత్నాలు ఆరంభించాం. మాకున్న పరిధిలో, సాధ్యాసాధ్యాలను దృష్టిలో పెట్టుకుని అడుగులు వేసాం, వేస్తున్నాం, వేస్తూనే ఉంటాం! ఆ ప్రయత్నాలలో ఒక ప్రయత్నమే ఈ 'డాక్టర్స్ స్పెషల్' సంచిక. అన్ని వృత్తుల్లోనూ, ఉద్యోగాల్లోనూ ఒత్తిడి సహజం.. అందులో ఈ రోజుల్లో! అలాగే ప్రతి మనిషిలోనూ ఏదో రకమైన ప్రతిభ, ప్రజ్ఞ ఉంటాయి. కొందరిలో అవి దాగి ఉంటాయి. వాటిని బయటకు తీయడానికి... కొంత ఉత్తేజాన్ని కలిగించాలి. ఆ కోవలో ఆలోచించి... వృత్తిలో తీవ్రమైన ఒత్తిడి ఉన్నా, సమయం లేకపోయినా, వయసు పైబడుతున్నా, ఇంకా ఈ సమాజానికి ఏదో అందించాలని తపనపడే వైద్యులను ఎన్నుకున్నాం. తప్పకుండా నేటి తరంవారికి ఈ వైద్య రచయితలు స్ఫూర్తిని ఇవ్వగలరనే భావిస్తున్నాం!

అయితే... ఏ ప్రయత్నం చేసినా జయాలు అపజయాలు గురించి ఆలోచించడం లేదు. తీపి, చేదు అనుభవాలను సమానంగా ఆస్వాదిస్తూ, ముందుకు నడవడమే మాకు ఆనందం ఇస్తుంది! అలా ఆ కోవలోనే ఆలోచిస్తే... ఓ రచయిత వ్రాసిన అన్ని కథలు ఆణిముత్యాలు కాకపోవచ్చు.. ఒక పాఠకుడికి నచ్చింది, ఇంకొకరికి నచ్చకపోవచ్చును. అలాగే పత్రికల్లో వచ్చే కథల్లోకూడా మంచి, చెడు ఉండటం సహజం! వాటిలో కొన్ని బాగుండటం, బాగా లేకపోవడం కూడా సహజమే! ఈ నేపథ్యంలో ఆలోచిస్తే ఓ 'ఉన్నతమైన వృత్తి'లో ఉంటూ, సాహిత్యాభిలాషతో ఇటు తమకున్న ప్రజ్ఞాపాటవాలను కథారచనల ద్వారా కూడా సమాజానికి సాహితీసేవలందిస్తున్న వైద్య–రచయితలు ఉత్సాహంగా కథలు, అనుభవాలను వ్రాసి పంపడం చాలా ఆనందం కలిగించింది! వారిలో... ఎనభై ఏళ్ళు పైబడిన వారి నుంచి నాలుగు దశాబ్దాల వయసులో ఉండే వారి వరకూ ఉత్సాహంగా ఈ 'స్పెషల్స్'కి రచనల్ని అందించారు. ఆ కథల మీద పాఠకులనుంచి భిన్నమైన అభిప్రాయాలు వచ్చాయి. 'పాఠకులను కూడా దృష్టిలో పెట్టుకోవాలి కదా' అనే అభిప్రాయాల నుంచి... 'మీ ఆలోచన, ఈ ప్రయత్నం చాలా అవసరం ఈ రోజుల్లో...' అన్న అభినందనలు కూడా వచ్చాయి. ఆలోచిస్తే, 'కథామంజరిలో కథల స్థాయి తగ్గకూడదనే' ఓ అభిమాన మందలింపు ఒకటయితే, 'ఈ తరంవారికి స్ఫూర్తిని ఇచ్చే ఇలాంటి ప్రయత్నాలు... కథామంజరి చేస్తూనే ఉండాలనే' ఓ భుజం తట్టు కూడా ఉంది! ఈ రెండూ మాకు శిరోధార్యాలే! ఓ విషయం చెప్పగలం... ఈ స్పెషల్‌లో కథల ఎంపిక చేయలేదు, ఆయా రచయితల ఉత్సాహానికి ఊతనిచ్చాం... ఇది స్ఫూర్తిగా తీసుకుని కొంతమందైనా స్పందిస్తారని ఆశిస్తున్నాం!

ఈ రెండు స్పెషల్ సంచికల వలన దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలను ప్రచురించలేకపోయాం. మార్చి నెల సంచిక నుండి ఆ కథల ప్రచురణ జరుగుందని తెలియచేస్తున్నాం!

కథామంజరి కోరిన వెంటనే కలం పట్టి కథలందించిన ఎందరో వైద్యులకి, అందులో ఎనిమిది పదుల దాటినా అక్షర యజ్ఞానికి తమవంతు సాయం అందించిన వారికి, కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాం! వారితో పాటు తెలుగు కథ అంటే ఇష్టపడే, స్పందనలు అందచేసిన మరెందరో వైద్యులకు కూడా కృతజ్ఞతలు!

అడుగులు వేసినప్పుడు... తప్పటడుగులు వేయడం మానవుల జీవితాల్లో సహజమే... వాటిని దృష్టిలో ఉంచుకుని ముందడుగు వేయడం కూడా అవసరమే కదా!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**డా. కేతు బుచ్చిరెడ్డి**

"నాకైతే కథలు రాయాలని అనిపించడం ఓ యాదృచ్ఛికంగానే కనబడుతుంది. మా చిన్ననాటి రోజుల్లో అందరిలాగే పుస్తకాలు చదవడం అలవాటు నాకూ వుండేది. అలా అని ఫలానా సాహిత్యమే నచ్చడాలు, భావజాలాలు ఉండేవి కావు. కాని అభ్యుదయ భావాలతో ఉండే కవితలు, కథలంటే ఇష్టపడేవాడ్ని! అలా ఇప్పటికీ నా మనసుకు నచ్చిన సాహిత్యాన్నే నేను ఇష్టపడతాను. ఆ కోవలోనే కథలు రాయాలని అనిపించింది. ఇరవై సంవత్సరాల వయసులోనే కథలు రాయడం మొదలెట్టాను! నాకంటూ స్ఫూర్తి ఇచ్చిన వారని ప్రత్యేకంగా ఎవర్ని చెప్పలేను!" అంటూ.. "మీకు స్ఫూర్తిని కలిగించిన రచయితలు ఎవరు?" అని అడిగినప్పుడు హాయిగా నవ్వుతూ ఆ సమాధానం చెప్పారు. ఎనిమిది పదుల వయసులో కూడా అటు వృత్తిని, ఇటు ప్రవృత్తిని కూడా పక్కకు పెట్టకుండా నేటికీ ఇష్టంగా ఆ రెండింటితోనే అడుగులు ముందుకు వేస్తున్నారు..

డా. బుచ్చిరెడ్డిగారు 1942 జూన్ 17న కడపలో జన్మించారు. అక్కడే హైస్కూలు, జూనియర్ కళాశాల విద్యను పూర్తిచేసి, గుంటూరు వైద్య కళాశాలలో యం.బి.బి.యస్. చదివారు. తర్వాత అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో విద్యాధికారిగా ఉద్యోగంలో చేరి, అక్కడే పదవీవిరమణ చేసి, అక్కడే ఇప్పుడు స్థిరనివాసంతో పాటు, వైద్యసేవలు నిరాటంకంగా అందిస్తున్నారు.

డా. బుచ్చిరెడ్డిగారి రచనలు ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఆంధ్రపత్రిక, స్వాతి, అనామిక, పొలికేక మొదలగు అన్ని పత్రికలో ప్రచురింపబడ్డాయి. ఈయన కొంతకాలం, కొంతమంది మిత్రులతో కలసి "కవిత" అనే పత్రికను కూడా నడిపారు. పోలీసు శాఖ వారి "సురక్ష" పత్రికలో వైద్యసలహాల శీర్షికను కూడా నిర్వహించారు.

డా. బుచ్చిరెడ్డిగారి కథలు "ప్రథమ చికిత్స", "మంచి అంచున", "ముత్యాలు–రత్నాలు", "ముళ్లకంచె మీద మల్లెపువ్వు", "రైలుబండి", "నగరంలో అడవి", "పొగ(రు)మంచు", "బిల్లుకు చెల్లు", "గురువుకు పాఠం"... వంటి కథలు చాలా ప్రాచుర్యం పోందాయి. వారి రచనలతో "ముత్యాలు–రత్నాలు", "ఇదిగో సూర్యుడు" కథాసంకలనాలు వచ్చాయి. డా.బుచ్చిరెడ్డి గారు అనంతపురం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా చాలా కాలం పనిచేసారు.

చాలా నిరాడంబరంగా, నిర్మలంగా మాట్లాడే డా. బుచ్చిరెడ్డిగారు "కథామంజరి" కోరిన వెంటనే ఈ డాక్టర్ స్పెషల్ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసి, వారి సాహిత్య విశేషాలను మాతో పంచుకున్నందులకు ధన్యవాదాలు తెలియచేసుకుంటూ, వైద్యంతో పాటు, "కథ"ల సేవలు కూడా నిరాటంకంగా కొనసాగిస్తారని ఆశిస్తున్నాం.

*కథామంజరి బృందం*

# కథా మార్గదర్శి



కీ.శే. డా. పరుచూరి రాజారామ్

కల్పన కంటే వాస్తవం గొప్పది.. అనే మాటను నమ్ముకుని, జీవితంలో ఎదురైన వాస్తవ విషయలనే తన రచనల ద్వారా అందించిన మరో తెలుగు కథా, నవలారచయిత, ప్రముఖ చర్మవ్యాధుల వైద్యులు, సామాజికవేత్త కీ.శే. డా. పరుచూరి రాజారామ్ గారు. వృత్తి, ప్రవృత్తులను సమానంగా చూసి, సమాంతరంగా తనతో పాటు వాటిని నడిపించారు. చిత్తశుద్ధి, సంకల్పం ఉంటే ఏ పనైనా చేపట్టవచ్చని డా. రాజారామ్ గారిని చూస్తే తెలుస్తుంది. గుంటూరులోనే కాకుండా ఆంధ్ర రాష్ట్రంలో చర్మవ్యాధుల నిపుణులుగా పేరుగాంచిన డా. రాజారామ్ గారు, ఆ రోజుల్లో అంటే 1970 ప్రాంతంలో అభ్యుదయ రచయితల సంఘం పునర్నిర్మాణంలో ప్రముఖపాత్ర వహించారు. డాక్టరుగా ఎంత బిజీగా ఉన్నా, సాహిత్య రంగంలో కూడా అదే జోరులో ఉండేవారు. 1973 లో గుంటూరు అరసం మహాసభలను దిగ్విజయంగా నిర్వహించటంలో ప్రముఖపాత్ర వహించారు. మరోవైపు వైద్య వృత్తి కూడా ఉన్నతంగా చేపట్టి, అందరికి అందుబాటులో వైద్యాన్ని అందించారు. పేదవారికి ఉచితంగానే వైద్యం అందించిన డా. రాజారామ్ గారు గుంటూరులోని పొగాకు కంపెనీలలోని కార్మిక సంఘాలకు గౌరవ సలహాదారుగా కూడా సేవలందించారు.

డా. రాజారామ్ గారు కథా, నవలా ప్రక్రియల ద్వారా సాటిమనిషిని ఎలా చైతన్యం చేసారో... అలాగే వైద్యం పట్ల, సైన్స్ పట్ల సామాన్యులకి అవగాహన కల్పించడానికి, వాటిని కూడా గ్రంథస్తం చేసారు. ఆ కోవకి చెందిన... "అవయవాల ఆత్మకథలు, వింతప్రాణులు, చర్మ సౌందర్యం, చర్మవ్యాధులు–నివారణ, ఆహారం–ఆరోగ్యం, వైద్యం– శాస్త్రజ్ఞులు, సిగ్మండ్ ఫ్రాయిడ్ జీవితం – కృషి...." వంటి ఎన్నో వైద్య గ్రంథాలను రచించారు.

డా. రాజారామ్ గారు వైద్యవృత్తిలో కూడా చాలా క్రమశిక్షణ పాటించేవారుట. చర్మవ్యాధులను పగలు పరిశీలన చేస్తేనే, వాటి గురించి పూర్తి అవగాహన వస్తుందనే ఓ వైద్య సూచనను అనుసరించి, వారు ఉదయం 9 గం. నుంచి 2 గంటల వరకు సాయంత్రం 4 గం. నుంచి 6 గం. ల వరకు మాత్రమే, రోగులని చూసేవారుట. సాయంత్రాలు వారి స్వగృహంలో నిత్యం సాహితీసమావేశాలు, ఇష్టాగోష్ఠులు జరుగుతూ ఉండేవి. ప్రముఖ తెలుగు కథారచయితలు చాసోగారు, ఆవంత్స సోమసుందరం గారు, ఇస్మాయిల్ గారు... వంటి ఎందరో మహానుభావులు తరుచు వారింటికి వచ్చి, కొద్ది రోజులు గడిపి

వెళ్ళేవారుట. హైస్కూలు చదువులప్పుడే కథలు, నవలలు చదివే అలవాటు ఉండటంతో, ఆ స్ఫూర్తి కథలు వ్రాయటానికి పునాదిగా పడింది. అభ్యుదయ భావాలతో పెరిగి, కష్టపడి, ఇష్టపడి డాక్టర్ చదివారు డా.రాజారామ్ గారు! వారి కథలలో ఆ భావజాలం ప్రస్ఫుటంగా కనబడుతుంది. డా. రాజారామ్ గారి కథల కథాంశం, కథనం మన ఎదుటే కదలాడుతున్నట్టే ఉంటాయి. ఆయన కథాశైలి కథలను చదివిస్తుంది. ఆయన కథలు గుండె తడి చేస్తాయి. ఆయన కథలు మొద్దుబారిపోతున్న మెదడుల్ని కూడా మొలకెత్తించి, ఆలోచనల్లోకి దింపుతాయి. నిరంతర చింతన, నిత్య చైతన్యం మూర్తిమంతమైన డా. రాజారామ్ గారి కథలు... 1962 లో వ్రాసిన 'తెగిన గాలిపటం' నుంచి, 2002లో ప్రచురింపబడిన ఆయన వ్రాసిన చివరి కథ 'ట్వింకిల్ ట్వింకిల్ ఓల్డ్ స్టార్' వరకు అన్నీ అజరామరాలే! ఆయన వ్రాసిన మొట్టమొదటి నవల 'పునరావృతం', తర్వాత వ్రాసిన... 'వీళ్లు మనుషులే', 'మబ్బు విడిచిన వెన్నెల', 'జపమాల' మొదలైన నవలలన్నిటికీ బహుమతులు వచ్చాయి.

డా. రాజారాం, సుశీల దంపతులకు ముగ్గురు అమ్మాయిలు. వారి తరవాత మూడు తరాల వాళ్ళలో రాజారాం గారి స్ఫూర్తి బాగా కనబడుతుంది. డా. రాజారాం గారి పిల్లలు, అల్లుళ్ళు, మనవరాళ్ళలో ఎక్కువమంది చర్మ వ్యాధి వైద్యనిపుణులే ఉన్నారు. అయితే ఏ తరం వారికీ డా. రాజారాంగారి సాహిత్యాభిలాష రాలేదని వారి పెద్దమ్మాయి మాట్లాడుతూ వాపోయారు. ఓ గొప్ప మానవతావాది, అభ్యుదయ కథా, నవలారచయిత, ప్రఖ్యాత చర్మవ్యాధి నిపుణులు డా. రాజారామ్ గారు పరమపదించి, రెండు దశాబ్దాలు గడిచినా, వారి జ్ఞాపకాలు, వారి రచనలు ఎప్పటికీ చిరంజీవులే! ఈ 'డాక్టర్ స్పెషల్' సంచికలో వారిని తలుచుకునే ఓ మహత్తర భాగ్యం కలిగినందులకు ఆనందపడుతూ... వారికి ఘనమైన నివాళి అర్పించుకుంటున్నాం!

***కథామంజరి బృందం.***

# కథా పరిచయం

## 'ఐసీసీయు' – మెడికో శ్యామ్

ఒకప్పుడు కొమ్మూరి వేణుగోపాలరావుగారు రాసిన 'హౌస్ సర్జన్' నవల ఎంతో ప్రాచుర్యం పొందింది. ఒక డాక్టరుగా తను చదువుకునే రోజుల్లో హౌస్ సర్జన్సీ చేసినప్పుడు తనకు కలిగిన అనుభవాలకు ఒక కథను జోడించి అద్భుతంగా రాసిన నవల అది. సగటు జనాభాలో డాక్టర్లు ఎంతమందో, రచయితలలో కూడా డాక్టర్ల శాతం సుమారు అంతే ఉంటుంది. ఆ డాక్టరు రచయితలు హాస్పిటల్స్ లో జరిగే ఉదంతాల్ని తామెలా అనుభవిస్తారో, ఆ అనుభవాలను పాఠకులు జీర్ణం చేసుకోగలిగే విధంగానూ, ఆసక్తికరంగానూ రాయగలిగితే, అది పాఠకులకు ఒక ఎడ్యుకేషన్... కథ తోడైతే ఆహ్లాదకరం! అంటే డాక్టర్ రచయితలు రెండు విధాలుగానూ పాఠకుల మనసుల్ని తట్టగలరన్నమాట. తెలుగు సాహిత్యంలో అలా రాయగలిగి, పాఠకులను చేరగలిగేవారు చాలా తక్కువమందే ఉన్నారన్నది నిజం. రచయితకు మెడికల్ సైన్సు క్షుణ్ణంగా తెలియడమే కాకుండా అజ్ఞానులైన పాఠకులకు తను చెప్పదల్చుకున్న విషయాన్ని అర్థమయే రీతిలో చెప్పగలగాలి. అయితే డాక్టరు కాని రచయితలు కూడా ఈ రకమైన కథలను, నవలలను అందివ్వక పోలేదు. ఏమైనా అలాంటి కథలు, నవలలు, తక్కువే.

డా. శ్యామ్ అలాంటి కొద్దిమంది డాక్టర్ రచయితలలో ఒకరు. తను రాసిన 'శ్యామ్ యానా' పుస్తకానికి ముందుమాట 'ఒక సంవేదనా పరుడి ఆధ్యాత్మిక అశాంతి' అని రాస్తూ, మునిపల్లె రాజుగారు అంటారు "ఆ గాంధారం ఆత్మగతమైనది. ఆ రాగాలు జీవితంలోంచి పెల్లుబికినవి. విదూషక వేషం వెనక విషాద తాత్విక విచారణ వున్నది." అని. తన అనుభవంతో, మెడికో శ్యామ్ రచనలను చదివి రాసిన అక్షర సత్యాలు ఈ మాటలు. రాజుగారు సూచించినట్లుగా మెడికో శ్యామ్ కథలలో 'ఆధ్యాత్మిక అశాంతి' కనిపిస్తుంది. కనిపించే మాటల వెనక నిగూఢమైన బాధను పాఠకులు గుర్తించగలరు. పదాల విరుపుల మధ్యలో, హిందీ పాటల పల్లవుల వెనక కాస్త ఆలోచిస్తే కనబడేదిదే. 'ఐసీసీయు' కథ అందుకు విరుద్ధం కాదు.

ఐసీసీయు అంటే Intensive Coronary Care Unit అని అందరికీ తెలిసిందే. అంటే అది హృద్రోగులను వారి వారి అవసరం కొద్దీ అత్యంత జాగ్రత్తగా చూసే విభాగమన్నమాట. అలాంటి ఒక ఐసీసీయు ఈ కథకు నేపథ్యం.

ఈ కథ రచయిత 1981-82 ప్రాంతాల్లో రాసినది. అప్పట్లో రచయిత ఒక కుర్ర డాక్టరే అనుకోవచ్చు. కుర్ర డాక్టరుగా తన అనుభవంతో రాసిన కథ అని వేరే చెప్పనక్కరలేదు.

"నా కళ్ళు ఇరవై నాలుగ్గంటలూ పనిచేస్తాయి. నా గుండెలు అనుక్షణం కొట్టుకుంటాయి. నా చేతులు అవిరామంగా తిరుగుతాయి. గోడపై నా కాపురం. నా పేరు గోడ గడియారం." అంటూ మొదలవుతుంది కథ. జరిగిన కథకి గోడ గడియారాన్ని రచయిత ఆ గదిలో జరిగే విషయాలకి ఒక సాక్షిగా నిలబెట్టారు.

ఐదు బెడ్లు, ఒక మానిటర్, మానిటర్ కి ఎదురుగా ఒక కుర్ర డాక్టర్, అవతలగా ఒక ఎర్ర పంజాబీ నర్స్. ఇదీ సెటప్. అందులో మొదటి పేషెంటు మన్మోహన్ కృష్ణ.. 32 సంవత్సరాలు, స్మోకింగ్ చెయ్యడు, అప్పుడప్పుడు తాగుతాడంతే. అక్కడికి వచ్చిన కారణం 'ఎక్స్ టెన్సివ్ ఏంటీరియల్ ఇన్ఫెక్షన్'. అందమైన భార్య. తన పరిస్థితి వల్ల భార్యకు ఇంకేమైనా ఆలోచనలు వస్తాయేమోనన్న దిగులుతో ఆమెను ఎప్పుడూ తనదగ్గరే ఉండాలంటాడు. తను ఒకప్పుడు చాలా మంది అమ్మాయిలతో తిరిగినా, తన భార్య పవిత్రంగా ఉండాలనుకునే ఆలోచన. కుర్రడాక్టరు తను చదువుతున్న ఎర్రట్ట పుస్తకాన్ని మరోసారి నెమరువేసి, సెక్స్ విషయంలో మన్మోహన్ ఎంతమాత్రమూ బలహీనుడు కాడని తగినంత నమ్మకాన్ని కలిగిస్తాడు.

రెండో పేషెంటు కూడా 'ఎక్స్ టెన్సివ్ ఏంటీరియల్ ఇన్ఫెక్షన్' అనే నిర్ణయం. అయితే ఈ పేషెంటు 45 ఏళ్ళవాడు. సిగరెట్ కాల్చడు, మిగతా జబ్బులేవీ లేవు.

మూడో పేషెంటు ముసలివాడు, గుండె నొప్పి సంగతి తెలీదు, ఊపిరి తిరగడం లేదని వచ్చాడు. ఈసీజీ తీసి, 'ఇన్ ఫీరియల్ ఇన్ఫెక్షన్' అన్నారు. ప్రతి చిన్నదానికీ సంతోషం వ్యక్తపరచడం ఆయన నైజం.

నాలుగో పేషెంటు అలసినా, అరిచినా గుండె నొప్పి వస్తుంది. సిగరెట్లు, తాగుడు అలవాట్లలో రూలు, రెగ్యులారిటీ లేదు. బ్లడ్ ప్రెషరుంది, కానీ ఉప్పు వదిలి ఉండలేడు. ఆయన్ని కేవలం అబ్జర్వేషన్ కోసం తీసుకొచ్చారు.

అయిదో బెడ్డులో ప్రస్తుతం ఎవరూ లేరు.

మొదటి పేషెంటు కొద్ది రోజుల్లో వార్డుకి, తరవాత ఇంటికి వెళ్ళిపోయాడు. అయితే మన్మోహన్ క్రిష్ణ మళ్ళీ గుండె నొప్పితో వెనక్కి వచ్చినప్పుడు కుర్రడాక్టరు తిరిగి అడ్మిట్ చేయాల్సి వస్తుంది. అది నిజమైన హార్ట్ ఎటాక్ అవునో కాదో అన్నది నిర్ణయించలేక, ప్రస్తుతానికి ఏమీ చెయ్యడానికి లేదని నిర్ణయించి, లేడీ కన్సల్టెంటు "డిస్టిల్డ్ వాటర్ ఇంజెక్షన్ ఎస్.ఓ.ఎస్. ఇవ్వండి" అంది. "అతని గుండెల మీద స్పష్టంగా వినిపిస్తున్న 'పెరికార్డియల్ రబ్' అతని గుండెవ్యాధికి నిదర్శనం" అన్నాడు కన్సల్టెంటు. ఇద్దరిలో ఎవరు కరక్ట్? నిజంగా గుండెవ్యాధి ఉంటే తను ఎర్ర పుస్తకంలో చదివి వినిపించిన వాక్యాలు ఎంతవరకు బాధ్యత వహించాయో అర్థం కాలేదు కుర్ర డాక్టరుకి.

రెండో నంబరు పేషెంటుకి ఏ కారణం కనబడని పరిస్థితి. ఎక్టోపిక్స్ (గుండె అస్తవ్యస్తంగా కొట్టుకోవడం) లెక్కలేనన్ని వచ్చాయి. డ్రిప్పులు, మందులు... ఎవరూ లేకుండా చూసి రెండవ నంబరు పేషెంటు తన భార్యను ముద్దు పెట్టుకోవడం కుర్ర డాక్టరుకి తెలుసు. ఆమెను కసురుకోవడం తెలుసు. ఏ ఆవేశంతో, ఆక్రోశంతో, ఆప్యాయతా ఆ మనిషిలో కలిగిందో తెలీదు. అయితే మరో పావు గంటకి 'వి.ఎఫ్, వి.ఎఫ్ (వెంట్రికులర్ ఫిబ్రిలేషన్)' అని అరుపులు... పేషెంటు మరిక లేకుండా పోయాడు. ఎక్టోపిక్స్ ఉన్నా ఫరవాలేదన్నవాళ్ళు ఉన్నారు. కొన్నిసార్లు ప్రమాదమన్నదీ నిజమే. మరి ఏది ఎప్పుడు ఎలా నిర్ణయించాలి?

మూడవ పేషెంటు ఆనందంగా, హాయిగా, కోలుకుని ఇంటికి వెళ్ళిపోయాడు.

జరిగినదంతే. కుర్ర డాక్టరు ఎర్ర పంజాబీ నర్సుతో సరసాలు (flirting) కథలో ఒక భాగం.

కుర్ర డాక్టరు మెదడులో ఎన్నో ప్రశ్నలు మిగిలిపోయాయి.

"జబ్బే లేకపోతే ఇంత పకడ్బందీగా నడిపే ఈ ఐసీసీసీల ఉపయోగమేమిటి? కేవలం బంధింపబడిన ఈ వాతావరణం వల్ల కలిగే భ్రమా? అయితే మూడో పేషెంటు కోలుకుని ఇంటికి వెళ్ళడం... వీటివలన కాదా?"

తను చదివినవీ, నమ్మినవీ శాస్త్రజ్ఞులు శాస్త్రీకరించినవీ... అన్నీ ఏమయ్యాయి?

తన కర్తవ్యం ఏమిటి? ప్రజలకు తనిచ్చే సందేశం ఏమిటి? అన్నీ ప్రశ్నలే. తనకి తనే అత్యంత నీటిబిందువు కంటే చిన్నగా కనిపిస్తాడు.

రచయిత ఈ కథలో చెప్పదల్చుకున్న ముఖ్య విషయం శాస్త్రీయంగా మెడిసిన్ ఎంత ముందుకెళ్లినా, తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయింకా. కథ సారాంశం మొత్తం రచయిత అన్న ఈ వాక్యంలో ఉంది. "ఏమిటో మానవుడు తెలిసినన్ని తలుపులు తెరిచి, రహస్యాలు తెలుసుకున్నా... మొత్తం తలుపులు ఎన్నో తెలీనప్పుడు, ఎన్ని తలుపులు తెరవగలడు?"

ఒక డాక్టరుని ప్రాణభిక్ష పెట్టే ఒక దేవుడిలా చూస్తారు చాలామంది. అది నిజమే. కాని ఎంత గొప్ప డాక్టరైనా రచయిత చెప్పినట్లుగా తనకు తెలిసిన కొన్ని తలుపులే తెరవగలడు. అది గుర్తించిన డాక్టరు తనని తాను దేవుడనుకోగలడా? ఇదే మునిపల్లె రాజుగారు చెప్పిన రచయిత చూపించిన 'ఆధ్యాత్మిక అశాంతి'.

సాధారణంగా గమనించం. ఏ గదిలో అయినా గడియారం ఒక్కటే ప్రాణంలేకుండానే, ప్రాణమున్న వస్తువు. దానికే కళ్ళుంటే? దానికే ప్రాణముంటే? ఎన్ని కథలు చూసేదో! ఎన్ని సాక్ష్యాలు చెప్పేదో! రచయిత గోడ గడియారాన్ని కథ చెప్పడానికి ఎన్నుకోవడం ఒక ప్రత్యేకత. రచయతకు అదొక సైలెంట్ పార్ట్నర్.

'అవును. ఇది పగలు. వగలు కురవడానికి వీలుపడని పగలు.' లాంటి వాక్యాలు పాఠకుడికి గిలిగింతలు తెప్పిస్తాయి. 'నరమానవుణ్ణి కాని నాకే ఇలా గుండె గొంతుకలోన కొట్లాడితే, మనుషులకీ మగువలకీ నిర్భయం, అభయం ఎలా వుంటాయి?' – ఇవి ఎక్టోపిక్స్ గురించి గోడ గడియారం అనుకున్న మాటలు.

గోడ గడియారం చెబుతోంది 'అంతకు ముందర అందరం ఒకేచోట "డింగ్... డాంగ్... డింగ్... డాంగ్... " "అలారం... అలారం" "కులాసా...కులాసా..." అంటూ గడిపేవాళ్ళం. ఇక్కడికి వచ్చిన దగ్గర్నుంచీ కుతూహలం, క్యూరియాసిటీ, ఉత్సాహం, ఉద్రేకం, ఉద్వేగంగా క్షణం క్షణం గడుస్తోంది... నడుస్తోంది నాకు.' అని.

రచయితకున్న ప్రత్యేకమైన శైలి కథలో కనబడుతుంది. కథ నడుస్తుంది. రచయిత చెప్పడు. కథతో పాటు పాఠకుడూ నడుస్తాడు. వాక్య నిర్మాణంలో తన మాటల గారడీ ఒక లయలా ధ్వనిస్తుంది... కథ తీసే పరుగుతో పాటుగా!

ఐసీసీయు చదవాల్సిన మంచి కథలలో ఒకటి.

**శాయి రాచకొండ**
హ్యూస్టన్

## వైద్య కథామంజరి జనవరి, 2023

నూతన సంవత్సరం మొదటి సంచిక వైద్యకథకుల (పదం సరి అయినదేనా?) సంచికగా వెలువడింది. ముఖచిత్రంలో స్టెతస్కోపు పెన్నుగా మారి కథలు రాస్తున్నట్లు భలే కుదిరింది. కొచ్చెర్లవారూ... మీరు సూపర్!! ఈ నెల కథాకీయంలో సమయం లేదని రాయడానికి బద్ధకించే రచయితలను మెత్తని వస్తువుతో కొట్టినట్లు చురక వేశారు. నిజమే గదా.... రాయాలని అనుకోవాలే గానీ, వైద్యులకు ఎక్కువ సమయం జేబులోనే ఉంటుంది కదా! రోగుల ప్రాణాలను కాపాడే ముఖ్యమైన వృత్తిలో ఉన్న వారికే సమయం దొరికితే .... ఆలోచించాలి. ఆ వెంటనే ఉన్న విశిష్ట అతిథి ప్రయాగ మురళీమోహనకృష్ణ గారి పేరులో 'మురళీ' కాస్త 'మరళీ' అయింది. పెద్దాయనకు కోపం రాకూడదని కోరుకుందాం.

'అనువాద కథ' – మెడికో శ్యాం. ఈ మధ్యనే ఎక్కడో బహుశా యూట్యూబ్ లో గాబోలు నవ్వు అతికించని సీరియస్ మొహంతో బహు పసందుగా మాట్లాడిన వీడియో చూశాను. ఈ రాతల కంటే వారి మాటలు ఇంకా బాగుంటాయి. ఒక రచయిత కథించిన (ఈ పదం చూసి శ్యామ్ గారు ఏమంటారో?) కథను అదే ఫీల్ వచ్చేట్లు అనువదించడం సాధ్యమేనా అనే మీమాంసా చర్చతో మొదలై... మనిషి మాట్లాడే భాష అర్థంగాని (?) ఓ మూగజీవికే సంవేదన అర్థం అయితే మరో మనిషికి అదీ... రచయితకు అర్థం గాదా? ఓపిక పట్టాలంతే... తో ముగించిన కథ. సాహిత్యం లేని సాహిత్యసేవ, హర్షోల్లాస చైతన్యం,... పదాలు భలేగా ఉన్నాయి. ఇంతకీ 'అనువాద కథ'ను అనువదించే వారు ఎవరైనా... చిరునామా ప్లీజ్! శ్యామ్ గారికి పంపుతాను.

కర్పూర దీపం – జయప్రదగారి కథ. ఈ మధ్యనే తెలంగాణ రాష్ట్ర మొదటి మహిళా కార్యదర్శిగా నియుక్తులైన శాంతికుమారిగారి వ్యాఖ్యను గుర్తుకు తెచ్చింది. 'మరీ అవసరం ఉన్నా లేకున్నా మహిళలు త్యాగం చేయడం కొనసాగిస్తే... వెనుకే మిగిలి పోతారు'అని.

దేవుడు బాబు – ఒలంపిక్ టార్చి పట్టుకొని పరుగెట్టడానికి ఎంపికైన మొదటి తెలుగువారు డా. రవిశర్మగారి కథ. కథ కంటే ముందు వీరి పరిచయం గొప్పగా అనిపించింది. మతం మారి అబ్రహంగా మారిన మనిషిని, 'నన్నెందుకు 'అబ్బరం' అంటున్నారని' అడిగినవారికి మతం... ఉండాల్సిన లక్ష్యం గురించి చెప్పిన కథ.

ఈ సంచిక లో వృత్తిని స్పృశిస్తూ వచ్చిన మొదటి కథ, డివిజీ గారి డాక్టర్స్ డైరీ. ఒక ఫీల్ గుడ్ స్టోరీ. మరో కథ అదర్ ఏంగిల్ – కాళ్లకూరి శైలజగారిది. కథను అలా...లా...నిలబెట్టిన మాటలు 'నా అనుభవంలో ఏ పరిచయం లేని వాళ్ళల్లో పరస్పర గౌరవం, అభిమానం చూశాను. బాగా తెలుసున్న వాళ్ళ మధ్య మటుకు తెలియని ఒక పలుచటి పొర ఉంటుంది. గాయపడినప్పుడు దాని స్థానంలో పెద్ద గోడ మొలుస్తుంది.' భలే ఉంది కదా! కథ కూడా సాఫీగా సాగుతుంది, బాగుంటుంది.

స్త్రీకి స్త్రీయే – మూర్తిగారి కథ. మళ్ళీ వృత్తి సంబంధం కలిగిన కథ. తాను అనెస్థీషియా ఇచ్చిన ఒక స్త్రీకి ఎనెన్ సెఫలీ బేబీ పుట్టిన ఘటనను గుర్తుకు తెచ్చుకుంటూ బాధపడిన కథ. స్త్రీకి స్త్రీయే శత్రువు అనే నానుడిని బలపరుస్తూ చాలా కథలు వచ్చాయి అందులో ఇది ఒకటి. కాపోతే ఒక డాక్టరుగారు రాసిన కథ కాబట్టి కొత్త విషయాలతో నడిచింది.

కోడలు ఒక్క మాత్ర ఎక్కువ వేయడం వల్ల అత్తగారి మూత్ర పిండం దెబ్బతినడం (అలా అని జూనియర్ డాక్టర్ చెప్పాడు), అదే సమయంలో భార్యమీదకంటే తనమీద ఎక్కువ ప్రేమ ఉందని రుజువు చేయమని తల్లి అడగడం ... ఇత్యాది కారణాలతో కోర్టుకెక్కిన పంతులుగారికి చివరికి ఏం జరిగింది అనేది 'ఒక్క మాత్ర' కథ. గుంటూరు డాక్టరు, సామాజిక సేవకు పెద్ద పీట

వేసే రమణగారి కథ. కథ మొదలు పెట్టడం గొప్ప ఎత్తుగడ. ఆటవెలదిలో వచ్చే మాత్రలకు, ఔషధయుత మాత్రలకు సాపత్యం తెస్తూ మొదలైన కథ. దీనికి సూరంపూడిగారి చిత్రం బాగుంది.

ఓ రెండు మూడు తప్ప అన్ని కథలు బాగానే ఉన్నాయి. అయినా డాక్టరుగా వృత్తంటేనే మనిషి, మనసుతో చెలిమి కదా! పైగా స్పందించే హృదయం ఉంటేనే రచయితలు. రెండూ కలిస్తే.... ఇలాగే రాస్తూ ఉండాలని కోరుకోవడం తప్ప చెప్పడం అనవసరం. శుభం భూయాత్.

**రాంబో**

ఉచిత సలహా– వైద్యో నారాయణో భవః కథ చప్పగా ఉంది. కథలు ఎంపిక చేసేవారు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని నా అభిప్రాయం.

**బి. ఎస్. మూర్తి**

# రచయిత పరిచయం

## హీరో

### డాక్టర్ కె. వివేకానందమూర్తి (యు.కె)

ఈ డాక్టర్ రచయితగారు 'కథామంజరి' పాఠకులకు చిరపరిచితులే. సెప్టెంబరు 2022 సంచిక విశిష్ట అతిథిగా విచ్చేసారు. ఆమాటకొస్తే... ఓ తరం వెనక ఉండే తెలుగు కథా, సినిమా ప్రియులకు పరిచయం అక్కర్లేని డాక్టరుగారు శ్రీ కడియాల వివేకానందమూర్తి గారు. తణుకులో జననం, బాల్యం... తర్వాత ఆంధ్రా మెడికల్ కాలేజీ, విశాఖపట్నంలో డాక్టర్ చదువు చదివారు. మంచి స్పురద్రూపి, వాచకం, ఆంగికం మేళవించిన ఆజానుబాహుడు కావడంతో సినిమా లోకంలో కూడా అడుగుపెట్టారు.

కొద్దికాలం సినిమాల్లో నటించి, ఆ లోకానికి టాటా చెప్పి, లండన్ వెళ్ళిపోయి, తిరిగి వైద్యవృత్తిలో మునిగిపోయారు. డా. వివేకానందమూర్తి గారు కాలేజీలో చదువుతున్నప్పుడే రచనావ్యాసంగం మొదలెట్టారు. డాక్టర్ కంటే ముందుగా రైటర్ గా అడుగు పెట్టి, 'చావు' అనే కథానికను తన పద్దెనిమిదో ఏట వ్రాసారు. తర్వాత కాలంలో అన్ని రసాలలో వాసి ఉన్న కథలు వ్రాసారు, అవి కథాసంపుటాలుగా వచ్చాయి కూడా! చమత్కారమైన భాష, శైలి ఉన్న విలక్షణమైన ఇతివృత్తం, మనసుని పిండేసే విషయం ఉంటుంది. దేవరకొండ బాలగంగాధరతిలక్ గారి వంటి ప్రముఖుల చేత భేష్ అనిపించుకునే కథలు వ్రాసిన డా. వివేకానందమూర్తి గారు మంచి మిమిక్రీ ఆర్టిస్ట్, రంగస్థల నటులు, వక్త, హాస్యప్రియులు, స్నేహశీలురు. కొన్నాళ్ళు "జ్యోతిచిత్ర" సినిమా వారపత్రిక మొట్టమొదటి సంపాదకులుగా కూడా పనిచేసారు. నలభై సంవత్సరాలుగా ఇంగ్లండులో నేషనల్ హెల్త్ సర్వీసులో డాక్టరుగా సేవలందిస్తున్నారు. అక్కడి తెలుగు సాహితీరంగానికి వారు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా భారత పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్యనాయుడు గారి చేతుల మీదుగా తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ వారిచే జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు.

కోరిన వెంటనే ఓ ఆణిముత్యాన్ని పంపిన డా. వివేకానందమూర్తి గారి కలం నుండి మరెన్నో కథలు జాలువారాలని ఎదురుచూసే ఎంతోమంది తెలుగువారి చెంత మేం కూడా ఉన్నామని తెలియచేసుకుంటున్నాం!

# హీరో

డాక్టర్ కె. వివేకానందమూర్తి (యు.కె)



***"నేను చేసిందేవుందిరా! నువ్వు సినిమాలు తీస్తావు. ఈయన పాటలు రాస్తారు. ఈ అమ్మాయి నృత్యం చేస్తుంది. అలాగే నేను వైద్యం చేస్తాను. అది నా వృత్తి. నా పని నేను చేసానంతే!" హరినారాయణ మళ్లీ అన్నాడు. "ప్రతి యుగంలో రాక్షసుల్ని చంపడానికి దేవుడు అవతారం ధరిస్తాడు. ఇప్పుడు తెలుగుతల్లిని చిత్రహింసలు పెడుతున్న ఈ కమల్ గాడి మనసు అనే రాక్షసుడిని చంపడానికి దేవుడు ఈ కరోనా అవతారం ఎత్తాడు!"***

లండన్లో ఎండలు మెండుగా కాయవని అందరికీ తెలుసు. ఆవాళ పైకి లేచిన సూరీడు బకింగ్ హామ్ ప్యాలెస్ ని చూస్తూ భగభగమనట్లేదు. చలి భరించలేక మబ్బుదుప్పట్లు కప్పుకుని గజగజమంటున్నాడు. అయినా రాణీగారి దేశంలో సూరీడు రాయల్ భాస్కరుడే. తెల్లవాడి నుదుటి మీద కొంచమైనా చెమట రాయని భాస్కరుడే!

ది రాయల్ లండన్ హాస్పిటల్లో కరోనా పేషంట్స్ మధ్య చకా చకా పనిచేస్తున్న ఇండియన్ డాక్టర్ హరినారాయణకు ఫోనొచ్చింది... పెర్సనల్ కాల్ ఇండియా నుండి! ప్రైవేట్ రూములోకి వెళ్లి ఆన్సర్ చేశాడు. తన ప్రాణ మిత్రుడు కమాల్ సింగ్ దగ్గర్నుంచి. అతని పేరు కమల్ సింగ్ అయినా అంతా కమాల్ సింగ్ అని పిలుస్తారు. రెండు మూడు రోజుల్లో తన సినిమా షూటింగ్ కోసం లండన్ వస్తున్నాననీ తన మీద వాల్తాననీ. కమాల్ సింగ్, డాక్టర్ హరినారాయణ ఇండియాలో క్లాస్ మేట్స్, గ్లాస్ మేట్సు. కమాల్ సింగ్ పంజాబీ. వాళ్ల ఫ్యామిలీకి విశాఖపట్నంలో బట్టల వ్యాపారం ఉండేది. పంజాబీ అయినా తెలుగు బాగానే మాట్లాడతాడు. అయితే అతని మాతృభాష కాకపోవడం వల్ల యిప్పటి తెలుగు చిత్రాల్లో తెలుగులా కాసిని బూతులు తనకు తెలియకుండానే రంగరించి మాట్లాడుతాడు. కమాల్ సింగ్ కి సినిమాలంటే వ్యామోహం. చదువు అయ్యాక చిత్ర నిర్మాత అయిపోయాడు. హిందీలో ఒకటో రెండో తీసినా తెలుగులోనే ఎక్కువ ఫిల్మ్స్ తీశాడు. తీస్తున్నాడు. అతడు నిర్మించిన చిత్రాలు దాదాపు అన్నీ ఫెయిల్యూర్సే. అంచేత అంతా అతడిని ధమాల్ సింగ్ అని కూడా పిలుస్తారు.

కరోనా విలయ తాండవం చేస్తున్న సమయంలో యీ సినిమా షూటింగేవిటో హరినారాయణకు అర్థం కాలేదు. 'ఒక పక్క మొహం కాలిపోతుంటే మెడకి చంద్రహారం కోసం బజారుకి బైల్దేరినట్టుంది!' అనుకున్నాడు హరినారాయణ. తను ఇప్పుడు ఒంటరిగానే వుంటున్నాడు. భార్య లేదు. తన టైమంతా రోగుల సేవలోనే గడుపుతున్నాడు.

లాక్ డౌన్ తర్వాత యు.కె లో కరోనా జోరు ఇంకా ఉన్నా... బాగా తగ్గింది. కానీ ఇండియాలో మాత్రం పెరుగుతూ పెరుగుతూ బీభత్సం సృష్టిస్తుంది. టీవీ యాంకర్లు కింద ఒత్తులు ఒత్తకపోయినా 'ప్రస్తుతం' బదులు 'ప్రస్తం ప్రస్తం' అంటున్నా, మృత్యు ఘంటికలు, విలయతాండవం, మరణ మృదంగంలాంటి మాటలు స్పష్టంగా చెవుల్లోంచి గుండెల్లోకి జారేలా పలుకుతున్నారు.

రోజురోజుకీ కరోనా రాజుకోడం మానట్లేదు. ఫోన్లో చెప్పినట్టుగానే కమాల్ సింగ్ అదే ధమాల్ సింగ్ బృందం డాక్టర్ హరినారాయణ దగ్గర దిగారు. ఇంకో రోజు ఆగితే ఇండియా రెడ్ లిస్ట్ లో చేరి, బ్రిటిషేతర్లను యు.కె రానివ్వరు. బ్రిటీష్ పాస్ పోర్టు వున్న వారిని రానిచ్చినా, ఒక్కక్కరినీ భారీ దక్షిణ చెల్లించి పదకొండు రోజులు ప్రభుత్వం సూచించిన హోటల్లో కంపల్సరీ క్వారంటీన్ చెయ్యాలి. ఇప్పుడు ధమాల్ సింగ్ బృందం పది రోజులు హోమ్ క్వారంటీన్ చెయ్యాలి. చేస్తూ రెండో రోజు, ఎనిమిదో రోజు కోవిడ్ టెస్టులు చేయించుకోవాలి. అవి నెగెటివ్ కాకపోతే ఐసొలేషన్ మెజర్స్, అవసరమైతే హాస్పిటల్

అడ్మిషన్ అనుసరించాలి.

ధమాల్ సింగ్ బృందం యు.కె ఫ్లైట్ యెక్కే ముందు కోవిడ్ టెస్టు నెగెటివ్ అనే సర్టిఫికెట్ చూపించాలి. కానీ సింగ్ అండ్ కంపెనీ యెవరూ టెస్ట్ లు చేయించుకోకుండానే లంచమిచ్చి నెగెటివ్ రిపోర్ట్స్ సేకరించి యు.కె ఫ్లైట్ ఎక్కేసారు. అదేవిటని హరినారాయణ అడిగితే, 'టైవెక్కడుంది హై, ఆ మాట కొస్తే కరోనా కంటికి కనబడితే ఎల్లిపో తల్లీ అని దానిక్కూడా లంచం ఆశ పుట్టించి తోలేత్తారు మనోల్లు' అన్నాడు ధమాల్.



లంకలా ఉన్న దేశంలో లంకంత యిల్లు డాక్టర్ హరినారాయణది. సినిమా టీమ్ అంతా అక్కడే హోమ్ క్వారంటీన్ చేసి పది రోజులకి బదులు గైడ్ లైన్స్ ప్రకారం అయిదు రోజుల తర్వాత ఎర్లీ రిలీజ్ కోవిడ్ నెగెటివ్ సర్టిఫికేట్స్ తీసుకుని షూటింగ్ చేద్దావని ఆలోచన. ఈ షెడ్యూల్ లో ఐటమ్ సాంగ్ ఒక్కటే చెయ్యాల్సి ఉంది. మిగతా షూటింగంతా ముందే పూర్తి చేసేసారు. సరే, ఈ అయిదు రోజుల్లో ఐటమ్ సాంగ్ స్క్రిప్టు చూసుకుందాం అన్నాడు ధమాల్.

సాయంకాలమైంది. డాక్టర్ హరినారాయణ ఇంటి గార్డెన్ ఆనింగ్ కింద లోటేబుల్, కంఫర్ట్ కుర్చీలు వున్నాయి. టేబుల్ మీద విస్కీ, వైన్ సీసాలు, సోడాలు, గ్లాసులు, ఐసు ముక్కల చేద రెడీ అయ్యాయి. కుర్చీల్లోకి ధమాల్ సింగ్, హాట్ లిరిసిస్టు ఆగనిశాస్త్రి, ఐటం డాన్సర్ అర్చనా సోమయాజి ఆసీనులయ్యారు. పగటి వెలుగు తగ్గుతోంది. చీకటి పడకుండానే చంద్రోదయమయింది. పౌర్ణమి దగ్గరకొస్తున్నట్లుంది. చంద్రుడు వెన్నెలపిండితో చేసిన చపాతీలా వున్నాడు.

డాక్టర్ హరినారాయణ అతిథుల దగ్గరకు వచ్చాడు. 'మాస్కులు కావలిసి వస్తాయి మీకు' అంటూ అందరికీ తలో మాస్కూ యిచ్చాడు. ముందుగా ధమాల్ సింగ్ కి గ్లాసులో డ్రింకు వడ్డిస్తూ అడిగాడు "విస్కీ అండ్ సోడా, విస్కీ అండ్ ఐస్, విస్కీ అండ్ వాటర్?"

"విస్కీ అండ్ విస్కీ"అన్నాడు ధమాల్.

"మిగతా జనం ఏరీ?"అడిగాడు నారాయణ.

“ఆల్లు... రోఁడు సివర్న పబ్బు కెల్లేరండి!” బదులు చెప్పిన అర్చనాసోమయాజి, తిరిగి అడిగింది “డాఁటారు! తవరేసుకోరా?” అని.

‘లేదమ్మా! కరోనా తగ్గితే గానీ పెగ్గు గురించి ఆలోచించను!” అన్నాడు వర్క్ హోలికుడైన హరినారాయణ.

“మీరు నార్త్ లో యెక్కడ?” అని అడిగాడు.

“నార్తేటండీ?” అడిగింది పిటపిటలాడుతున్నఅర్చన.

“ఆయనుద్దేశం నార్తిండియా అని!” విడమరిచి చెప్పాడు పాటల రచయిత ఆగనిశాస్త్రి.

“ఈవిడిది నార్త్ ఆఫ్ అమలాపురవండి. అసలు పేరు అప్పలనరుసండి. గ్లామరు కోసం గ్రాఫిక్స్ వాడి... అర్చనా సోమయాజిని చేశారు!” అని కూడా విశదీకరించాడు.

“అసలీ సినిమాకి హీరోగా లండన్ ముండాని అనుకున్నాం... కానీ ఆడియన్స్ రిసీవ్ చేసుకోరని, ఆ అయిడియా డ్రాప్ చేసుకున్నాం!” అన్నాడు ఢమాల్ సింగ్.

హరినారాయణ ఒక్క క్షణం చకితుడై, అంతలోనే అర్థమైనట్టు చిరునవ్వుతో “పంజాబీలో ముండా అంటే బోయ్ కదా! లండన్ కుఱ్రోడనా... నీదంతా పంజాబీ విసిరే తెలుగురా!” అన్నాడు.

“ఏదీ కవిరాజా! ఎందాకొచ్చింది హై.. మన ఐటం సాంగ్!” అడిగాడు ఢమాల్ సింగ్.

“రెడీ సార్!” అన్నాడు మూడో పెగ్గుతో ఆగని శాస్త్రి.

“బలె బలె బలె!” అన్నాడు ఢమాల్.

“సదవండి మరి... సెట్ సేసుకుంటా!” అంది అర్చన.

“ఇదుగో పాట. కరోనా టైముకి తగ్గట్టుగా భావప్రకటన గుప్పించాను!” అని మొదలెట్టాడు.

“అబ్బాయి... నీ ముక్కులో పుడకతో కెలకనా

నీ పక్కలో పడకలో వొలకనా

అర్చన... పుడక పెట్టు, నన్నుడక పెట్టు

కెలుకుతూ వొళ్లంతా చుట్టు ముట్టు

దూరమనే దారమూ తెగిపోనాది

దూరిపో జారిపోక దురదగున్నాది

అబ్బాయి... మాస్కులో లస్కు టపా మస్తుగున్నాది

మూస్కోక చూస్కో నిషా పునాది

కరోనా కరోనా మస్తు మస్తు కరోనా

మత్త్ మత్త్ మత్త్ మత్త్ డరోనా...

ఇక్కడ మ్యూజిక్కో మూవ్ మెంట్స్ ఉంటాయి..." అని ఆగాడు ఆగనిశాస్త్రి.

"బలె బలె బలె హోయ్ బలె బలె బలె బలె.." అంటూ నిర్మాత ఢమాల్ సింగ్ కుర్చీలోంచి లేచి, పొట్ట ఊపుకుంటూ నర్తించాడు.

"అయిబాబో, సంపేసినావు కయిరాజా... ఇక నాకియాల సగం సిలీపు గగనమే!" అని తన్మయించింది అర్చనా సోమయాజి.

"మాస్కులు పెట్టుకోకుండా తాగేస్తున్నాం మనం!" డాక్టర్ గారు ఓసారి చెప్పి వూరుకున్నారు.

'బలె బలె చాత్రి! మాస్కు పెట్టుకుంటే మందు ఫిల్టరయిపోతుంది భయ్... ఫర్వానయి. హమ్ ఫామిటీ బబుల్ మే హైం!"

"అదీ గాక... మనలో కరోనా ఏమైనా వుంటే అది కూడా యీ పాటికి మత్తెక్కి నిద్రోయుంటుంది!" అన్నాడు శాస్త్రి.

"కరస్టు కయీస్సరా... కరస్టు!" అంది అర్చనా సోమయాజి.

"ఇంతకీ నీ పిక్చరుకి డైరెక్టరెవర్రా?" అని ఢమాల్ సింగ్ ని అడిగాడు హరినారాయణని.

"యింక వోరూలేరండి. అన్నీ మన కమాల్ గారేనండి!" అంది అర్చన.

"హాఁ హాఁ... అన్నీ నేనే, యాక్టింగ్ తప్ప!" అంటూ ఢమాల్ అర్చన తొడ మీద చరిచాడు.

"ఏటా సరుపు. ఎర్రబడి సలిపేత్తాయి!" అంది అర్చన.

"వో తుమారేనయీ, తస్వీర్ చూసే లోగోంకా... హ్హా హ్హా హ్హాబలె బలె బలె బలె..." అంటూ ముందున్న మందు గ్లాసులు పగిలేలా నవ్వాడు ఢమాల్.

నిర్మాత నవ్వితే మిగతా క్రూ అంతా నవ్వాల్సిందే.

అర్చనా సోమయాజి, ఆగనిశాస్త్రి అలాగే నవ్వు కలిపారు.

"పొద్దున్న వర్కుంది. ఐ బెటర్ టేక్ రెస్ట్. యూ క్యారీ ఆన్!" అని హరినారాయణ ఇంటి లోపలికి నడిచాడు.

రాత్రి ఢమాల్ సింగ్ పక్క మీదకు ఒరుగుతుండగా "ఈజ్ ఎవిరిథింగ్ ఆల్ రైట్?" అంటూ హరినారాయణ రూమ్ తలుపు సగం తీసి అడిగాడు.

"ఓ యస్ హై... సొరగం! నీలాంటి దోస్తుగాడుంటే అంతా సొరగమే హై!" అని బెడ్ మీద వాలాడు ఢమాల్. రూమ్ లోకి రెండడుగులు వేసి "ఒక మాట చెప్పనా కమల్..." అన్నాడు హరినారాయణ.

"ఏక్ నహీ... హజారోం బాత్ కహో నర్రీయిణా!" అన్నాడు ఢమాల్.

"నీ సినిమాలో ఆ పాటేవిటి? ఆ ధోరణేవిటి? అబ్సల్యూట్లీ అప్పాలింగ్!"

"ఏం అచ్ఛా నయీా... బాలేదా గు్రూ?"

"బాగానా? నువ్వో డబ్బున్న వెధవ్వి. కోవిడ్ ముటేషన్ గాడివి!"

"క్యా బోలా హై మితర్ మా!"

"అవున్రా... కరోనాతో కోట్లాదిమంది చచ్చిపోతున్నారు. కోట్లాది మంది బంధువులు ఆప్తులు పోయిన దుఃఖాల సముద్రాల్లో దిక్కు తోచక యేడుస్తున్నారు. వాళ్ల గాయాలన్నీ యింకా పచ్చిపచ్చిగానే వున్నాయి. ఇప్పుడు నీ చెత్త సినిమా, నీ బూతు పాటలూ వాళ్ల మనసుకి యెంత క్షోభ కలిగిస్తాయో ఆలోచించావురా కమల్. యూ ఆర్ ఎ వేస్ట్ ఫెలో!" ఆవేశంతో వూగి పోయాడు హరినారాయణ.

"అబ్ మై క్యా కరూం నర్రీణా!"

"సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్తాను... మందేవన్న రాసిస్తాడు పుచ్చుకో సేడిస్ట్ నాయాల!"

"మనకు మందు పోసుకోవడమే గాని, తీసుకోవడం జాన్తా నయీా!" ధమాల్ మాటల్లో వాల్యూమ్ బాగా తగ్గింది.

"సర్లే, స్లీపిటాఫ్! రేపు మాట్లాడుకుందాం!" అని హరినారాయణ ధమాల్ కి క్విల్ట్ కప్పి రూములోంచి కదిలాడు.

మర్నాడు అంతా నిద్ర లేచారు. ధమాల్ సింగ్ కి దగ్గు మొదలైంది. మధ్యాహ్నం అయ్యే సరికి దగ్గు ముదిరి జ్వరం తగిలింది. ఐరిష్ కాఫీ తాగుతుంటే విస్కీ వాసన తెలియడం లేదు. అర్చనా సోమయాజి, ఆగనిశాస్త్రిని పిలిచి ఆత్రుత ప్రకటించింది. అప్పటికే డాక్టర్ హరినారాయణ హాస్పిటల్ కు చేరి తన డ్యూటీలో బిజీగా వున్నాడు. కంగారుగా ఆగనిశాస్త్రి అతనికి ఫోను చేశాడు.

కట్ చేస్తే...

ధమాల్ సింగ్ రాయల్ లండన్ హాస్పిటల్ బెడ్ మీద ఊపిరి తీసుకొనడానికి అవస్థ పడుతున్నాడు. కోవిడ్ వార్డులో నర్సులు కొంగల్లా అటూ యిటూ నడుస్తున్నారు. డాక్టర్లు ఏదో వెతుకుతున్న దొంగల్లా పరుగులాంటి నడకలు తీస్తున్నారు. స్టాఫ్ అందరూ పిపిఇలు ధరించి చంద్రమండలం చేరిన అంతరిక్ష యాత్రికుల్లా వున్నారు. డాక్టర్ హరినారాయణ ధమాల్ సింగ్ బెడ్ దగ్గర వున్నాడు. ధమాల్ ఆక్సిజన్ లెవెల్ డెబ్బై శాతానికి దిగిపోయింది. ఫేస్ మాస్క్ ద్వారా ఆక్సిజన్ స్టార్ట్ చేశారు. నిమిషానికి పదిహేను లీటర్ల ఆక్సిజన్ అతనికి అవసరం అవుతుంది. ఎమర్జెన్సీ రూమ్ లో ధమాల్ కి సీరీస్ ఆఫ్ ఎక్సరేలు, రక్తపరీక్షలు, అర్జంట్ సిటి స్కాన్ లు చేశారు. రిపోర్ట్సు అతని ఊపిరి తిత్తుల్లో సివియర్ యిన్ఫ్లమేషన్ సూచించాయి. ధమాల్ ని ఐసియుకి తరలించారు.

ఐసియుకి వెళ్లే ముందు ధమాల్ సింగ్ మగతగా, ఆయాసంతో హరినారాయణ చెయ్యి నొక్కుతూ నీరసంగా అన్నాడు "వురే నర్రీయణా– ముఝే అభీ దోస్త్ మే భగవాన్ దిఖారా, మేరా అగలే పిక్చర్ మే యుహి హీరో!" ఆ మాటలు అంటుంటే ధమాల్ కళ్లని కన్నీటి తెరలు కప్పేసాయి. అంతా మసకై పోయింది.

"డోంట్ వర్రీ రా– ఐయామ్ హియర్!" అని అతని చెయ్యి నొక్కాడు హరినారాయణ.

ఐసియులో ధమాల్ కి డెక్సామిథసోన్, క్లెక్సేన్ యింజక్షన్లు, ఐవి యాంటిబయాటిక్స్ యివ్వడం ప్రారంభించారు. తర్వాత

అతనికి టొసిలిజుమాబ్ యింజక్షన్ స్టార్ట్ చేశారు. హై ఫ్లో ఆక్సిజన్ తో పాటు ప్రతి రెండు గంటలకూ ప్రోన్ వెంటిలేషన్ కోసం పడుకోబెడుతున్నారు ఆక్సిజన్ లెవెల్ పెంచేందుకు. ధమాల్ కి ఊపిరి యింకా కష్టంగానే వుంది. అప్పుడు సిపిఎపి అనే టైట్ ఫిట్టింగ్ మాస్క్ తగిలించారు. ధమాల్ సింగ్ కోలుకుంటాడనే నమ్మకం బాగా సన్నగిల్లి పోయింది డాక్టర్ హరినారాయణకి.

కింద అర్చనా సోమయాజి, ఆగనిశాస్త్రి మరో ముగ్గురు సినిమా క్రూ, విషణ్ణవదనాల్తో వెయిట్ చేస్తున్నారు. వారిని కలిసి విషయం చెప్పడానికి హరినారాయణ దిగి వచ్చాడు.

"డాక్టారూ" అని ఆక్రోశించినట్టు పలికింది అర్చన. అప్పుడు ఆమె కనురెప్పలు బాణం తగిలిన పక్షి రెక్కల్లా టపాటపా కొట్టుకున్నాయి.

"ఎలా ఉన్నారు?" ఆశ పడుతున్నట్టు అడిగాడు ఆగనిశాస్త్రి.

"చేసేదంతా చేస్తున్నాం. హీ యీజ్ నో బెటర్. వెరీ గ్రిమ్ సిట్యుయేషన్... ఐయామ్ వర్రీడ్! అఫ్ కోర్స్ వియ్ ఆల్ ఆర్..." అన్నాడు బాధగా హరినారాయణ. ఇక వారి ముఖాల్లో అన్ని కాంతులు అంతరించాయి.

★★★

రెండ్రోజుల్లో ధమాల్ సింగ్ లో డాక్టర్లెవరూ ఊహించని తేడా వచ్చింది. ఇంతకు ముందు కంటే బాగా ఊపిరి తీసుకోగల్గుతున్నాడు. నెమ్మదిగా ధమాల్ సింగ్ ని ఐసియు లోంచి జనరల్ వార్డులోకి మార్చారు. తర్వాత కొద్ది రోజుల్లోనే కోవిడ్ ఇన్ఫెక్షన్ బారి నుంచి బైట పడిన ధమాల్ సింగ్ ను డిశ్చార్జ్ చేశారు.

★★★

డాక్టర్ హరినారాయణ ఇంటి గార్డెన్లో అందరూ కూచున్నారు.

"మా నిర్మాత గారికి పునర్జన్మ యిచ్చారు డాక్టర్ గారూ!" అన్నాడు ఆగనిశాస్త్రి.

"ఆరు డాట్రు కాదు... దేవుడు! అరినారాయణగారు యెంకటేసరుడు!" అంది అర్చన.

"నర్రాయిణా! యే బోలో... యెదవని కదా యెందుకు జాన్ దియారే!"

"నేను చేసిందేవుందిరా! నువ్వు సినిమాలు తీస్తావు. ఈయన పాటలు రాస్తారు. ఈ అమ్మాయి నృత్యం చేస్తుంది. అలాగే నేను వైద్యం చేస్తాను. అది నా వృత్తి. నా పని నేను చేసానంతే!" హరినారాయణ మళ్లీ అన్నాడు. "ప్రతి యుగంలో రాక్షసుల్ని చంపడానికి దేవుడు అవతారం ధరిస్తాడు. ఇప్పుడు తెలుగుతల్లిని చిత్రహింసలు పెడుతున్న ఈ కమల్ గాడి మనసు అనే రాక్షసుడిని చంపడానికి దేవుడు ఈ కరోనా అవతారం ఎత్తాడు!"

"అంటే?" ఆగనిశాస్త్రి ఏదో ఇంకా అనబోయి ఆగిపోయాడు.

"అదేంటి డాట్రారూ! ఈర్నొదిలేసాడుగా మరి!" అడిగింది అర్చన.

"చెప్పానుగా, కమల్ మనిషి... రాక్షసుడు కాదు. అతని మనసే తెలుగు భాషను ఆవహిస్తున్న రాక్షసుడు. ఆ రాక్షసుడు ఇప్పుడు హతమార్చబడ్డాడు!" అని విశదీకరించాడు హరినారాయణ.

"అంటే ఏటంటారు?"అర్చన.

"అంటే ఐటం సాంగ్ కాన్సిల్ హై. షూటింగ్ మొత్తం కాన్సిల్ హై!" అన్నాడు ఢమాల్ సింగ్. "ఫికర్ నయీ, మీకు జ్యాదా కామ్ యిస్తా. మగర్ యాంగిల్ బదల్ కరేంగే!" అని హామీ కూడా యిచ్చాడు.

"ఎంత రిలీపు, ఎంత రిలీపు. నిరుమాతకీ జై" అంది అర్చనా సోమయాజి.

"మన డాక్టరు గారు దేవుడు!" అన్నాడు ఆగనిశాస్త్రి.

"ఈ దేవుడే మన హీరో హై! ఏరా నర్రీయిణా క్యా బోల్తే?"అన్నాడు ఢమాల్ సింగ్ అనబడే కమల్ సింగ్.

డాక్టర్ హరినారాయణ ఏవీ అన్లేదు. హాస్పిటల్లో మిగతా కరోనా పేషెంట్లు కూడా రికవరవ్వాలని తల్చుకుంటున్నాడు.

# రచయిత్రి పరిచయం

## ఇది కథ కాదు

**డా. కె. వి. కృష్ణకుమారి**

తెలుగు సాహితీరంగం, సినిమారంగం వారిచేత... 'కృష్ణక్క' గా పిలవబడుతున్న డా. కె.వి. కృష్ణకుమారి గారు పరిచయం అక్కర్లేని ఋషీమణి. వారిని... సినీ, సాహితీరంగంలో తెలియని వారు లేరు, ఉండరు కూడా! 'కథామంజరి' ఫిబ్రవరి 2022 సంచిక విశిష్ట అతిథిగా విచ్చేసిన డా. కృష్ణకుమారి గారు 'రమ్య కథా కవయిత్రి' గా తెలుగు సాహితీప్రియులను ఆకట్టుకుని, తాను నమ్మిన హ్యూమనిజంతో రచనలు చేసారు. తన వృత్తి 'వైద్యాన్ని' కూడా అదే ఇజంతో అందించారు. సాహిత్యం, వైద్యమే కాదు, నాట్యం, సంగీతం, చిత్రలేఖనంలో కూడా ప్రావీణ్యం సంపాందించారు. వృత్తిపరంగా ఎంత బిజీగా ఉన్నా, తెల్లవారుఝామున లేచి రచనలు చేస్తారు. పదేళ్ల వయసులో ఓ కథ వ్రాస్తే, అలనాటి ప్రఖ్యాత తెలుగు సాహితి మాసపత్రిక 'భారతి' ఆ కథ ప్రచురించింది. వందకు పైగా కథలు, అరవైకి పైగా నవలలు, నాటికలు, ఆధ్యాత్మిక గ్రంథాలు డా. కృష్ణకుమారిగారి కలంనుంచి జాలువారినాయి. ఇప్పటికీ వ్యాసాలు, విశ్లేషణలు వ్రాస్తూనే ఉన్నారు. 'కథామంజరి' కోరిన వెంటనే, కథ వ్రాసి పంపడమే అందుకు నిదర్శనం. చెక్కుచెదరని అక్షరసొగసులు, భాషాసంపద, శైలి... తెలుగు కథకి ఓ గైడ్ లా ఉందనడంలో సందేహం లేదు.

డా. అక్కినేని నాగేశ్వరరావు గారికి అత్యంత ఆప్తురాలైన డా. కృష్ణకుమారి గారు జననం, బాల్యం, ప్రాథమిక, మాధ్యమిక విద్య తెనాలిలో... వైద్యవిద్య కాకినాడ, రంగరాయ మెడికల్ కాలేజిలో జరిగాయి. తర్వాత హైదరాబాదులో ఉద్యోగం, వృత్తి, జీవనం అక్కడే సాగిస్తున్నారు. డా. కృష్ణకుమారి గారిని, భారతదేశ పూర్వ రాష్ట్రపతి కీ.శే. నీలం సంజీవరెడ్డి గారు తమ అభిమాన పుత్రికగా చూసేవారు.

ఎనిమిది దశాబ్దాల పైచిలుకు వయసులో కూడా సభలు, సమావేశాల్లో పాల్గొంటూ, రచనలు చేస్తూ, నిత్యం బిజీగా ఉండే కృష్ణక్కగారు... మరెన్నో రచనలతో చిరకాలం తెలుగు సాహితీరంగానికి వెలుగులు పంచగలరని ఆశిస్తున్నాం!

# ఇది కథ కాదు

డా. కె. వి. కృష్ణకుమారి



***"నువ్వు మారినా నీ మాటలు మారలేదు రాధా!"***
***"నేనేం మారలేదు. నువ్వే బాగా మారిపోయావు. ఇదివరకు కన్నా అందంగా, హుందాగా, గంభీరంగా..." తననే మనసారా చూస్తున్న రాధని చూసి తల దించుకున్నాడు వేణు.***
***"మీ ఆవిడని చూడాలని వచ్చాను!" టేబుల్ పైన ఉన్న స్టెత్ ను తీసుకుంటూ ఓరగా చూస్తూ అంది రాధ. చిన్నగా నవ్వాడు వేణు.***

అవి కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో మెడిసిన్ పూర్తి చేసి హౌస్ సర్జన్ చేస్తున్న రోజులు. నేను హాస్టల్లో ఉండగా విజిటింగ్ రూమ్ నుంచి నుంచి పిలుపు వచ్చింది. నాకోసం ఎదురు చూస్తున్న ఆ అతిథులను చూసి నా హృదయం ఆత్మీయతతో స్పందించింది. ఆప్యాయతతో దగ్గరికి వచ్చిన వారిని చూసి అప్రయత్నంగా చేతులు జోడించాను.

"కృష్ణా! ఏమిటిది మేము పరాయివాళ్ళమా?" మందలింపుగా అంటున్న వ్యక్తిని నవ్వుతూ చూసాను.

"మీరు పరాయివాళ్ళెలా అవుతారు! వృత్తి పరంగా, ప్రవృత్తి పరంగా నాకు ఆపద్బాంధవులు కదా!"

"మరి!" అర్థోక్తిగా చూసిన ఆ వ్యక్తి డాక్టర్ కొమ్మూరి వేణుగోపాలరావు. నేను 'గారు' అంటే వినడానికి ఇష్టపడని వ్యక్తి.

"ఈయనెవరో గుర్తుపట్టారా కృష్ణా?"

ఆయనతో వచ్చిన వ్యక్తిని చూశాను.

"ఎందుకు గుర్తులేదు! డాక్టర్ వేణుగారు కదా! మా క్లాస్మేట్." అంటూ, కళ్ళతోనే ఆయన ఆత్మీయ పలకరింపునందుకున్నాను. ముగ్గురం కూర్చుని కాఫీ కప్పులు అందుకున్నాం.

నా ఆలోచన ఎటో వెళ్ళిపోవడం గమనించిన కొమ్మూరి, "కృష్ణా! నీ ఆలోచనలు అర్థమయ్యాయి." అన్నారు.

"అవును నేను కాలేజీలో చేరడానికి వచ్చిన రోజున ర్యాగింగ్ లో నన్ను ఏడిపించాలని చూసింది...డాక్టర్ కొమ్మూరి, డాక్టర్ వేణు, జమునగారి తమ్ముడు... డాక్టర్ గిరిధర్. చాలా చిన్న వయసులో అమాయకంగా అడుగు పెట్టాను కాలేజీలో. కొమ్మూరి గారు వారిద్దరి వంకా అర్థోక్తిగా చూసి నన్ను అడ్డగించారు. "పాపా! నీకు పాడటం వచ్చా?"

నాకు ధైర్యం ఎక్కువ. 'ఓ..' అంటూ 'ఎందరో మహానుభావులు' పాడాను.

"మరి డాన్స్?"

'వచ్చు' అంటూనే 'ఏరువాక సాగారోయన్నో చిన్నన్న...' పాట పాడుతూ డాన్స్ చేశాను.

"మరి కవిత్వం?"

"అదీ వచ్చు." అంటూ కృష్ణతత్వాన్ని విశ్లేషిస్తుంటే... ముగ్గురూ స్థాణువులైపోయారు.

“అమ్మ! తల్లీ! ఇంకెప్పుడు నీ జోలికి రాం... నమస్కారాలు!” అంటూ అభినందనలు అందించారు. నాకన్నా ఆరు సంవత్సరాలు సీనియర్స్ వాళ్ళు.

“రాగింగ్ రోజు ఇంకా మర్చిపోలేదా?” కొమ్మూరికి సమాధానంగా నవ్వాను.

“మేం సీనియర్స్ అయినా రచనారంగంలో కలిసిమెలిసి నడిచాం. ఊహాలోకంలో విహరిస్తూ, చదువులో వెనుకబడి, నీతో కొన్ని సంవత్సరాలు గడపగల అవకాశం మాకు దొరికింది!” అన్న కొమ్మూరికి సమాధానంగా అన్నాను, “నా అదృష్టం” అని.

మేం ముగ్గురం సాహితీపరంగా ఎన్నో విషయాలను చర్చించుకునే వాళ్ళం. నేను వయసులో చాలా చిన్నదాన్నైనా, వాళ్ళిద్దరూ నా అభిప్రాయాలకు ఎంతో విలువనిచ్చేవారు. వేణుగారు హౌస్ సర్జెన్సీ ముందుగానే పూర్తి చేసుకుని పిజీ కూడా పూర్తి చేసుకుని చెన్నైలో స్థిరపడిపోయారు. ఆ తర్వాత కొమ్మూరిగారి ద్వారా తెలిసింది... వేణు ఎవరికో మనసిచ్చారనీ, పెద్దల అభ్యంతరాల వలన పెళ్లి చేసుకోలేక పోయారనీ, ఆ అమ్మాయికి వేరొకరితో పెళ్లైందని తెలిసి, మానసికంగా క్రుంగి పోయి, వృత్తి ప్రవృత్తులకు న్యాయం చేయలేక దయనీయస్థితిలో ఉన్నప్పుడు కొమ్మూరి గారి కౌన్సిలింగ్ ద్వారా కోలుకుంటున్నారని, ప్రస్తుతం బాగానే ఉన్నారనీ... బాగానే కనిపిస్తున్నారు. తను వ్రాయబోతున్న రచనల గురించి, సర్జన్ గా తన మానసిక ప్రశాంతత స్థితిని గురించి వేణుగారు చెప్తుంటే నేనూ, కొమ్మూరి గారు ఎంతో ఆనందపడ్డాం.



ఆ తర్వాత ఓ రోజు... కొమ్మూరిగారి నుంచి నాకు ఫోనొచ్చింది.. “కృష్ణా! ఒకే వ్యక్తిలో సర్జనూ, భావుకత గల రచయితా ఉండటం చాలా కష్టం కదా! మనకు అనుభవమే కదా! అయితే వేణు మానసికస్థితి అనూహ్యంగా... అతని వ్యక్తిత్వం మీద దెబ్బ తీసింది... నేను ఎందుకు ఫోన్ చేస్తున్నానంటే వేణు గురించీ, అతని మనస్తత్వం గురించీ నీకు బాగా తెలుసు. మధ్యలో జరిగిన ట్రాజడీ కూడా నా ద్వారా విన్నావు! ఇప్పుడు అతని స్థితిని ప్రత్యక్షంగా చూసావు. అతను డిప్రెషన్ లోకి వెళ్లాల్సివచ్చిన సంఘటన గురించీ, ఇప్పటి స్థితి గురించీ, ఒక రచయిత్రిగా, డాక్టర్ గా ఆలోచించి చిన్న కథ వ్రాయి... వ్రాయాలి నువ్వే!” అంటూ చనువుగా గట్టిగానే చెప్పారు.

“సరే!” అప్రయత్నంగా అన్నాను.

నాలో వేణు ప్రవేశించాడు. మమతలు, మమకారాలు పెంచుకున్న కొద్దీ పెరుగుతాయి. విడదీయలేని అపూర్వ అనుబంధానికి అంకురార్పణ చేస్తాయి. పవిత్రమైన అనుబంధం అనిర్వచనీయమైనది... అపూర్వమైనది. ఆత్మా, పరమాత్మా తత్వానికి నిజమైన అర్థాన్ని స్మరింపజేసే... అర్ధనారీశ్వర తత్వం... ప్రేమైక హృదయాలలో సుస్థిరంగా ఉంటుంది. ఉండాలి కానీ...

నా కలం ఆగిపోయింది. ఆవేదనతో గతం తాలూకు స్మృతులతో హృదయం భారమై, నిస్తేజంగా ఉండిపోయాడు వేణు. ‘ఎంత మరిచిపోవాలనుకున్నా రాధ స్మృతులు మరుపు రావటం లేదు. కలాన్ని సాగనివ్వటం లేదు. వృత్తికి న్యాయం చేయనివ్వటం

లేదు. నా మనసు ఇంత బలహీనమైనదా! ఇలా అయితే నా కలం బలంతో ఎవరికి న్యాయం చేయగలను! కత్తి పట్టిన వైద్యునిగా ఎందరిని కాపాడగలను...!!!'

తను శాపంలా భావించే గతాన్ని మరువలేక పోతున్నాడు.

తను మెడిసిన్ చదివే రోజుల్లో తనున్న ఇంటివారమ్మాయి రాధ. అతిచనువుతో, చొరవతో తనకెంతో దగ్గరైంది. రాధ సౌందర్యం తన మనసులో నిండి, కలం ద్వారా అద్భుతమైన రచనలకు ప్రాణం పోసేది. రాధే తన కవితకు ఆధారం. రాధే తనలోని రస స్పందనలకు మూలం అనుకునేవాడు. ఆమె ఒక్కరోజు కనిపించకపోతే కలం ఆగిపోయేది. హాస్పిటల్లో, పనుల్లోనూ చురుకుదనం తగ్గిపోయేది. ఆమె బాలవితంతువని తెలిసినా మమతా, అనురాగం పెంచుకున్నాడు. కానీ, పెద్దలకీ, కుటుంబం కట్టుబాట్లకీ ఇంట్లోవారి బెదిరింపులకీ, తీవ్ర వ్యతిరేకతకీ తలవంచక తప్పలేదు. బాధ, ఉక్రోషం ఆపుకోలేక తనకన్నా మానసికంగా ఉన్నతుడైన వ్యక్తిని చేసుకుంది రాధ. మనసు తన దగ్గరే ఉంచి తనువుతో మాత్రం వెళ్లుటుందా? ఏమో!!

కవికీ, వైద్యుడికీ పొత్తు కుదరదు. మనసుకీ, చేతలకీ పోలికే ఉండదు. మనసు మరో లోతుల్లోకి పరుగులు తీస్తూ ఉంటుంది. శరీరం, చేతలూ, భావాలు అతిదూరంగా పయనిస్తూ ఉంటాయి. ప్రాణభయంతో, తన మీద నమ్మకంతో... ప్రాణ భిక్ష నర్థించే ఎందరో వ్యాధిగ్రస్తులను ఆదుకున్నాడు తను. మనసు సహకరించకపోయినా, శస్త్ర చికిత్సలు చేస్తూ, ఎంతో మానసిక వేదన అనుభవిస్తూనే ఉన్నాడు. అయినా వాళ్ళ కళ్ళల్లో ఆనందాన్ని గుర్తించి తాను మనశ్శాంతిని అందుకుంటూనే ఉన్నాడు. ఈ స్పందనలు ఒక్క తనలోనేనా, లేక డాక్టర్ రచయిత ఆయన ప్రతి వారిలోనూ ఉంటూనే ఉంటాయా?

కత్తి పట్టుకున్నప్పుడు మనసు విపరీతంగా చలిస్తుంది. ఆ తర్వాత కలం పట్టుకున్నాక మనసు కుదుటపడటానికి చాలా సమయం పడుతుంది. మానవత్వానికీ, మానసిక విశ్లేషణకీ... మారు పేరు కవి హృదయం. రసాత్మక హృదయానికీ, రసిక మనోభావాలకీ ప్రతివారిలోనూ, ప్రతి వస్తువులనూ చలనం గోచరిస్తుంది. సౌమ్య హృదయంలో అనుబంధాలను పెంపు చేసుకుంటాడు కవి. మరి స్నేహార్ద్రత ఎందుకు దూరమౌతుంది? కారణం... రాధ స్మృతుల నుంచి తాను బయటపడలేక పోవడం వలననేనా? విరహవేదనను గుండెల్లో దాచుకోలేకపోవడం వలననేనా? ఏమో! ఏమైనా తాను ఇలా ఉండకూడదు. డాక్టర్ కొమ్మూరి దగ్గర కొన్నాళ్లు కౌన్సిలింగ్ తీసుకోవాలి.

ఈజీ చైర్లో నిర్లిప్తంగా వాలిన డాక్టర్ వేణు ఉలిక్కిపడ్డాడు.

"డాక్టర్! నేనెవరో గుర్తున్నానా?" వేణు నిర్విణ్ణుడయాడు.

"అదేమిటి? దెయ్యాన్ని చూసినట్టు చూస్తావేం?" గలగలా నవ్వుతోంది.

అవును అదే నవ్వు... అదే చూపు... "రాధా!!" విస్మయంగా లేచి నిలబడ్డాడు.

"హమ్మయ్య! గుర్తొచ్చాను కదా" తృప్తిగా నిట్టూర్చి కుర్చీ జరుపుకుని కూర్చుంది.

"ఇదేనా రావటం! ఒంటరిగా వచ్చావేం?"

"ఏం రాకూడదా! అయినా నీదగ్గర నాకేమీ అపకారం జరగటం లేదుగా!"

"నువ్వు మారినా నీ మాటలు మారలేదు రాధా!"

"నేనేం మారలేదు. నువ్వే బాగా మారిపోయావు. ఇదివరకు కన్నా అందంగా, హుందాగా, గంభీరంగా..." తననే మనసారా

చూస్తున్న రాధని చూసి తల దించుకున్నాడు వేణు.

"మీ ఆవిడని చూడాలని వచ్చాను!" టేబుల్ పైన ఉన్న స్టెత్ ను తీసుకుంటూ ఓరగా చూస్తూ అంది రాధ. చిన్నగా నవ్వాడు వేణు.

"నేను... పెళ్లి చేసుకోలేదు కదా రాధా!" రాధ కళ్ళల్లో మెరుపు స్పష్టంగా కనిపించింది.

"అవునులే... నీకు పెళ్లెందుకు? పగలంతా ఆపరేషన్లు, రాత్రంతా కథలూ, నవలలూ! ఇంక టైం ఎక్కడ ఉంటుంది నీకు. నీలోనే సర్జనూ, కవీ ఇంకా కాపురం చేస్తూనే ఉన్నారా? ఎప్పుడు పోట్లాడుకోటం లేదా?"

".....!"

"అవునులే మీలాంటి వారికి మనసనేది అసలుంటేనే కదా! మీ మాటలకు చేతలకు అసలు పోలికే ఉండదు అవునా!" ఛెళ్లున కొరడాతో చరిచినట్లైంది.

"ఏమిటి? ఏదో అడగబోయి ఆగిపోయావు? నువ్వు అడగలేకపోయినా చెప్పడం నా ధర్మం. కొందరిలా నీతులు వల్లిస్తూ, పెద్ద సంస్కర్తలా కథనాలు అల్లుతూ అవసరం వచ్చినప్పుడు తప్పించుకునే రకం కాదు మా ఆయన. మానవత్వం ఉన్న మనిషి. పోతే మాకొక బాబు. పేరు వేణు!"

ఒక్కొక్క మాట శూలంలాగా గుచ్చుకుంటోంది.

"పోనీలే... ఇంతకి అసలు విషయం... నేనొక పని మీద వచ్చాను. అదైతే వెళ్ళిపోతాను. ఇంక తర్వాత నువ్వు తీరిగ్గా కథలు రాసుకుంటూ..." అర్ధోక్తిగా ఆగిపోయింది.

'ఏమిటన్నట్టు' చూశాడు.

"పనిలోనే కోరిక కూడా ఉందనుకో! అదే... అదే నీ చేతుల్లో చనిపోవాలని."

"నీకేమైంది రాధా! ఏమిటా మాటలు!" బాధగా, మందలింపుగా చూస్తుంటే, తల దించుకుంది రాధ.

"ఏం? ఎప్పుడో అప్పుడు చావాల్సిందే కదా... అంతకన్నా కోరుకున్నప్పుడు కోరుకున్న వాళ్ళ చేతుల్లో చావడం అదృష్టం కదూ!" అర్ధోక్తిగా అంటున్న రాధని తెల్లబోయి చూసాడు వేణు.

"నేను అతిథిగా రాలేదు పేషెంట్ గా వచ్చాను." భారంగా అంటోంది రాద.

"పేషెంట్ గా?" ఉలిక్కిపడ్డాడు వేణు.

"ఎందుకంత ఆశ్చర్యం? ఏం రాధ రోగి కాకూడదా... ఏదో ఆపరేషన్ అవసరమన్నారు. అది నీచేతే చేయించుకోవాలని అందరినీ వదిలి ఇంత దూరం వచ్చాను." రాధ కన్నీళ్లు చూసి చలించిపోయాడు వేణు.

"నీకు ఆపరేషనేమిటి రాధా... అసలేమైంది నీకు?" ఆత్రుతగా లేచాడు వేణు.

"బావుంది. నాకేం తెల్సు? పరీక్ష చేసి నువ్వే చెప్పాలి." స్క్రీన్ వెనకకు నడిచింది.

★★★

బయాప్సీ రిపోర్ట్ వచ్చింది.

"....!"

"మై గాడ్ రాధకి బ్రెస్ట్ కాన్సర్..."

"......"

"భయంగా ఉందా రాధా?"

ఆపరేషన్ థియేటర్ కి వెళ్లే ముందు వేణు కంఠంలో ఆవేదనని ఆర్ద్రంగా చూస్తూ క్షణం స్తబ్దుగా ఉండిపోయింది.

"భయమేం లేదు. నిండా మునిగినవాడికి చలుంటుందా? నాకన్నా నువ్వే అంతలా భయపడి పోతున్నావేమిటి? ఇలా అయితే నువ్వు సర్జన్ గా ఏం పైకొస్తావు...?" ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయింది,

"అది సరే వేణు! నాకు ఆపరేషన్ చేస్తావనుకో, ఆ తర్వాత నేనే కారణంగానైనా చనిపోతాననుకో... అప్పుడు ఇప్పట్లోలాగ ఆపరేషన్స్ చేయగలవా? మరి కథలు, నవలలు వ్రాయగలవా? నేనెందుకంటున్నానంటే, నీ వృత్తికి నేనే స్ఫూర్తి అనేవాడివి కదా... నీకు కవితకు నేనే ఊపిరి అనేవాడివి కదా! అదే ఒకప్పుడు... మరి ఆ ఊపిరే పోతే...?" తమాషాగా నవ్వింది రాధ.

తనను తాను నిగ్రహించుకుంటూ అతి ప్రయత్నం మీద నిలదొక్కుకుంటూ చిన్నగా అన్నాడు వేణు... "ఇంటినుండి ఎవరూ రాలేదా?"

విషాదంగా నవ్వింది రాధ. "ఎవరున్నారని రావటానికి? అయినా నువ్వు ఉన్నావు కదా! ఇంక నాకెవరు కావాలి? అయినా నీకు తెలీదు కదూ... మా ఆయన పోయి రెండు సంవత్సరాలైంది. తాగి తాగి కేన్సర్ తో పోయాడు. నా బాబు వేణు పుట్టగానే పోయాడు. అయినా నా వేణు... నా మనసులో... అనుక్షణం తిరుగుతూనే పలకరిస్తూనే ఉంటాడు. ఇంక అమ్మానాన్నల్ని వదిలి వచ్చేసాను."

నిశ్చేష్టుడై నిలబడి పోయాడు వేణు.

★★★

ఆపరేషన్ టేబుల్ మీద రాధను చూసి ఒక్క క్షణం చలించిపోయాడు వేణు. ఎనస్తీషియా ఇచ్చారు. ఆపరేషన్ చేయవలసిన భాగాన్ని నిర్వేదంతో క్లీన్ చేస్తున్నాడు వేణు. తనలోని కవితాహృదయాన్ని స్పందింపజేసి, మనసునిండా మధుర భావాలతో నింపి, తనలోని కవిని ఉద్వేగపరిచి రసస్పందనలతో నింపి, కలంలో ఒంపి, లక్షలాది అభిమానులను తనకు సొంతం చేసిన ఈ అసమాన సౌందర్యరాశిని దారుణంగా గాయపరచబోతున్నాడు.

స్కాలపల్ పైకి తీసాడు. చెయ్యి విపరీతంగా వణుకుతోంది. మనసును దిటవు పరుచుకొని... ఒక క్షణం స్కాలపల్ ని చూశాడు. మరుక్షణం చర్మాన్ని చీల్చిందది. చివ్వున రక్తం పైకి చిమ్మింది. మాంసపు గడ్డ వికృతంగా చూస్తోంది. వేణులోని కవి విపరీతంగా చలించిపోయి, కళ్ళు మూసుకున్నాడు.

అయినా సర్జన్ తనలో నుంచే తన బాధ్యతను గుర్తు చేసాడు. వేణు హృదయం కరుడుగట్టింది. చేతులు కర్తవ్యసాధనతో కదలాడుతున్నాయి. రసికులు, కళోపాసకులు, సౌందర్యోరాధకులు, ప్రేమైకహృదయులూ చేయకూడని పనిని తను

చేస్తున్నాడు. అందరూ తన హృదయంలోనే ఉన్నా, అసమాన నిగ్రహాన్ని అరువు తెచ్చుకున్నాడు వేణు.

"సిస్టర్! కాట్ గట్!" గంభీరంగా ధ్వనించింది వేణు కంఠం. సూచర్స్ కోసం కాట్ గట్ ని సూదిలోకి ఎక్కిస్తోంది సిస్టర్. వేణు చూపు మరల్చుకున్నాడు. సూదిలో దారం, కవితలో ప్రాణం, ఎంత కాలం నిలుస్తుంది!

చాలాభాగం తీసేయగా బ్రెస్ట్ కేన్సర్ సంబంధించిన భాగాలు లేకపోయినా, సూదితో చర్మాన్ని కుట్టే ప్రయత్నంలో ఉన్న వేణు పెదాలు చిత్రంగా విచ్చుకున్నాయి. ఈ రక్తపు గడ్డలకు, చర్మపు తొడుగులకేనా కవులు కవనాలు సృష్టిస్తారు!! ఈ కృత్రిమ సౌష్టవాలకేనా మహామహులు సైతం పిచ్చివారవుతారు!! గుప్పెడు ప్రమాణంలో ఉండి కాలం మూడే వరకు కొట్టుకునే ఈ గుండెలోనేనా ప్రేమా, అనురాగం, ఆరాధన అనే అమృతాన్ని నింప ప్రయత్నిస్తారు!! కవులెంత పిచ్చివారు!!! విరక్తిగా నవ్వుకున్నాడు. ఇటువంటి ఆపరేషన్స్ ఎన్నిటినో నిర్వికారంగా చేయగలిగాడు. కానీ, ఈనాటి మానసిక వ్యధ... తనని సర్జన్ గా నిలబెట్ట గలుగుతుందా? తనలోని భావుకతకు తిరిగి ప్రాణం పోయగలుగుతుందా!!

అన్యమనస్కంగానే ఆపరేషన్ పూర్తి చేసాడు వేణు. డ్యూటీ రూమ్ లో కాఫీ కప్ అందుకుని యథాలాపంగా టేబుల్ వైపు చూశాడు. తను సగం రాసి వదిలేసిన రచన తాలూకు కాగితాలు జాలిగా పలకరిస్తున్నాయి. కలం అందుకోబోయాడు. హృదయసౌకుమార్యం కలిగి సౌందర్యాన్వేషణలో ఉదాత్త పంథాలో ఎందరికో మార్గదర్శకంగా, ఇలాగే రచయితగా తను మిగలగలడా? ఆ సౌకుమార్య హృదయాన్ని శస్త్రచికిత్స... ఈ శస్త్ర చికిత్స క్షణక్షణం ఛేదిస్తూ ఉంటే ఆ నరకయాతనని అనుభవిస్తూ సర్జన్ గా ముందుకు సాగగలడా? కనీసం ఏ ఒక్కరైనా తనలా నిలిచిపోయే అవకాశం ఉందా! ఒక స్త్రీ పట్ల ఇంతటి మానసిక బలహీనత అనుభవిస్తున్నాడేమిటి?

"డాక్టర్! డాక్టర్...!" సిస్టర్ ఆదుర్దాగా పిలుస్తుంటే ఉలిక్కిపడి చూశాడు వేణు.

"డాక్టర్... మిసెస్ రాధ... ముందర నిర్ణయించుకుని వచ్చినట్టున్నారు... సూయిసైడ్ చేసుకున్నారు!" ఆందోళనతో చెప్తుంది సిస్టర్.

అదిరిపడి లేచాడు వేణు. "ఎంత పని చేసావు రాధా!" గొంతు తడారి పోయింది హృదయం బ్రద్దలై పోయింది. "నీ కవితకి నేనే... ఊపిరన్నావుగా... ఈ ఊపిరే పోతే.. మరి నువ్వు!! నేనేమైపోతాను? ఏమైపోవాలి??" వేణు హృదయం మూగబోయింది.

★★★

నా కలం ఆగిపోయింది. ఇంక వ్రాయాల్సి వల్సింది లేదనిపించింది. డాక్టర్ వేణుకు గతం తెలుసు. మధ్యలోని అవాంఛనీయ సంఘటనలు డాక్టర్ కొమ్మూరి ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నాను. కౌన్సిలింగ్ ద్వారా డాక్టర్ వేణు... డాక్టర్ గా తన విలువని తగ్గించకూడదనుకున్నాడు. సర్జన్ గా ఎందరికో ప్రాణదానాలు చేసి తన విధిని సక్రమంగా నెరవేర్చాలనుకున్నాడు. తనలోని కవితాహృదయం కేవలం దైవసంకల్పం వల్ల కలిగినదే. ఈ హృదయ స్పందనతో ఎందరికో మానసికోల్లాసాన్ని కలిగిస్తాను... కలిగించాలి!!

వెళ్లే ముందు నాతోనూ, డాక్టర్ కొమ్మూరి వేణుగోపాలరావు తోనూ, డాక్టర్ వేణు నమ్మకంగా అన్న మాటలు గుర్తుకొచ్చి నా మనసు సంతృప్తితో నిండిపోయింది.

# రచయిత పరిచయం

## వైద్యో నారాయణో భవః

**డా. కె. బాబూరావు**

తెలుగు, ఆంగ్ల సాహిత్యాల మీద ఉన్న అమితమైన ఆసక్తితో వైద్యవృత్తిలో ఉన్నాసరే, ప్రవృత్తిగా రచనలనే ఎన్నుకున్న డా. బాబురావుగారు పేరున్న సాంఘిక సేవకులు కూడా! ఆంగ్ల, తెలుగు భాషలలో కవితలు వ్రాసే డా. బాబురావుగారు పశ్చిమగోదావరి జిల్లా ఊదూరు, పాలకొల్లు, భీమవరంలలో ఉన్నత విద్యాభ్యాసం చేసి, మెడిసన్ ఆంధ్రా మెడికల్ కాలేజీలో చేసారు. ఆ రోజుల్లో ఆటలు, సోషల్ వర్క్, ఎన్.సి.సి.లలో ఉత్సాహంగా పాల్గొంటూ చాలా బహుమతులు అందుకున్నారు. సర్జన్ గా రాష్ట్రప్రభుత్వ సర్వీసులో చేరి, ఆ తర్వాత కాలంలో భారత రైల్వేలో మెడికల్ ఆఫీసర్ గా ఎంపికయ్యారు. విశాఖపట్నం రైల్వే ఆసుపత్రిలో ముప్పై సంవత్సరాలు పనిచేసి, అక్కడే రిటైరయి, తిరిగి ప్రైవేటుగా వైద్య సేవలు మరో పదహారు సంవత్సరాలు అందించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, విశాఖ జిల్లా వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్, వాకర్ క్లబ్... మొదలగు సంస్థలలో బాధ్యతాయుతమైన పదవులతో సేవలు అందిస్తున్న డా. బాబురావు గారు ఎన్నో వైద్య విషయాలమీద ఎన్నో వ్యాసాలు రాసారు. డా. బాబురావుగారి ఆంగ్ల కవితలు 'హార్ట్ బీట్ ఆఫ్ ఎ డాక్టర్' గా సంకలనం, 'యస్... యు కెన్ డూ ఇట్' ఆంగ్ల వ్యాస సంపుటి, 'ఆరోగ్య దీపిక' వ్యాస సంపుటి, 'సామాన్యుని సాక్షాత్కారం', 'మనిషితనం', 'నిశ్శబ్ద శబ్దం' తెలుగు కవితా సంపుటాలుగా వచ్చాయి. వీరి సతీమణి శ్రీమతి సుమిత్ర గారు కాలేజీలో ఆంగ్ల భాషోపన్యాసకులుగా పనిచేసారు. సమాజానికి పనికొచ్చే సేవలు అందిస్తూ, నిత్యం బిజీగా ఉండే డా. బాబురావుగారిని 'కథామంజరి' కోరిన వెంటనే కథ వ్రాసి పంపారు. సమాజానికి అందిస్తున్న సాంఘిక సేవలతో పాటు, సాహిత్య పరమైన సేవలు కూడా చిరకాలం అందించగలరని ఆశిస్తున్నాం!

# వైద్యో నారాయణో భవః

డా. కె. బాబూరావు



✆ 9849858524

***"ఇదేం నరకమండి బాబూ....."***
***"మీరు అలా కంగారు పడితే ఎలా? ఈ సెలైను పూర్తిగా తీసుకుంటే మీకు బాగుంటుంది."***
***"అలాగే డాక్టరు గారూ! మీరు చెప్పినట్టే వింటాను."***

రోజూ నా క్లినిక్ కి వచ్చే సాధారణ రోగులు చాలామంది వారి బాధలు పాత విషయాలతో ముడిపెడుతూ వారిజబ్బును వారే వూహించుకొని చెప్పుతారు తప్ప, వారికున్న ప్రస్తుత అసలు విషయం చెప్పరు. రోగనిర్ధారణ కూడా చేసుకుని అదే విషయం చెప్పుతూ ఉన్నపుడు, వారికూడా వచ్చినవారి హడావుడి చెప్పనలవికాదు. రోగికున్న బాధ వాటి పూర్వాపరాలు, రోగలక్షణాలు తెలుసుకోటానికి అనేకప్రశ్నలు అడగవలసి వస్తుంది. వాటికి సరైన సమాధానాలు సరైన రీతిలో డాక్టర్లకు చెపితే రోగనిర్ధారణ చేయటం, వైద్యం చేయడం సులభతరమౌతుంది. అందుకే వైద్య పరిభాషలో రోగ పూర్వాపరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అన్నివిషయాలు క్షుణ్ణంగా చెబితే అనవసరమైన వైద్య పరీక్షలు చేయనవసరం లేదు. కాని రోగితో వచ్చిన బంధుగణం... ఏ పరీక్షలు చేయాలోకూడా ఉచితరీతిలో సలహాలిస్తూ ఒత్తిడి చేస్తుంటారు. ఇక కొంతమంది రోగులైతే సాధారణమైన జబ్బులకు కూడా ఎంత హడావిడి చేస్తారో!

పాపారావుగారికి వో అరవై సంవత్సరాలుంటాయి. నా క్లినిక్ రూమ్ లోకి వస్తూనే ...

"డాక్టరుగారూ! ఈ గేస్ ట్రబుల్తో రాత్రంతా యమయాతన పడ్డానండీ." అంటూ నా ఎదురుగుండా కూర్చున్నారు.

"ఇంతకీ ఏమైందండీ?"

"ఏమైందంటారేంటండి బాబూ! పొట్ట బిర్రబిగుసుకు పోయింది. అస్తమానం గేస్ పాసయిపోతుంది....."

"ఎలాగ? తేనుపులొస్తున్నాయా లేక అపానవాయువు వస్తుందా?"

"అదేనండిబాబూ! నొప్పితో రెండూ వస్తున్నాయి.."

"విరోచనం అయిందా... ఎన్నిసార్లు అయింది?"

"రాత్రంతా మాటిమాటికి అదేపని..."

"అంటే నీళ్లలా విరోచనాలవుతున్నాయా?"

"నీళ్ళలా ఏంటండి బాబూ... పిచికారి కొట్టినట్లుగా అవుతుంటేనూ..."

"కడుపు నొప్పి వస్తుందా?"

"వోర్నాయినో... బాంబు పేలినంత నొప్పండీ బాబూ..."

"కడుపులో తిప్పినట్టూ... వాంతి వచ్చినట్టూ వుందా?"

"అవునండీ... కడుపులో చెయ్యిపెట్టి దేవినట్టుంది, కాని వాంతి రాదు... వచ్చేస్తే బాగుణ్ణు..."

"ఎప్పటినుండి మీకిలా ఉంది?"

"నిన్న రాత్రి ఒంటిగంటకి మొదలై, రాత్రంతా గంట గంటకీ విరోచనాలు అవుతూనే ఉన్నాయి! అర్థరాత్రి మా అబ్బాయి ఏదో షాపునుండి గేసు మాత్రలని తెచ్చి వేశాడు. కాని ఏమీ ఫలితం లేదు!"

"ఏం మాత్రలు వేశారు?"

"ఏవో గేసు మాత్రలని ఇచ్చాడు, కాని పేరు తెలియదండీ."

"సరే ఒకసారి బల్లమీద పడుకోండి, మీ పొట్ట పరీక్ష చేస్తాను."



ఆయన బల్ల మీద వెల్లికిలా పడుకున్న తర్వాత పొట్ట నెమ్మదిగా నొక్కి చూస్తే నొప్పిగా ఉందన్నారు. వేళ్లతో కడుపు టేప్ చేసి చూస్తే, డ్రమ్ములా మోగుతుంది.

"నిన్న పడని ఆహారం ఏమైనా తిన్నారా?"

"అవును డాక్టరు గారూ! నిన్నమధ్యాహ్నం పెళ్లి భోజనానికి వెళ్లా, నాకు గేస్ట్రిక్ ప్రోబ్లమ్ ఉందని తెలిసినా, నా జిహ్వచాపల్యం వల్ల అక్కడున్న మాంసాహార పదార్థాలు మటను గోంగూర, రొయ్యల పులావు కాస్త ఎక్కువగానే తిన్నా! ఆ తర్వాత నాకు కొంత కడుపులో అసౌకర్యమనిపించినా, అక్కడున్న రసగుల్లాలు కూడా తిని అరుగుదలకు వారిచ్చిన మిఠాయికిళ్లీ వేసి సాయంత్రానికి యింటికి చేరాను. ఆ తర్వాత రాత్రి తొమ్మిది గంటలనుండి మొదలైందీ బాధ!"

"అవునూ మీకు గేస్ట్రిక్ ప్రోబ్లమ్ ఉందనీ, తిండి విషయంలో చాలాజాగ్రత్తగా ఉండాలని... ఇదివరకు మీకు చెప్పాను కదా?"

"అవుననుకోండి! కానీ పెళ్లి భోజనంకి వెళ్లాం కదా, నాకిష్టమైన ఐటమ్సన్నీ చూసేసరికి నాకు కంట్రోలు పోయింది!"

"సరే, మీకు బాగా అజీర్తి వచ్చి ఇలా నీళ్లవిరోచనాలు అయి, ఒంట్లో నీరు పోవడం వల్ల మీకు డీ హైడ్రేషను వచ్చింది. బి.పి. బాగా డౌనైపోయింది. అందుకు మీకు నాలుగు సెలైను బాటిల్స్ అయినా ఎక్కించాలి. ఆ తర్వాత మందులు వేసుకొందురు గాని."

"మరి ఎంతసేపు పడుతుంది డాక్టరు గారూ?"

"కనీసం మూడు నాలుగు గంటలు పడుతుంది... ఆ తర్వాత మీకు వేసుకోడానికి మాత్రలు, తాగడానికి ఎలక్ట్రాలు ఇస్తాను, వాటితో మీకు తగ్గిపోతుంది. మరింకెప్పుడూ ఇలాంటి పనులు చేయకండి!"

"కాని చాలా నీర్సంగా ఉండి కళ్లు తిరుగుతున్నాయి డాక్టరుగారూ!"

"ఉండండి... బి.పి. చూస్తాను... అరే బి.పి. బాగా తగ్గిపోయింది. నైంటీ బై సిక్టీ ఉంది. బాగా డీ హైడ్రేషను కూడా వచ్చింది!"

"అంటే ఏంటి డాక్టరు గారూ?"

"మీ ఒంట్లో నీరు బాగా పోయింది. అత్యవసరంగా మీకు సెలైను ఎక్కించాలి. అలా బల్లమీద పడుకోండి, సెలైను స్టార్ట్ చేస్తాను."

"ఎంతసేపు పడుతుంది డాక్టరు గారూ?"

"మూడు గంటలైనా పడుతుంది. ఓ మూడు లేక నాలుగు బాటిల్స్ ఎక్కించాలి. మీరు కామ్ గా ఉండండి..."

ఆయనకి సెలైన్ స్టార్ట్ చేసి దగ్గరుండమని మా ఎటెండెంట్ కి చెప్పి నా రూమ్ కి వచ్చి మిగతా పేషంట్స్ ని చూడ్డంలో బిజీ అయిపోయాను.

అలా ఒక గంట గడిచిన తర్వాత ఎటెండెంట్ పరిగెత్తికుంటూ వచ్చి "సార్ మిమ్మల్ని పాపారావుగారు పిలుస్తున్నారు. విరోచనం అయ్యేటట్టుందట బెడేపేన్ పెడతానంటే కాదు... సెలైన్ తీసేస్తే బాత్ రూమ్ కి వెల్తానని గొడవ పెడుతున్నారు!" కంగారుగా అన్నాడు.

నేను వెంటనే పాపారావు దగ్గరకి వెళ్లి "మీకు బెడ్ పేన్ పెడతారు దాన్లో వెళ్లండి, ఫర్వాలేదు" అని చెప్పాను.

"అదెలాగెళ్ళాలండి బాబూ... బెడ్ మీద?"

"మరి లేకపోతే సెలైన్ తీసి పెట్టడం కష్టం కదా... సెలైను ఉంచుకుని బాత్ రూముకెళ్ళలేరుకదా... అందుకని బెడ్ పేన్ పెట్టించుకోండి. క్లీనింగ్ అంతా ఎటెండెంట్ చూసుకుంటాడు!"

"ఇదేం నరకమండి బాబూ....."

"మీరు అలా కంగారు పడితే ఎలా..? ఈ సెలైను పూర్తిగా తీసుకుంటే మీకు బాగుంటుంది."

"అలాగే డాక్టరు గారూ! మీరు చెప్పినట్టే వింటాను ."

అలా మూడుగంటలసేపు ఆయనను బెడ్ మీద ఉంచడానికి మేమంతా శ్రమపడి, ఈ సెలైను ప్రహసనం ముగించాము.

ఆతర్వాత మందులు రాసి, ప్రిస్క్రిప్షను పాపారావుగారికి ఇచ్చాను .

"ఇవి ఎలా వాడాలి డాక్టరుగారూ?"

"ఇదిగో చూడండి... ఈ ఎలక్ట్రాలు గంట గంటకీ రెండు స్పూన్లు గ్లాసు నీళ్ల లో కలుపుకు తాగాలి!"

"మరి భోజనం డాక్టరుగారూ?"

"చూడండీ...మరొక పన్నెండు గంటలవరకు, ఈ ఎలక్ట్రాలే మీ భోజనం! ఈ మాత్రలు ప్రతీ ఆరుగంటలకు ఒకటి వేసుకోవాలి!"

"అంటే సాయంత్రం ఆరుగంటలకి ఒకటి, ఉదయం ఆరు గంటలకి ఒకటి వేసుకోవాలా?"

"మహానుభావా! ప్రతీ ఆరేసి గంటలకు ఒక్కొక్క మాత్ర వేసుకోవాలని అర్థం!"

"ఎలా వేసుకోవాలి డాక్టరు గారూ?"

"మంచినీళ్లతో వేసుకోండి సరిపోతుంది."

"వేడినీళ్లా... చల్లనీళ్లా డాక్టరు గారూ?"

"ఏవైనా ఫర్వాలేదు. శుభ్రంగా ఉండాలి అంతే."

"అసలు భోజనం లేకుండా ఎలా డాక్టరు గారూ?"

"తదుపరి పన్నెండు గంటల వరకు మీకు ద్రవపదార్థాలేనని చెప్పాను కదా! అంతగా మీకు భోజనం తినాలనిపిస్తే మజ్జిగతో కొద్ది కొద్దిగా తినండి."

"అలాగే డాక్టరుగారూ! ఇప్పుడు మీరు ఇంజక్షను, సెలైన్ ఇచ్చిన తర్వాత నాకు చాలా బాగుంది. కడుపులో నొప్పి వికారం తగ్గిపోయి హాయిగా ఉంది. ఇప్పుడు మీరు నాకు దేవుడులా కనపడుతున్నారు. మరి వెళ్తాను! నమస్కారం!" అని పాపారావుగారు వెళ్ళారు.

గాలివాన తగ్గినట్లైంది!

# రచయిత్రి పరిచయం

## మెరుగైన సమాజం కోసం

**డా. ఎస్. ఆండాళ్ భాస్కర్**

రచనలు చేయాలనే తపన ఉండాలే గాని, సమయం అదే దక్కుతుందనే విషయాన్ని, డా. ఆండాళ్ భాస్కర్ గారు ప్రత్యక్షంగా ఋజువు చేసారు. నిరంతరం వృత్తిపరమైన ఒత్తిడిలో ఉన్నా సరే, తన వృత్తిపరమైన విషయాలమీద పరిశోధనా వ్యాసాలు ద్వారానే కాకుండా, 'ఓ పాపా లాలి', 'మాతృదేవోభవ!' వంటి టెలీ ఫిల్ములు కూడా నిర్మించి అందరినీ చైతన్య పరుస్తున్నారు. స్త్రీ సంబంధించిన విషయాలమీద చాలా ప్రాంతాలలో చర్చాకార్యక్రమాలలో పాల్గొంటూ, సమస్యల మీద అవగాహన కల్పించడానికి, తరుచుగా వారికి బోధనాతరగతులను స్వయంగా నిర్వహిస్తున్నారు.

డా. ఆండాళ్ బాస్కర్ గారు మద్రాసు స్టాన్లీ మెడికల్ కాలేజిలో యమ్.బి.బి.యస్. చేసి, కర్నూలు మెడికల్ కాలేజిలో ఎమ్.డి., డి.జి.ఒ. చేసారు. ప్రస్తుతం నెల్లూరులో స్వయంగా వైద్యవృత్తిలో ఉన్నారు. తెలుగు సాహిత్యం అంటే మక్కువతో, 'కథామంజరి' కోరిన వెంటనే, అందరికి ఉపయోగపడే ఓ అమూల్య సందేశాత్మక కథనం పంపారు. అలాగే... ప్రజలను చైతన్యపరచే కథలతో, తెలుగు కథాప్రియులను అలరించగలరని ఆశిస్తున్నాం.

# మెరుగైన సమాజం కోసం

డా. ఎస్. ఆండాళ్ భాస్కర్



***"మొలకలు తిను" అన్నారు, తిన్నాను.***
***"బ్రీతింగ్ ఎక్సెర్సైజ్ చెయ్యి" అన్నారు, చేసాను.***
***ఫలానా పండ్లు తిను అంటే అవే తిన్నాను.***
***"నీ అనుభవాలను వివరిస్తూ ఓ డైరీ రాయి, నీకు పిల్లలు పుడతారు అనే విశ్వాసాన్ని ఆ డైరీ తెలియజేయాలి!" అన్నారు, రాయడం మొదలెట్టాను.***

కాలం ఎంతో గమ్మత్తైంది. మనకది ఎన్నో పరీక్షలు పెడుతుంది. ఒక్కోసారి మనల్ని పడేస్తుంది, మళ్ళీ లేవనెత్తుతుంది!

నా కథ మీకు చెప్పాలి. ముఖ్యంగా పెళ్ళయి పిల్లల కోసం కలగంటున్న నా సోదరీమణులకు నా కథ తెలియాలి. ఖచ్చితంగా నా కథ మీకు కొత్త ఉత్సాహాన్ని, మీ మీద మీకు నమ్మకాన్ని ఇస్తుంది.

నా పేరు శిరీష. నాకు పెళ్ళయిన ఎనిమిదేళ్ళ వరకు పిల్లలు పుట్టలేదు. దానికంటే బాధాకరమేంటంటే... ఆ ఎనిమిదేళ్ళలో నాకు నాలుగు అబార్షన్లు అయినాయి. నాలుగు సందర్భాలలోనూ ప్రెగ్నెన్సీ కన్సీవ్ అయిన మూడు నెలలకంతా అబార్షన్ అయిపోయేది. చాలా కష్టమేసేది. ఆత్మ విశ్వాసం పూర్తిగా సన్నగిల్లింది. ఆత్మ న్యూనతాభావం ప్రవేశించింది. ఆ ఎనిమిది సంవత్సరాలు నేను అనుభవించిన బాధ వర్ణనాతీతం.

విచిత్రం ఏమిటంటే... నేను చెన్నై కెళ్ళి పరీక్షలు చేయించుకున్నాను. శారీరకంగా నాలో ఎలాంటి లోపం లేదని, క్రోమోజోమ్ అబ్నార్మాలిటీస్ లాంటివి ఏమీ లేవని తేల్చారు. మరి ఎందుకు నాకిలా అవుతుందో చెప్పలేకపోయారు. నా వయస్సు కూడా అప్పటికి ముప్పై ఐదు దాటింది. ఏం చేయాలో దిక్కు తోచలేదు. నాకున్న ప్రధాన సమస్యలు రెండు. ఒకటి... వెంట వెంటనే కన్సీవ్ కాకపోవడం, కన్సీవ్ అయినా ఎక్కువ రోజులు నిలవక పోవడం.

ఇంత కష్టంలోనూ ఒక మంచి ఏంటంటే... మా ఇంట్లో గానీ, నేను పని చేస్తున్న ఆఫీస్ లోని స్టాఫ్ గానీ నన్నెప్పుడూ ఇబ్బంది పెట్టలేదు, బాధ పెట్టే ఏ మాటా అనింది లేదు. అది చాలా ముఖ్యం. మా అమ్మ కూడా నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. "మన ఇంట్లో అందరికి పిల్లలు వున్నప్పుడు, నీకు పుట్టకుండా వుండే ఛాన్స్ లేదు" అని చెప్పేది. నాకే... ఏ చిన్న బిడ్డను చూసినా ఏదో బాధ అనిపించేది.

కొత్త మలుపు...

ఇంతకు ముందే చెప్పినట్టు, నా మీద నాకున్న నమ్మకం దాదాపు కనుమరుగయి పోయింది. పెద్ద పెద్ద హాస్పిటల్స్ వాళ్ళే ఏమీ చేయలేక చేతులెత్తేశారు. చేయగలిగింది ఏమీ లేదు. నిర్లిప్తతో, నిరాశో, నిస్తేజమో... నన్ను ఆవహించేసింది. ఇక నా జీవితం ఇంతే అనే నిర్ణయానికి దాదాపు వచ్చేసాను.


అప్పుడు జరిగింది ఓ వింత. ఓ పరిచయం... నా జీవితాన్ని ఇలా మార్చేస్తుంది అని నేను ముందు అనుకోలేదు. బడికెళ్లే

క్రమశిక్షణ కలిగిన ఓ విద్యార్థి తన టీచర్ చెప్పినట్టు ఎలా వింటాడో అలా నన్ను నేను మార్చేసుకున్న సందర్భం. 'అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ!' అని ఓ భక్తుడు తన ఇష్టదైవం ముందు మోకరిల్లినట్టుగా నేను కూడా మారిపోయిన అనూహ్య పరిణామం.

శారీరకంగా ఏదైనా సమస్య వస్తే, డాక్టర్ ని కలుస్తాం, మందులు, మాత్రలు వేసుకుంటాం, తగ్గిపోతుంది. తగ్గకపోతే ట్రీట్మెంట్ మారుస్తాం లేదా డాక్టర్నే మార్చేస్తాం. సమస్య మానసికమైంది కూడా అయినప్పుడే అసలు సమస్య. ఒక డాక్టర్ మీద కానీ, ఒక ట్రీట్మెంట్ మీద కానీ, ఒక నమ్మకం... బలమైన నమ్మకం... అచంచలమైన నమ్మకం కుదరడం అంత సులభం కాదు. అలా జరిగితే... అదో మ్యాజికల్ మూమెంట్.

నా విషయంలో అలాంటి మ్యాజిక్ జరిగింది.ఆ మెజీషియన్ పేరు డాక్టర్ ఆండాళ్. గజేంద్ర మోక్షంలో ఏనుగు ఎలా అయితే "స్వామీ నీవే గతి, శరణాగతి" అని విష్ణువుని నమ్ముకుందో అలాగే నేను కూడా నా పూర్తి నమ్మకాన్ని ఆండాళ్ మేడం గారి మీద ఉంచేశాను.

నమ్మకానికి తర్కంతో పనిలేదు. అసలు నమ్మకం ఉన్న చోట తర్కానికి చోటే లేదు. ఇది నా విషయంలో నిరూపితమైంది. మేడం ఏం చేయమంటే అది చేసాను. ఎలా చేయమంటే అలా చేసాను. ఎందుకు అని ప్రశ్నించలేదు... కాదు కాదు, ప్రశ్నించదలుచుకోలేదు.



"మొలకలు తిను" అన్నారు, తిన్నాను.

"బ్రీతింగ్ ఎక్సర్సైజ్ చెయ్యి" అన్నారు, చేసాను.

ఫలానా పండ్లు తినమంటే అవే తిన్నాను.

"నీ అనుభవాలను వివరిస్తూ ఓ డైరీ రాయి, నీకు పిల్లలు పుడతారు అనే విశ్వాసాన్ని ఆ డైరీ తెలియజేయాలి!" అన్నారు, రాయడం మొదలెట్టాను.

నాకు డాక్టర్ గారు ఒక దేవతలా, ఆ హాస్పిటల్ ఒక దేవాలయంలా అనిపించింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. హాస్పిటల్ లోని ప్రతి స్టాఫ్ నన్ను సొంత సోదరిలా చూసుకున్నారు. వారి పలకరింపులోనే ఎంతో సాంత్వన దొరికేది. ప్రతినెలా చెకప్ కోసం రావడం అంటే ఏదో పార్కుకో, సినిమాకో వెళ్లినట్టు ఉండేది. డాక్టర్ గారి ఆత్మీయత, స్టాఫ్ అందరి ఆప్యాయత నా మీద నాకు నమ్మకాన్ని పెంచాయి. ఫలితం... నేను మళ్ళీ కన్సీవ్ అయాను. ఈ సారి మాత్రం నాకు ఎలాంటి సందేహం లేదు. నేను తల్లినవుతాను అన్న నమ్మకం బలంగా ఏర్పడింది. అలాగే జరిగింది కూడా.

అయిదో నెలలో "నీకు స్టిచ్ వేయాలి, సరేనా" అన్నారు.

"నన్నెందుకు అడుగుతున్నారు? నాదేం లేదు, మీ నిర్ణయమే ఫైనల్. మీకు ఏది సరి అనిపిస్తే అది చేయండి" అన్నాను.

ఆ తొమ్మిది నెలలూ నేను అలానే ఉన్నాను. ఏ క్షణంలోనూ సందేహానికి, సంశయానికి చోటివ్వలేదు. నా ఎనిమిదేళ్ళ చేదు అనుభవాలను, జ్ఞాపకాలను దరి చేరనివ్వలేదు.

ప్రెగ్నెన్సీ సమయంలో ప్రతి రోజూ కడుపులో ఉన్న నా బిడ్డతో మాట్లాడమన్నారు డాక్టర్ గారు. నేనూ అలా మాట్లాడడానికి ప్రయత్నించాను. కాకపోతే నాకున్న పనుల వల్ల తనతో ఎక్కువగా మాట్లాడలేక పోయాను. కానీ ప్రతిరోజూ నాతో పాటు నా బిడ్డ కూడా బాలకృష్ణ ప్రసాద్ గారి అన్నమాచార్య కీర్తనలు వినేవాడు. తనకి ఆ గొంతు బాగా పరిచయమయింది. నా కొడుక్కి ఇప్పుడు ఏడు సంవత్సరాలు. ఇప్పుడు కూడా ప్రతిరోజూ వాడు ఆ కీర్తనలను ఎంతో ఇష్టంగా వింటుంటాడు. కీ బోర్డు కూడా ఎక్కడా నేర్చుకోకుండానే వాయించగలుగుతున్నాడు.

నా ప్రెగ్నెన్సీ సమయంలో మా అక్కయ్య కూతురు నాకు తోడుగా ఉండేది. తను మాత్రం కడుపులో ఉన్న నా బిడ్డతో ఎప్పుడూ మాట్లాడుతుండేది. ఆశ్చర్యమేంటంటే... పుట్టిన కొద్దిరోజుల్లోనే వాడు ఆ అమ్మాయి గొంతు ఏ వైపు నుంచి వినబడితే అటు పక్కకు తిరిగేవాడు. ఇప్పుడు కూడా వాళ్లిదరు ఫ్రెండ్స్ గా వున్నారు.

నా అనుభవం నాకు నేర్పించిన ఒక మంచి పాఠం ఏంటంటే ... మనం టెన్షన్ తోనూ డిప్రెషన్ తోనూ ఉంటే కన్సీవ్ కావడం చాలా కష్టం. తెలుగులో ఓ సామెత ఉంది కదా..."మండే చెట్టు మీద కాకి కూడా వాలదు" అని. టెన్షన్ పడడం మానేసి ప్రశాంతంగా ఉండడం ఆరోగ్యానికి చాలా మంచిది. దాని ఫలితం కూడా మంచిగా ఉంటుంది. నెగిటివ్ ఆలోచనలు మనల్ని డిప్రెషన్ లోనికి నేట్టేస్తాయి. మనకు నచ్చిన వ్యాపకాల్లో మనల్ని మనం బిజీ చేసుకోవాలి. పాజిటివ్ దృక్పథాన్ని కలిగి ఉండాలి.

'అమ్మ' కావడం అదృష్టం. 'అమ్మతనం' అనేది ఓ వరం. నేను ఆ వరాన్ని, అదృష్టాన్ని పొందడానికి ప్రధాన కారణం డాక్టర్ ఆండాళ్ మేడమే. అందులో ఎలాంటి సందేహం లేదు. ఆ హాస్పిటల్ గోడ మీద రాసి ఉన్న 'మెరుగైన సమాజం కోసం' అన్న మాటలు నాకెప్పటికీ స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. ఆరోగ్యం, విలువలతో కూడిన రేపటి తరాన్ని ఈ సమాజానికి అందించడంలో డాక్టర్ ఆండాళ్ మేడం గారూ, డాక్టర్ భాస్కర్ గారు మరియు హాస్పిటల్ సిబ్బంది కృషి ఇలాగే కొనసాగాలని నా ఆశ.

# రచయిత పరిచయం

## జీవిత సత్యం

### డా. రామకృష్ణ రాచకొండ

నిజానికి తెలుగు కథలు ఎక్కువగా చదవక పోయినా... చదివిన కథల వలన, అందులో స్వస్థలమైన విజయనగర రచయితల కథలు చదివిన తర్వాత... కథలు వ్రాయాలనే ఆలోచనతో గత మూడు, నాలుగేళ్ళుగా వ్రాయడం మొదలెట్టిన ఈ తరం డాక్టర్ రచయిత డా. రాచకొండ రామకృష్ణ. తనదో ప్రత్యేకమైన శైలి, సరళి. రాస్తున్న ప్రతీ కథా.. సమాజంలో తన ఎదుట తారసపడే విషయమే! వృత్తిపరంగా ఎదురయ్యే సమస్యలు, మనుషులు, మనస్తత్వాల మీద అలవోకగా వ్రాస్తున్న డా. రామకృష్ణగారి కథలు... పాఠకుడ్ని చదివిస్తాయి. చందమామ కథలు చదివినట్టు అనుభూతి కలిగించే శైలి, సరళిలో ఉన్నా... అందులో ఓ సమస్య, ఓ సందేశం కనబడతాయి. అదే కోవలో డా. రామకృష్ణగారు సుమారు నాలుగు వందల కథలు వ్రాసారు. అందులో విజయనగర స్మృతులు, కరోనా కథలతో పాటు, వృత్తిపరంగా తారసపడిన జీవితాలు, సంఘటనలు, జీవిత చరిత్రలు... వంటివి కూడా ఉన్నాయి. నిజానికి వృత్తిపరమైన ఒత్తిడితో సతమతమవుతున్న తరుణంలో, కథలు వ్రాయాలనే తపన ఈ మధ్యే వచ్చినప్పుడు... తన కుమారుడు రోహిత్ కృష్ణ దగ్గర తెలుగు టైపు చేయడం నేర్చుకుని, కథాప్రపంచంలోకి అడుగు పెట్టారు. అప్పటికి ఆయన వయసు ఐదు పదులు దాటి ఐదేళ్ళు అయిందిట!

డా. రామకృష్ణ గారు ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.యస్. చేసి, అక్కడే ఊపిరితిత్తుల విభాగంలో ఎం.డి. చేసారు. పాండిచ్చేరి, మద్రాసు, తణుకు, లిబియా దేశంలోని మిసురాతా నగరాలలో పనిచేసి, గుంటూరులో వైద్య వృత్తి చేపట్టారు. తర్వాత కాటూరి వైద్య కళాశాలలో ప్రొఫెసర్ గా కొంత కాలం పనిచేసి, ప్రస్తుతం గుంటూరు ఎన్.ఆర్.ఐ. వైద్య కళాశాలలో ప్రొఫెసర్ గా, ఊపిరితిత్తుల విభాగాధిపతిగా పని చేస్తున్నారు. భార్య శ్రీమతి నాగశ్రీ గారు కూడా అదే కళాశాలలో నేత్రవైద్య నిపుణులుగా పని చేస్తున్నారు. ఇంటా బయటా మంచి ప్రోత్సాహం ఉండటం వలననే రాయగలుగుతున్నానని అంటున్న డా. రామకృష్ణ గారు, తమ కథలను 'ఇంటింటి కథ' అనే సంకలనంగా వేయాలనే ప్రయత్నంలో కూడా ఉన్నారు.

'కథామంజరి' అడిగిన వెంటనే కథ వ్రాసి పంపిన డా. రామకృష్ణ గారు... అటు వృత్తికి, ఇటు ప్రవృత్తికి న్యాయం చేయగలరనే గట్టి నమ్మకంతో, వారి నుంచి మరెన్నో రచనలు రాగలవని ఆశిస్తున్నాం!

# జీవిత సత్యం

డా. రామకృష్ణ రాచకొండ



***శ్యామల వెళ్లిపోయిన తరువాత తన జీవితానికే అర్థం లేకుండా పోయింది. ఇప్పుడు ఈ వైద్యంతో సాధించేది ఏమీ లేదు. కానీ లోకం కోసం చేయించుకోక తప్పదు. సూర్యారావు మనస్సులో అనేక భావాలు కదులుతున్నాయి***

సూర్యారావు కుమార్తె రేణుక. తండ్రిని ఓల్డ్ ఏజ్ హోమ్ కి తీసుకుని వచ్చి అడ్మిట్ చేసింది. సూర్యారావుకి డెబ్బై ఎనిమిది సంవత్సరాలు. భార్య గతించి ఎనిమిది నెలలు అయింది. జంట నగరాలలో అది మంచి హోం. నెలకు ముప్పయి వేల రూపాయలు తీసుకుంటారు. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఎలైట్ హోమ్ అన్న పేరుకు తగ్గట్టు అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

రేణుక.. తండ్రికి పదే పదే... "నువ్వు పది సంవత్సరాలు ఉన్నా, సరిపడే డిపాజిట్ కట్టి వెళ్తున్నాను. నీకు కావలసిన సౌకర్యాలు అన్నీ అడిగి తీసుకో. నీకు అడగకుండా చెయ్యడానికి అమ్మ లేదు కదా!" అంటూ చెప్పి, వెళ్ళింది.

ఆ హోమ్ లో సింగిల్ రూమ్, వరండా ఉన్నాయి. కామన్ రీడింగ్ రూమ్ ఉంటుంది. అన్ని రకాల వార్తాపత్రికలూ వస్తాయి. పెద్ద తోట ఉంది. అందులో అన్ని రకాల పూల చెట్లు ఉన్నాయి. నీడను ఇచ్చే చెట్లు చాలా ఉన్నాయి. మధ్యలో మంచి వాకింగ్ ట్రాక్ ఉంది. టిఫిన్, భోజనం, స్నాక్స్ అన్ని సమయం ప్రకారం అందిస్తున్నారు. సుమారు వందమంది పైగా ఉన్నారు. స్త్రీల బ్లాక్ , పురుషుల బ్లాక్ వేరు వేరుగా ఉన్నాయి. దంపతులు కలిసి ఉంటే డబల్ రూమ్ సౌకర్యం ఉంది. వైద్య సౌకర్యం కూడా ఉంది. ఆరోగ్యకరమైన టిఫిన్ భోజనం, ఫ్రూట్ జూస్ టైం టైం కి అందిస్తున్నారు. మినరల్ వాటర్ సౌకర్యం ఉంది.

అన్నీ ఉన్నా సూర్యారావుకి వెలితిగానే ఉంది.

రేణుక... "నాన్నా, ఇక్కడ ఉన్న సౌకర్యాలు మేము ఎవ్వరమూ ఇవ్వలేము. నీతో రోజూ మాట్లాడుతూనే ఉంటాను కదా... దిగులు పెట్టుకోకు! అమెరికా వచ్చి నాలుగు నెలలు కూడా ఉండలేక పోయావు. ఇక్కడా ఊళ్ళో ఉండే తమ్ముడి దగ్గర ఉండగలిగే పరిస్థితి కాదు! అన్నయ్య ఏమో విదేశాలలో ఉన్నాడు. వదిన పిల్లలు ఢిల్లీలో వాళ్ళ పాట్లు పడుతున్నారు. నువ్వు అక్కడ ఉండలేవు. ఎలాగో ఒకలాగా ఇక్కడే సద్దుకో!" అంటూ చాలాసార్లు చెప్పింది.

తండ్రిని అక్కడ ఉంచి వెళ్లడం ఆమెకు ఇబ్బందిగానే ఉన్నది. అమెరికాలో ఇద్దరూ ఉద్యోగం చేస్తేగాని, కథ నడవదు. ఇద్దరు పిల్లలు కాలేజీకి వచ్చారు. ఇంటి బాధ్యత వలన రేణుకకి వెనక్కి వెళ్లడం తప్పలేదు.

సూర్యారావు కుమార్తె వెళ్ళి పోయిన తరువాత ఒంటరిగా కూర్చున్నాడు. గతమంతా కంటి ముందు మెదిలింది.

★★★

జిల్లా ట్రెజరీ అధికారిగా సూర్యారావు చాలా అధికారాన్ని అనుభవించాడు. భార్య శ్యామలతో కాపురం యాభై సంవత్సరాలు గడిపాడు. వివాహం అయినప్పటి నుండి తన కుటుంబం నుండి సమస్యలు ఎదురు అయ్యాయి. అన్నీ ఎదుర్కొని కాపురం నిలబెట్టుకొంది. ముగ్గురు పిల్లలని పెంచి ఉన్నత చదువులు చదివించింది. నిజానికి సూర్యారావు ఇంటి గురించి పట్టించుకున్న దాఖలాలు తక్కువే. ఇంటి పని, వంట పని, బ్యాంకు పని, బజారు పని! ఇలా అన్నీ శ్యామలే చక్కబెట్టేది.

శ్యామల మంచి వంటగత్తె. పెళ్లి అయిన కొత్తల్లో స్వీట్ హార్ట్ అని కొసరి కొసరి తినిపించేది. సన్నగా యాభై కిలోగ్రాములు ఉన్న సూర్యారావు పెళ్లి అయిన అయిదేళ్లకు డెబ్బై కిలోగ్రాముల బరువుకి పెరిగాడు. పెళ్లి అయిన కొత్తల్లో ప్యాంటులు అన్నీ టైట్ అయిపోయేవి. తరచు కొత్త ప్యాంటులు, కొత్త చొక్కాలు కుట్టించుకోవలసిన అవసరం ఏర్పడేది. ఆమె చేతితో చేసిన ఏ పదార్థమైనా రుచిగా ఉండేది. కొద్ది వ్యవధిలో స్నేహితులను ఎవరినైనా భోజనానికి పిలిస్తే ఆమె నిముషాలలో వండి పెట్టేది. శాకాహారమైనా, మాంసాహారమైనా ఆమె వంట అద్భుతం.

గవర్నమెంట్ ఉద్యోగం. ట్రెజరీ డిపార్ట్మెంట్ లో బదిలీలు తరచూ అయ్యేవి. డబ్బుకి ఎప్పుడూ లోపం ఉండేది కాదు. అనేక మందికి ఉపకారం చేసాడు. ప్రతి బిల్లులో ఏదో ఒక తిరకాసు ఉండేది. దాని వలన సంవత్సరాల పాటు వారికి పెన్షన్ అందేది కాదు. తనకు చేతనయినట్టు వారి సమస్య పరిష్కరించేవాడు. కొద్దో గొప్పో... వారు చేతిలో పెట్టేవారు. జిల్లా ట్రెజరీ అధికారి అయినప్పటి నుండి తన సంతకం బలం ఏమిటో అతనికి బాగా తెలిసింది

రిటైరుమెంటుకి నాలుగేళ్లు ఉండగా నెల్లూరులో ఒకరి రిటైర్మెంట్ సమయంలో ఒకని వద్ద నుండి లక్ష రూపాయలు తీసుకున్నాడు. బలమైన సామాజిక వర్గం మనుషులతో వ్యవహరించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఏమి అవుతుందిలే అని నిర్లక్ష్యం వహించడంతో సస్పెండ్ అయ్యాడు సూర్యారావు. దాని ఫలితం పెన్షన్ గ్రాంట్ కాలేదు. జీతం ద్వారా, ట్రెజరీ ఆఫీసులో సంపాదించినదంతా పిల్లల చదువులకి, అమ్మాయి పెళ్ళికి ఖర్చు అయింది. తాను రిటైర్ అయ్యి పద్దెనిమిది సంవత్సరాలు అయింది. సొంత అపార్ట్ మెంట్ మాత్రం మిగిలింది. పెన్షన్ రాకపోయినా శ్యామల ఎదో విధంగా ఖర్చులు తగ్గించుకొని గడిపేసింది.



మూడు సంవత్సరాల క్రితం శ్యామలకి కేన్సర్ వ్యాధి సోకింది. ఉన్నదంతా ఖర్చు పెట్టారు. ఫలితం దక్కలేదు. సుమారు ఎనిమిది నెలల క్రితం ఆవిడ కాలం చేసింది. శ్యామల మరణించే సమయానికి చేతిలో చిల్లి గవ్వలేదు. పెన్షన్ అన్నది రావడం లేదు. పిల్లలు ముగ్గురూ ఆదుకున్నారు.

అమ్మాయి తనతో అమెరికా తీసుకుని వెళ్ళింది. అల్లుడు మంచి వాడే. కానీ అక్కడ ఉండగలిగే పరిస్థితి కాదు. వాళ్ళు ఎంత ఆదరణతో చూసినా, తాను ఉండలేకపోయాడు. అమెరికా ఒక పెద్ద జైలు. వాళ్ళు బయటకు తీసుకుని వెళ్తేనే బయట ప్రపంచం చూడగలిగేది. అప్పటికీ వాళ్ళు వారాంతంలో ఎక్కడో ఒక చోటికి తీసుకుని వెళ్లే వారు. నిజానికి ఒంటరి మగవాడు ఎవరితోనూ వుండలేడు. ఒంటరి స్త్రీ పిల్లలతో గడుపగలదు!

అతి కష్టం మీద నాలుగు నెలలు ఉండగలిగాడు.

మగపిల్లలతో ఉండడం అసాధ్యం. వారి సంసారాలు వారు కొనసాగిస్తున్నారు. తానక్కడ వుండి వారిని ఇబ్బంది పెట్టడమే

అవుతుంది. అమ్మాయి రేణుక నిర్ణయం సరైయినదే అనిపించింది.

ఇంకా ఈ ఓల్డ్ ఏజ్ హోమ్ లో ఉన్నవాళ్ళు అందరూ పెద్ద కుటుంబాల నుండి వచ్చిన వారే. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసిన వారే. కుటుంబ పరిస్థితుల బట్టి వారికి ఇక్కడ రాక తప్పలేదు. అందరూ ఒక చోట ఉన్నా గొప్ప, పేద, కులం, మతం... తారతమ్యాలు ఇక్కడా ఉన్నాయి. మాటలలోనూ ప్రవర్తనలోనూ అన్నీ కనబడుతూనే ఉన్నాయి.

★★★

మూడు నెలలు గడిచిపోయాయి. కుమార్తె రోజు విడిచి రోజు ఫోను చేస్తూనే ఉంది. అబ్బాయిలు వారానికి, రెండు వారాలకి ఒకసారి ఫోను చేస్తున్నారు. చిన్న అబ్బాయి ఒక ఆదివారం వచ్చి వెళ్ళాడు. అన్నీ జరుగుతున్నా ఏదో ఒక అసంతృప్తి. సంతోషం అన్నది భార్య శ్యామలతోనే సాధ్యం. అది ఇప్పుడు అసంభవం. రోజూ ఏవో తలపులు. అందరి మధ్యన వుండి ఒంటరితనం. డెబ్బై ఎనిమిది సంవత్సరాల వయస్సులో ఈ పాట్లు ఎలా పడాలి? భగవంతుడా నన్ను తీసుకుని వెళ్ళిపో – అనుకున్నాడు సూర్యారావు.

ఆయాసం వస్తోంది. నడుస్తే ఎక్కువ అవుతోంది. మోకాళ్ళ నొప్పులు తీవ్రం అయ్యాయి.

అమ్మాయి ఫోన్లో మాట్లాడి "అన్నీ సద్దుకుంటాయిలే నాన్నా!" అని సముదాయించింది.

ఎందుకో ఆరోజు రాత్రి రేణుకతో మాట్లాడుతూ ''నువ్వు ఒక సారి రా, నిన్ను చూడాలని ఉంది!'' అన్నాడు సూర్య రావు.

"వచ్చే నెలలో మా ఆడబడుచు కూతురు వివాహం ఉంది. అందరం వస్తాములే!" అని చెప్పింది.

ఆ రోజు రాత్రి పదకొండు గంటలకు ఛాతీలో నొప్పి వచ్చింది. అప్పటికి హోంకి వచ్చి నాలుగు నెలలు మాత్రమే అయింది. ఊళ్ళో ఉన్న కుమారుడికి తెలిపారు. మూడు గంటలలో అతడు వచ్చేశాడు. అమ్మాయికి, పెద్దకుమారుడికి ఇన్ఫార్మ్ చేశారు. వాళ్ళు కూడా బయలుదేరారు.

సూర్యారావుని కార్పొరేట్ హాస్పిటల్ కి తరలించారు. వాళ్లేమో వైద్యం చేస్తున్నారు గాని, సూర్యారావుకి నిజంగా జీవించాలని లేదు. ఒక వేళ బ్రతికి బయటకు వచ్చినా తన సమస్య మామూలే. వివాహం అనే బంధంతో తన జీవితంలో ప్రవేశించింది శ్యామల. అంతకు ముందు ఆమె ఎవరో తెలియదు. తరువాత జీవితం మొత్తం ఆమె అయింది. మానవబంధాలు విచిత్రంగా ఉంటాయి. శ్యామల వెళ్లిపోయిన తరువాత తన జీవితానికే అర్థం లేకుండా పోయింది. ఇప్పుడు ఈ వైద్యంతో సాధించేది ఏమీ లేదు. కానీ లోకం కోసం చేయించుకోక తప్పదు. సూర్యారావు మనస్సులో అనేక భావాలు కదులుతున్నాయి.

స్టెంట్ ఏదో అమరుస్తామన్నారు. సూర్యారావు ముమ్మూర్తులా అతని భార్యను పోలియుండే కుమార్తె రేణుక కోసం ఎదురు చూడసాగాయి. రేణుక మూడోరోజు ఉదయాన్నే హాస్పిటల్ చేరుకుంది. సూర్యారావు కళ్ళుమూసుకుని ఉన్నాడు. రేణుక "నాన్నా!" అని పిలిచింది. ఆమె గొంతు చెవిన పడగానే కళ్ళు తెరిచి నీరసంగా ఆమె చేతిని చేతిలోకి తీసుకున్నాడు. కళ్ళు మూసుకున్నాడు. చేయి పట్టుజారిపోయింది. సూర్యారావు శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు.

భగవంతుడు ఇచ్చిన స్వాభావిక లక్షణం ఏమిటంటే స్త్రీలు తమ భర్తలను కోల్పోయినా పిల్లలను చూసుకుని జీవితం వెళ్లదీయగలరు. పురుషుడు ప్రేమించి ఆరాధించిన స్త్రీ, జీవితం నుండి నిష్క్రమిస్తే మనుగడ సాగించడం కష్టం.

## నియమం-నిష్ఠ

**డా. శేషు శర్మ**

ఐదు దశాబ్దాల క్రిందటే అమెరికా వెళ్ళి, అక్కడే స్థిరపడిన ప్రవాసాంధ్రులు డా. శేషుశర్మగారు. చిన్నప్పట్నుంచీ పద్యాలు, కథలు వ్రాయడం అంటే సరదా. దానికి తోడు ప్రతివారిలో పుస్తకపఠనం విరివిగా ఉండే రోజులు... ఇంటా బయటా కనబడే పుస్తకాలు... ఆ పుస్తకాలు చదివేటప్పుడు తాను కూడా కథలు వ్రాయలనే తపనతో... ఆచరణలో పెట్టేసరికి చదువు, వివాహం, విదేశయానం... ఇవన్నీ కొంత తన సమయాన్ని హరించుకున్నా, అడపాదడపా కథలు వ్రాసారు, వ్రాస్తునే ఉన్నారు. రాశిలో కంటే వాసిలో ఉండే కథలు వ్రాసారు. ఐదు శతాబ్దాలుగా ఆ దేశంలో ఉన్నా, తెలుగు భాష, సాంప్రదాయం, విలువలను వదలిపెట్టకుండా పదహారణాల తెలుగు ఆడబడుచుగా జీవనం సాగిస్తున్న డా. శేషుశర్మగారి కథల సంపుటి 'ప్రవాసాంధ్రుల ఆశాకిరణం' 2006లో వంగూరి ఫౌండేషన్ వారి ద్వారా విడుదలయింది.

గడిచిన 5-6 సంవత్సరాలుగా భగవద్గీత, ఉపనిషత్తుల మీద ఆసక్తితో వాటిని అధ్యయనం చేస్తూ, గత ఏడాది... భగవద్గీతను 206 ఆటవెలది పద్యాలలో, వేమన శతక శైలిలో 'విజయగీత' గా వ్రాసి, ముద్రించి విడుదల చేసారు. కథాంశం, తనదైన శైలిలో కథలు వ్రాస్తున్న డా. శేషుశర్మ గారు అమెరికా తెలుగువారికి చిరపరిచితులే! వడ్లమాని రామశేషుగా విజయనగరంలో పుట్టి, పెరిగి ఆంధ్ర మెడికల్ కాలేజీలో మెడిసన్ చేసి, వివాహానంతరం భర్త డా. పూడిపెద్ది రవిశర్మగారితో అమెరికా వెళ్ళిపోయారు, డా. శేషుశర్మగారు ప్రస్తుతం వాషింగ్టన్ డి.సి.లో హావర్డ్ వైద్య కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. విజయనగరంలో ఉండేటప్పుడు, అక్కడి సంగీత కళాశాలలో భరత నాట్యం, వీణ, సంగీతం నేర్చుకుని డిప్లొమా కూడా పొందారు. ఇలా... సంగీత సాహిత్య రంగాలలో ప్రవేశం ఉన్న డా. శేషుశర్మ దంపతులిద్దరూ వైద్యులు, రచయితలే కావడం చాలా చెప్పుకోదగ్గ విషయం! వారి కలం నుండి మరెన్నో కథలు జాలువారాలనీ కోరుకుంటూ... అవి వాసిలో ఉంటాయని గట్టిగా నమ్ముతున్నాం!

# నియమం-నిష్ఠ

డా. శేషు శర్మ



***...ఇదంతా అయిన తరువాత దేహం ఎక్కడ కష్ట పడిపోతుందేమోనని, చక్కగా కార్పెట్ మీద తలగడ వేసుకొని, దాని మీద హాయిగా కూర్చొని, గంటల కొలదీ పేకాట్లు, మళ్లీ సెకెండ్ రౌండ్ కాఫీలు, స్వీట్లు! ఏ రెండుకో మూడుకో పడుక్కోవటం... ఇదంతా మన తెలుగు కల్చర్ ని కాపాడు కోవడం కోసం, అందరూ చేసుకొనే పండగలు, పబ్బాలు కదా మరి!!***

ఉదయం ఏడవుతోంది. అట్లాంటాలో W.G.S.T. రేడియో ట్రాఫిక్ రిపోర్ట్ వాడు, కంచు కంఠంలాంటి గొంతుతో అరచే అరుపులకి దభాలున లేచి మంచం మీద కూర్చున్నా. అప్పటికే మావారు బుద్ధిగా లేచి, పనికి పోయినట్టున్నారు. బద్ధకంగా ఉన్నా, తప్పదు కాబట్టి లేచి బాత్ రూమ్ లోకి నడిచా. ఎందుకో నా పొట్ట మట్టుకు చాలా భారంగా నిండు కుండలా అనిపించి, "వెధవది, ఈ మధ్య ఈ బొజ్జ ఒకటి... అర్జెంటుగా వేరే పనిలేనట్టు తెగ పెరిగిపోతోంది!" అనుకున్నా.

మొన్ననే మాచంటోడు "మామ్, ఆర్ యూ హేవింగ్ ఎ బేబీ?" అని అమాయకంగాఅడిగాడు.

"లేదురా నాన్నా, మామ్ ఈజ్ టూ ఓల్డ్ టు హావ్ ఎ బేబీ!" అని సమాధానం చెప్పా.

అప్పుడు, నాకు మెడికల్ కాలేజీలో ఉన్నప్పుడు చెప్పిన... 'స్వోలెన్ బెల్లీ' అంటే పొంగిన బొజ్జకి డిఫరెంషియల్ డయాగ్నోసిస్, అంటే వివిధకారణాలు, నాలుగు 'ఎఫ్' లు మెదడులో తళుక్కుమని మెరిసాయి. 'ఫీటస్, ఫ్లాటస్, ఫ్లూయిడ్, ఫీసిస్'... ఇవి కాక ఇంకోటి కూడాను... 'ఫేట్'. నా ప్రోబ్లమ్ ఆ ఆఖరు కేటగిరీకి చెందిందని చెప్పే లోపలే, మా సిసింద్రీ తుర్రుమని బయటకు పారిపోయేడు.

పద్దెనిమిదేళ్ల క్రితం, ఇరవై రెండేళ్ల వయస్సులో... ముచ్చటగా, నాజూగ్గా నూరు పౌన్ల బరువుతో, అమెరికాలో అడుగుపెట్టా. ముగ్గురు పిల్లల్ని కన్న తరువాత బరువు నూట ఇరవై దాటకుండా చాలా జాగ్రత్తగా ఉంచగలిగాను. అందరూ డైట్ అంటూ, జిమ్ కు పోయి, వర్కౌటులు చేస్తూ, తెగ కష్టాలు పడుతూ ఉంటే, చాలా గర్వంగా... "నాకు ఆ బాధే లేదు. హాయిగా ఎప్పుడు ఏది కావాలంటే అది తినగలనోచ్! నా శరీరాన్ని అన్ని కష్టాలకు గురిచేయక్కరలేదోచ్!" అని అనుకుంటూ ఉండేదాన్ని! కాని నలభై ఏళ్లు నిండగానే, నన్ను అడగకుండానే ఇంక్రిమెంట్స్, ప్రమోషన్స్ చాలా తేలికగా రావడం మొదలయ్యేయి. సరే ఏంచేస్తాం!

భగవంతుడిచ్చిన మహాప్రసాదం అనుకుంటూ, ప్రస్తుతానికి నా ప్రమోషన్ ఎంతవరకూ వచ్చిందో చూద్దామని స్కేల్ మీద నుంచున్నా! దాని ముల్లు రయ్యి మని పోయి ఏ మాత్రం సందేహం లేకుండా, సుతారంగా నూట నలభై ఐదుని ముద్దుపెట్టుకొని కూర్చుంది.

'హారినీ!! అంతవరకూ వచ్చానూ...' అని అనుకుంటూ ఉంటే, ఆ మధ్య ఏదో ఒక పార్టీలో ఒక డాక్టర్ ఫ్రెండ్ చెప్పింది గుర్తుకొచ్చింది.

ఆవిడ డయాబిటిస్ మీద ఒక సెమినార్ కి వెడితే, అక్కడ 'ఫేట్ ఇండెక్స్' కి ఒక సింపుల్ హోమ్ టెస్టు చెప్పారట... అది చెపుతూ,

ఆవిడ పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వింది.

అదేంటంటే, బాత్ రూమ్ లో బట్టలన్నీ విప్పేసి, మీ బర్త్ డే సూట్ లో, అద్దానికి ఎదురుగా నిలబడి, క్రిందకీ, మీదకీ, గంతులేయాలట. అద్దంలో మీ బంగారు బొజ్జ మీతో బాటు, పెండ్యులంలా పైకీ, క్రిందకీ ఊగుతూ ఉంటే, 'స్థూలకాయులు' అన్న బిరుదు నిస్సంకోచంగా, మీకు మీరే ఇచ్చేసుకోవచ్చట. వెంటనే, జిమ్ లో జాయినయిపోవచ్చుట!

హ..హ..హ..హ.. అందరూ... నవ్వులే నవ్వులు.



ఆ పార్టీ హోస్టెస్ అయిన లావుపాటి లలితగారు మాత్రం, అక్కడ అందరి కోసం పెట్టున్న జహంగీర్ ప్లేట్ తీసుకొని కిచెన్ లోకి జారుకొని, సీక్రెట్ గా కిసుక్కుమని నవ్వుకుంది..

సడెన్ గా 'స్థూలకాయులు' అన్న పదం గుర్తుకొచ్చి, నాకు ఆ బిరుదుకి అర్హత ఉన్నదా అని, ఒక్కసారి నా బొజ్జ వైపు చూసా. అది భారంగా 'ఇంత ఎత్తుగా ఉన్న నన్నే నువ్వు పరీక్షిస్తున్నావా' అని కోపంగా నా వైపు చూసింది. దాంతో నాకు ఉన్న సందేహాలన్నీ పటాపంచలయ్యాయి.

ఏంచేస్తాం మరి! ఇది ఈజీ లైఫ్!

ఉదయం లేవగానే పెద్ద లోటా నిండా చిక్కటి అమృతంలాంటి కాఫీ, బ్రేక్ ఫాస్టు, కారులో... కాళ్లతో కాదు, గమనాలు, లంచ్ లు! ఈవెనింగ్ స్నాక్ లు, కొలీగ్స్ తో స్పెషల్ లంచ్ అయితే... ఇక చెప్పనక్కర లేదు! స్పెషల్ డ్రింక్స్, స్వీట్స్, సాయంత్రం చక్కగా కడుపు నిండా అన్నం... ఆవకాయతో నెయ్యి, కూరలు, పచ్చళ్లు, పెరుగు... వగైరా.

శని, ఆదివారాలయితే, పార్టీలు... సమోసాలు, వడలు, పంచ్, బీర్, వైన్లు, సాంబార్లు, నాలుగు రకాల కూరలు, బిరియానీలు, డిజెర్ట్స్! తరువాత కాఫీలు... ఇదంతా అయిన తరువాత దేహం ఎక్కడ కష్ట పడిపోతుందేమోనని, చక్కగా కార్పెట్ మీద తలగడ వేసుకొని, దాని మీద హాయిగా కూర్చొని, గంటల కొలదీ పేకాట్లు, మళ్లీ సెకెండ్ రౌండ్ కాఫీలు, స్వీట్లు! ఏ రెండుకో మూడుకో పడుకోవటం... ఇదంతా మన తెలుగు కల్చర్ ని కాపాడుకోవడం కోసం, అందరూ చేసుకొనే పండగలు, పబ్బాలు కదా మరి!!

మరి లేటుగా పడుకోవడం వలన మర్నాడు లేటుగా లేవడం, మధ్యాహ్నం నేప్ లు, బద్ధకాలు, మరి ఇవన్నీ బొజ్జ పెంచక ఏంచేస్తాయి, చెప్పండి??

సరే... ఎలాగైనా క్రమశిక్షణతో, కొంచెం తిండి పరిమితం చేసుకొని, కొంచెం వ్యాయామం చేస్తూ, అప్పుడప్పుడు ఉపవాసం ఉంటూ, నా బరువుని కంట్రోల్ చేద్దామని నిర్ణయించా.

ఈ నా ప్లాన్ ని మా కొలీగ్ ఒకాయనతో చెప్తే, ఆయన బాంబులాంటి జోకొకటి విసిరాడు నామీద.

“హాయ్. లిసెన్... గాడ్ గివ్స్ అజ్ ఎ ఫిక్సెడ్ నంబర్ ఆఫ్ హార్ట్ బీట్స్. ఎక్సర్సైజ్ మేక్స్ యూలూజ్ యవర్ బీట్స్ ఫాస్టర్! ఐ డోంట్ వాంట్ టు లూజ్ దెం సూనర్ అండ్ డై ఎర్లీ!” అంటూ పెద్దగా నవ్వాడాయన.

ఇది నిజమేనా అన్న కాస్త అనుమానం, భయం...

ఆ జోకు నాకు ఏ మాత్రం నచ్చలేదు సుమండీ!

పోనీ .. ఈక్వేషన్ లో ఎక్సర్సైజ్ మైనస్ చేస్తే? విపరీతంగా నా బ్రైన్ ని రేక్ చేసి తొలిచేసా. కాని ‘ధైర్యే సాహసే, దేరింగే లక్ష్మీ’ అన్న గోపాలరావుగారి అమ్మాయి సినిమాలో, నా ఫేవరేట్ చంద్రమోహన్ డైలాగు, నాకు కొండంత బలం ఇచ్చింది.

నా పథకాన్ని విజయవంతం చేయమని, టైమ్ వేస్టు చేయకుండా, దేవుడికి షోడశోపచార పూజచేసి, కొబ్బరికాయలు కొట్టి, మాంఛి నెయ్యితో చేసిన కేసరీ నైవేద్యం పెట్టాను. అన్నీ పరోక్షంగానే సుమండీ! మానసిక పూజంత గొప్పది లేదని చెప్పిన చాగంటివారి మాటలు నాకు ఎప్పుడూ జ్ఞాపకం ఉంటాయి! మర్నాడు ఆరుగంటలకే అలారం పెట్టుకున్నా. కాని నాకు మెలకువ వచ్చి, లేచేసరికి, ఏడు గంటలు దాటిపోయింది.

లేచి ఒక ఐదు నిముషాలు టమ్మీ టకింగ్ చేసేసరికి, అయ్యయ్యో... అప్పుడే నీళ్ళల్లో మునిగినదానిలా ఒళ్ళంతా చెమటలు పట్టేసి, ఊపిరాడక నానా కష్టాలు పడ్డా! అయినా పట్టువదలని విక్రమార్కుడిలా నాలుగు రోజులు చేసేసరికి, ఐదో రోజు, నా కుడి ముణుకు బెలూన్ లా వాచిపోయి నొప్పెట్టటం మొదలెట్టింది.

ఇదేం ఖర్మ! అనుక్కుంటూ, మా ఫ్రెండ్ మురళీధర్... ఒక బోన్ స్పెషలిస్ట్ ని, ఫ్రీ గానే... కన్సల్ట్ చేసా.

ఆయన “టోటల్ నీ రెస్టు... అంటే నా రెస్టు కాదండోయ్... ‘క్నీ’ముణుకు రెస్టు రికమెండ్ చేసేసరికి... నా వ్యాయామానికి కాస్తా... వెంటనే తిలోదకాలు.

నా ఖర్మ... ఏం చేసేది? పోన్లే... డైట్ విషయంలో కాస్త జాగ్రత్త పడదాం అని నిశ్చయించుకున్నా. కాని, ఉదయం లేచింది మొదలు రాత్రి పడుక్కునే వరకు... మూడు చిక్కటి కాఫీలు. ఐదువందలు కేలరీలు. సరే, మార్నింగ్ రెండో కప్పుకి గుడ్ బై చెప్పా. కాని మర్నాడు రెగ్యులర్ టైంకి కాఫీపడక పోయేసరికి, మెదడులోని నరాలు స్ట్రైక్ చేసి తలంతా విపరీతమైనా నొప్పి. అదేం తెగులో!

అప్పుడు మా నరసత్త గుర్తుకొచ్చింది.

భారతదేశంలో, ఆంధ్ర రాష్ట్రంలో, విశాఖ జిల్లాలో, ఎస్.కోట అనబడే శృంగవరపుకోటలో, ముక్కావారి వీధిలో, కట్టెల అప్పలసామి దుకాణంకి ఎదురుగా నివాసం మా నరసత్తది. ఆవిడ పేరు వినని వారు, ఎస్. కోటలోనే కాదు. అట్లాంటా, టెక్సాస్, వర్జీనియాలలో కూడా ఉండరు. ఆవిడ పాపులారిటీ... ఇంతా అంతాకాదు.

నరసత్త నా చిన్నతనం నుండి... అంతకు ముందు కూడా అదే తీరు అనుకుంటా. తెల్లవారక ముందే, కోడి కూయకముందే... కోడిని ఆవిడే లేపుతారేమో.., లేచి, శీతాకాలంలో కూడా చన్నీళ్ల తలస్నానం చేసి, ఎవ్వరు లేచినా, లేవకపోయేవా, వాళ్ల పక్క బట్టలు మడత పెట్టేసి, మంచాలు ఎత్తేసి, పచ్చి మంచినీళ్లయినా నోట్లో పోసుకోకుండా, మూడు గంటలు గుక్క తిప్పుకోకుండా స్తోత్ర పఠనాలు, ఇంకో ప్రక్క వంటలు, ఊరగాయలు, తినుబండారాలు... మరో ప్రక్క భర్త మీద ‘దూషణ దండకాలు’...

రోజూఇలా అష్టావధానం చేయడం, ఆవిడకు వంశపారంపరంగా వచ్చిన విద్యలని వినికిడి.

వారానికి మూడు నాలుగు రోజులు కటిక ఉపవాసం ఉంటూ, చిటికెలో వందమందికి షోడశోపచారాలతో, పంచభక్ష్య పరమాన్నాలతో విందు భోజనం తయారుచేయగలిగే అక్షయపాత్రలాంటి హస్తం, కాంతి కంటే కూడా స్పీడుగా పయనించే మెదడు, శరీరంకూడా... నరసత్తది!

నేనున్నాననుకోండి, శనివారం ఎవరినైనా భోజనానికి పిలిస్తే... ముచ్చటగా ముగ్గురినైనాసరే, ఒక వారం ముందు మొదలెట్టి, ఆపసోపాలు పడిపోతూ, రోజుకొక అర్ధ డిష్ చొప్పున చేసి, ఫ్రీజ్ చేస్తూ తెగ అలసిపోతాను. నేనే కాదులెండి, నాలాంటి సోదరీమణులే ఎక్కువ ఇక్కడ! చేసిన ప్రతి వంటా కనీసం పదిసార్లయినా రుచి చూడందే వంట చేతకాదాయె మరి... మా జాతి వాళ్లందరికీ!

ఎప్పుడేనా హఠాత్తుగా గెస్టులు ఊడి పడితే, వంట ఎలా చెయ్యాలో తెలియక, నా గుండె సూపర్ సోనిక్ స్పీడ్ లోకి పోయి, డిఫిబ్రిలేటర్ అవసరం వస్తుందేమోనన్న భయం ఉంది సుమండీ!

ఆ మధ్య మా నరసత్త మా ఇంట్లో ఉన్నప్పుడు... రెండు రోజులు ఉపవాసం ఉండి కూడా, ఒక చేత్తో బూరెలు, రెండో చేత్తో ఆవకాయ, వడియాలు పెడుతూ, మచ్చుకు ఒక్కముక్కయినా రుచి చూడకుండా చకచక పని చేసుకు పోతూ... దూషణ దండకాన్ని టి.వి. లోని 'అత్తారింటికి దారేది' సీరియల్ లో విలన్ అత్త మీద గుక్క తిప్పుకోకుండా వల్లిస్తూ ఉంటే, (మావయ్య పోయిన తరువాత ఆవిడ టార్గెట్టు మారింది లెండి)....నాకు నిఝంగా ఆశ్చర్యం వేసేసి, అత్తని అడిగా.."అత్తా, ఒక్క పూట కాఫీ లేకుండా ఉండలేను. అంతేకాదు.. ఆవకాయ పెడుతూ, కనీసం ఒక పిడికెడు ముక్కలైనా తింటే గాని నా జిహ్వా ఊరుకోదే... అలాంటిది, నువ్వు ఉపవాసం ఉంటూ, నీ జిహ్వాకి తాళం పెట్టి (నోటికి కాదు లెండి) అష్టావధానంలా ఇన్ని పనులు ఎలా చేయగలుగుతున్నావత్తా?" అని.

ఒక్కసారి, వీరవనిత లుక్ ఒకటి నా మీద విసిరి వేసి, కడిగిన చేతులు కొంగుతో తుడుచుకుంటూ, గొంతు సవరించుకొని, కుండ బద్దలు కొట్టినట్టు... నాటక ఫక్కీలో, తనధోరణిలో , మా కాలనీలో అందరికీ వినబడేటట్టు ఆ నగ్నసత్యాన్ని ఆవిష్కరించింది.. నరసత్త.

"ఇదిగో చూడు... మనిషికి అన్నింటి కన్నా ముఖ్యం... నియమం, నిష్ఠ! అది చిన్నప్పటినుండి అలవాటు చేసుకోవాలి. ఏ విషయంలో నైనా, ఒక పద్ధతిలో, క్రమబద్ధంగా పనులు చేసుకుంటూ, ఇదిగో ఇటు చూడు...ఆ పైవాణ్ణి నమ్ముకుంటే, నీకు, నీ శరీరం మీదే కాదు, మనస్సు మీద కూడా నియంత్రణ ఉంటుంది. మీ పద్ధతిలే వేరు బాబూ! ఒక వరసా, వాడీ లేదు. ఎప్పుడు ఏది బుద్ధి పుడితే అది చేస్తారు. ఒక దేవుడు మీద నమ్మకం, ఒక పూజ, పునస్కారం... అవేవీ మీకక్కరలేదు. అన్నీమీకు తెలుసనుకుంటారు. ఇంకొకరి మాట వినరు! అందుకే మీకీ కష్టాలు!" అంటూ ఆవేశంతో, ఆపకుండా, అరగంట సేపు అదరగొట్టేసింది ఆరిందా అత్తమ్మ .

నేరకపోయి ముళ్లకంపని కదిలించానని లెంపలేసుకొని, 'నియమం నిష్ఠ' ఈ జన్మకింతేలే... అనుకుంటూ నా ఆలోచనలను కట్టబెట్టి, పట్టు వదలని విక్రమార్కుణ్ణి అనుసరించాలంటే ఎలాగ? అనే అంశం మీద విచారణ మొదలెట్టాను!

# రచయిత పరిచయం

## దహన... సంస్కారం

### డా. మల్లెమాల వేణుగోపాల రెడ్డి

వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి, అటు వైద్య వృత్తిలోనూ, ఇటు సాహితీ జగత్తులోనూ మంచి పేరు తెచ్చుకున్న డా. మల్లెమాల వేణుగోపాలరెడ్డి గారి వయసు జస్ట్ ఎనభై ఐదు సంవత్సరాలు మాత్రమే. 'కథామంజరి' ప్రయత్నం చూసి, వెంటనే స్పందించి అభినందనలు తెలపడమే కాకుండా, కథను పంపారు. ఎన్నో సాహితీ సంబంధ విషయాలను ముచ్చటించారు. కొద్ది కాలంగా వృత్తిని పక్కన పెట్టినా, ప్రవృత్తిని మాత్రం వదలలేదు. రచనావ్యాసంగం, సంఘసేవ, ఆధ్యాత్మిక పరిశోధనలు చేయడమే తన ప్రవృత్తులని చెప్పిన డా. వేణుగోపాలరెడ్డి గారు గతంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యవర్గ సభ్యుడిగా, 'కథ' వార్షిక బహుమతులు జ్యూరీ సభ్యుడుగా, అధికార భాషా సంఘం సభ్యుడుగా, ప్రసార భారతి, న్యూడిల్లీ అవార్డుల జ్యూరీ సభ్యుడుగా... ఇలా పలు హోదాలలో కూడా సాహిత్య సేవలు అందించారు.

4 ఆగస్టు 1937 లో జన్మించిన డా. వేణుగోపాలరెడ్డిగారు గూడూరు, నెల్లూరులో హైస్కూలు విద్యా, గుంటూరులో ఇంటర్, విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కాలేజీలో వైద్య విద్య పూర్తి చేసారు. విశాఖపట్నం, కడపలలో ప్రభుత్వ వైద్య కళాశాలలో సర్జన్ గా పని చేసి, 1978 లో స్వచ్ఛంద పదవీవిరమణ చేసి, నర్సింగ్ హోమ్ నిర్వహణలో చాలాకాలం వైద్య సేవలు అందించారు. అటు వైద్య వృత్తిలోనూ, ఇటు సాహిత్య, సాంఘిక సేవలలోను, దేశ విదేశాలలో పలు పురస్కారాలు పొందారు

'కథామంజరి'కి వారు అందించిన ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలుపుకుంటూ, వారి కలం నుండి మరిన్ని రచనలు రాగలవని ఆశిస్తున్నాం!

# దహన... సంస్కారం

డా. మల్లెమాల వేణుగోపాల రెడ్డి



“ఎంకటేసూ, సావిత్రమ్మగారు కాలమైపోయారు. అమ్మని ఐసుపెట్టెలో పెట్టారు. అమెరికా నుంచి చిన్నబాబుగారొస్తే దహనం” లక్ష్మయ్య చెప్పాడు.

వెంకటేసు గుండెల్లో ముల్లు గుచ్చుకున్నట్టైంది. పెద్దగా దగ్గూ, ఆయాసం. సావిత్రమ్మగారంటే వెంకటేసుకూ, భార్య చిన్నక్కకూ దేవతతో సమానం.

“ఏందిరా అట్టా అయిపోయావు? మేగాళ్ళ వాపు... గస బోస్తన్నావు, చావుకళొచ్చిందే! ఏమైంది నీకు?”

వెంకటేసు వొణుకుతున్నాడు. ఖళ్... ఖళ్... గడ్డలు గడ్డలుగా గళ్ళ.

“అవును సామీ, ఆరోగ్యం సెడింది. కాష్టింకాడకి కూడా పోలేకపోతున్నా. ఎండవేడికి తట్టుకోలేకపోతున్నా’

“కట్టెలేసి బండి పంపుతా, కాష్టం పేర్పించి పెట్టు. ఎల్లుండే దహనం”

“అయ్యో, సిన్నక్కక్కూడా రోగం. యాకవననగా దర్మాసుపత్రికి బోయింది. ఇయ్యాల్టికి రాలే. సెంద్రిగాడు కూడా లేడు. ఎట్టబ్బా?”

“చంద్ర ఏమయ్యాడు? కొడుకును చదివిస్తానంటుంటివే!”

“అనుకున్నాను లచ్చుమయ్యా, సదవేసినా పదివరకూ కూడా వోడు సదవలా. సెడిపొయ్యాడు. సిన్నవొయసుకే తాగుడూ, లంజల్నీ మరిగాడు. బస్టాండ్ మేనేజరుగార్ని బతిమాలి సీపరు ఉజ్జోగం ఎయ్యించినా. దానికీ సరిగ్గా పోడు. సిన్నక్కే పోయి, ఊడ్సొత్తంది”

ఓ కుక్కా, రెండు కుక్కపిల్లలూ వెంకటేసు చుట్టూ. కుక్కపిల్లలు వాడి కాళ్ళు నాకుతున్నాయి. కోడిపెట్టా, కోడిపిల్లలూ తారాడుతున్నాయి. పక్కనే కాళ్ళు వంకరపోయి, గోచి పెట్టుక్కూర్చున్న సొంటోడు.

“ఈడికింత సద్ది పోసేదానికి కూడా సిన్నక్క జాడలేదు. యాలకు ఈడికీ, ఈ మూగజీవులకు కడుపులు కాల్తాయి. ఈడు అడగడు... అవి అడగలేవు.”

“వీడెప్పుడు జతయ్యాడు?” లక్ష్మయ్య అడిగాడు.

“ఈడు... ఈ సొంటోడు... ఈణ్ణి పసిగుడ్డుగానే ఎవరో సెత్తకుప్పలో పడేత్తే సిన్నక్క ఎత్తుకొచ్చింది. కుక్కపిల్లల్తో పాటే పాలుపోసి సాకింది. మూడు కుక్కపిల్లల్లో ఒకదాన్ని, బస్టాండులో ఎవర్నో కరిసిందని సంపేసారు. ఈ కుక్కకు ఇప్పుడు మూడేళ్ళు. సొంటోడికీ అంతే వొయిసు.”

“సరే! సరే! నీ సంసారమూ నువ్వూను! ఇప్పుడే వస్తానుండు” అని చెప్పి, లక్ష్మయ్య రోడ్డుమీదకెళ్ళి, బొరుగుల పొట్లాం, అలసంద వడలూ, ప్లాస్టిక్ గ్లాసులో టీ, రెండు బన్నులూ పట్టుకొచ్చాడు.

"సావిత్రమ్మగారే నిన్ను పంపించినట్టుంది సామీ! ఆయమ్మ అన్నపూర్ణమ్మ! పండగలకి మమ్మల్ని పిలిపించి, గంపకెత్తుకునేటంత తిండిపెట్టి పంపేది. సెంద్రిగాడికెన్ని గుడ్డలు! సొంటోడికి బాడీలూ, సెడ్డీలూ!!"

టీ చప్పరించబోయి, పెద్దగా పొరబోయింది. దగ్గు... దగ్గు.


"అమ్మగోరు తలసుకున్నట్టున్నారు. పొరబోయింది" దగ్గుతూనే తమాయించుకొని టీ తాగేసాడు వెంకటేసు. సొంటోడికి బన్నూ, అలసంద వడలూ కుక్కల్తో పాటూ భాగం పెట్టాడు. బొరుగుల పొట్లం కోడికీ, దాని సంతానానికీ. అందరికీ దాణా దొరికింది.

"పెద్దయ్యగోరు కాష్టమెక్కినప్పుడు సినబాబుగోరు అమెరికానుంచి ఇయిగో సెట్టరూ, సాలువా తెచ్చిచ్చేరు. మరిసిపోతానా?"

"సరే సరే... నాకు పనులున్నాయి. నేను పోతా. కట్టెలేసి పంపిస్తా. కాష్టానికి కావలసిన సరుకులు పంపుతా. అన్నీ రడీ చెయ్. పొద్దు మారకముందే కాష్టం రగలాలి. గుర్తుంచుకో." చెప్పి వెళ్ళాడు లక్ష్మయ్య.

లక్ష్మయ్య సావిత్రమ్మగారి పొలాలు చూస్తుంటాడు.

★★★



మారుతీనగర్ శ్మశానవాటికలో కాటికాపరిగా వెంకటేసుకి నలభైఏళ్ళ సర్వీసు. వాడి తండ్రి చెన్నప్ప ఆ పని అప్పజెప్పాడు. అదే వృత్తిగా పొట్టపోసుకుంటున్నాడు... శవాల మధ్య, పగిలే పుర్రెల మధ్య, కాలిన దుర్గంధం ముక్కుల్ని పిండేస్తుంటే, అస్థికల్ని ఏరి, మట్టికుండలో భద్రపరచి అప్పజెప్పే వెంకటేసు.

రోజంతా వెంకటేసుకి సావిత్రమ్మ జ్ఞాపకాలే. ఎన్నో శవాలు కాల్చాడు. సావిత్రమ్మ కాష్టం మీదకొస్తుందంటే గుండెల్లో దడ, వణుకు, కళ్ళనిండా నీళ్ళు. కన్నీటికి మాటలు రావు. అందుకే వాడి మౌనరోదన.

రాత్రికి చంద్ర తాగొచ్చాడు. చిన్నక్క పేగు తల్లడిల్లింది. ఎండుచేపల పులుసుతో కొడుక్కి అన్నం పెట్టింది. తిని, నులకమంచం మీద గుర్రుపెట్టాడు. పక్కలో కుక్కపిల్ల.

★★★

తెల్లవారింది.

"ఒరే సంద్రిగా, సావిత్రమ్మగోరు సనిపోయారు. రేపు దానం. కట్టెలతో బండొత్తాది. నాకు జొరం. లెగలేను. నువ్వే కాష్టం పేరిపించు." దుప్పటి కప్పుకొని, జ్వరంతో మూలుగుతూ అన్నాడు వెంకటేసు.

"ఛీ! ఛీ!! నేనీ పాడుపనులు చెయ్యనని నీకెన్నిసార్లు చెప్పాను?" నోట్లో వేపపుల్ల నములుతూ టీ షర్టేసుకొని బస్టాండ్ వైపు దారి తీసాడు చంద్ర.

కట్టెలొచ్చాయి.

చిన్నక్క కొడుకుని వెతుక్కుంటూ వెళ్ళి, బస్టాండ్ కేంటీన్లో పట్టుకుంది. కాళ్ళూ చేతులూ పట్టుకొని బతిమలాడింది. "సరే పో!! నిన్నూ, ఆ ముసలాణ్ణీ చూసి కాదు, అమ్మగారి కోసం వస్తున్నాను. పో! పో!!..." కసిరి చెప్పాడు చంద్ర.

★★★

సావిత్రమ్మ కాష్టం తయారైంది. ఆ రాత్రి, వెంకటేసుకి ఆయాసం ఎక్కువైంది. గుండె పట్టేసింది. ధర్మాసుపత్రికి తీసుకెళ్ళారు చిన్నక్కా, చంద్రా. అక్కడే చివరి శ్వాస వదిలేసాడు వెంకటేసు సడన్ గా.

'హార్ట్ ఎటాక్' నిర్ధారించాడు డాక్టర్. చిన్నక్క మనసులో 'సావిత్రమ్మగోరు పిలుచుకెళ్లినట్టున్నారు' గొణిగింది.

★★★

సావిత్రమ్మ మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి, బంధుమిత్ర, పరివారగణం సమక్షంలో కాష్టం ఎక్కించారు. అమెరికా కొడుకు చితికి నిప్పంటించాడు.

దూరంగా ఓ మూలన పది కట్టెలు పేర్చి, వెంకటేసు శవాన్ని మోసుకెళ్ళి, కాష్టం మీదేసి, కొరివి పెట్టాడు చంద్ర.

సావిత్రమ్మ అంత్యక్రియలకూ, దహనసంస్కారాలకూ వందలాది జనం.

వెంకటేసు శవం చుట్టూ రోదిస్తూ చిన్నక్కా, చుట్టూ కుక్కలూ, కోళ్ళూ, సొంటోడూ. తడి తుండుగుడ్డ చుట్టుకొని, కాష్టం దగ్గర చంద్ర.

రెండు కాష్టాల సెగల... పొగలు.

శవాలు కాలుతున్న మాడు వాసన. ఆ తరవాత రెండు పుర్రెలూ ఒకే సమయానికి పేలాయి.

# రచయిత పరిచయం

## అమ్మతనం

### డా. ప్రయాగ మురళీ మోహనకృష్ణ

నాలుగు తరాల ముందు తరంనాటి వైద్య రచయిత డా. ప్రయాగ మురళీ మోహనకృష్ణ గారు. మధ్యతరగతి కుటుంబ వాతావరణ పరిస్థితులను కళ్ళకు కట్టినట్టు కథలను, గాథలను అందించగల శైలితో ఆరు దశాబ్దాలుగా అటు వైద్య వృత్తిలోనూ, ఇటు ప్రవృత్తి రచనావ్యాసంగంలోనూ ఎప్పుడూ బిజీగా ఉండే డా. మురళీకృష్ణ గారి రచనలన్నీ విలువలతో కూడి ఉంటాయి. చాలా కాలం విదేశాలలో వృత్తి పరంగా గడిపినా, తెలుగు భాషను, తెలుగువారి సాంప్రదాయాలను వదలిపెట్టలేదు. నిరంతరం చదవడమో, వ్రాయడమో అలవాటుగా వున్న డా. మురళీకృష్ణ గారి కథలు, నవలలు, వ్యాసాలు పాఠకుల్ని చదివిస్తాయి. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను చూపిస్తూ, వాటిని తన పదునైన రచనశైలితో 'అయితే నాకేటి!' అనే శీర్షికతో చిన్న చిన్న కథనాలు వ్రాసారు. ఓ వందకు పైగా కథలు, ఆరు నవలలు, వైద్య శాస్త్ర గ్రంథాలు, అనేక పరిశోధన వ్యాసాలు డా. మురళీకృష్ణ గారి కలం నుండి జాలువారాయి. ఇప్పటికీ ఎనిమిది పదులు దాటిన వయసులో కూడా ప్రవృత్తిని వదలపెట్టకుండా కాగితాలు, పెన్సిలు పట్టుకుని రచనలు చేస్తున్నారు. పెన్నయితే తప్పుల్ని దిద్దుకోవడం అవటం లేదు, పెన్సిల్ అయితే చెరుపుకొని ఆటంకం లేకుండా రచన సాగించొచ్చునని... నవ్వుతూ చెప్పే డా. మురళీకృష్ణ గారు 'కథామంజరి' జనవరి 2023 సంచిక విశిష్ట అతిథిగా విచ్చేసారు. గ్రామీణ జీవిత వాసనలు ప్రస్ఫుటంగా కనబడే కథలను వ్రాసే, డా. మురళీకృష్ణ గారు తెల్లవారుజామున మూడు గంటలకు లేచి, రచనలు చేసి తర్వాతే వాకింగ్ కి వెళ్తారుట.

శ్రీకాకుళం జిల్లా గొటివాడ గ్రామంలో జన్మించి, ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలలో ప్రాథమిక విద్య చదివి, ఆంధ్ర మెడకల్ కాలేజ్, విశాఖపట్నంలో యం.బి.బి.యస్. చేసారు. ఉస్మానియాలో అనస్థీషియా లో ఎమ్.డి. చేసిన తరువాత 1962-72 మధ్య ప్రభుత్వోద్యోగం చేసారు. తర్వాత విదేశాలలో ముప్ఫై ఐదు సంవత్సరాలు పనిచేసారు. ఇప్పటికీ ఏడాదిలో సగం రోజులు నార్వేలో ఉంటారు. 'కథామంజరి'కి ప్రత్యేకంగా కథ వ్రాసి పంపిన డా. మురళీకృష్ణ గారి నుండి మరిన్ని రచనలు తెలుగు కథాప్రియులను అలరించగలవని ఆశిస్తున్నాం!

# అమ్మతనం

డా. ప్రయాగ మురళీ మోహనకృష్ణ



✆ 000000000000

***"ఇదిగో లింగమ్మత్తా... ఇవి చేతులు కావు, కాళ్లు అనుకో! అభం, శుభం తెలీని అమాయకుడే వాడు. వాణ్ణి నీ చేతుల్లో పెడుతున్నాను. ఎంత అల్లరి చేసినా, విసుక్కోకుండా కాస్త కనిపెట్టు. వేళకింత అన్నం తినకపోతే నీరస పడిపోతాడు. నా కోసం బెంగ పెట్టుకోకుండా చూడు లింగమ్మత్తా! నీకు జీవితాంతం ఋణపడి ఉంటాను అత్తమ్మా!"***

"సీతప్పా... అంతలా చిక్కిపోయావేంమిటే..." అని మా అమ్మను పలకరిస్తే, నవ్వేసేది. అంతేకాని ఏదో నెపం వేసి మాట్లాడేది కాదు.

"అదేమే... నువ్వు తినడం కూడా తగ్గించేసేవే!" అని మా పెద్దమావయ్య అనేవాడు. ఆయనో పేరుమోసిన డాక్టరు. ఆయన భార్య మాత్రం అతనితో మాట కలిపేది కాదు.

"ఆ మాత్రం ఒళ్ళు తగ్గితేనే మంచిదిలెండి! కాస్తా ఒళ్లు, పొగరు కూడా తగ్గుతాయి!" అని వెగటుగానే మాట్లాడేదిట! అంతేకాదు... "అంతమందిని కనడం... ఓ గొప్పనుకోవడం!" అంటూ, తనకి సంతానం కలుగకపోవడాన్ని కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నించేది!

ఇక... మా మవయ్యకి పిల్లల్లేని వెలితికి మాటలుండేవి కావు. 'తనవల్లే ఆమె గర్భవతి అయ్యే అవకాశం లేదని నిర్ధారించడం... ఆయన న్యూనతాభావానికి కారణం' అని అనేవారందరూ.

"పిల్లలు కలగకపోతే ఏం... ఇంతమంది వుండగా లోటేవుందీ!" అని అనేది మా అమ్మమ్మ.

"కన్నవాళ్ళనే లెక్క చెయ్యని వాళ్ళు ఎంతమందుంటే ఏం లాభం!" అనేది మా చిన్నఅత్తయ్య... మా పెద్దమావయ్యని దెప్పుతూ.

"ఎంతసేపూ దెప్పడం తప్పా... నీ నోటంటా మంచి మాట రాదా?" అంటూ మా చిన్నమావయ్య అనేవాడు. అంతకంటే కఠినంగా మాట్లాడడం అతనికీ తెలియదు.

"ఇంతకీ... మా చెల్లెలు చిక్కిపోతోంది, నాలుగు రోజులు ఉండమంటాను!" అనేవాడు మా చిన్నమావయ్య.

"పిల్లలో... పిల్లలో... అని పదిసార్లు తలుచుకుంటుంది ఆవిడ. అలాంటిది ఇక్కడ ఉండమంటే ఉంటుందా!" అని విసుక్కునేది మా చిన్నత్తయ్య.

"అది సర్లేవే, రెండేళ్లలో ఎన్నిసార్లు పిలిచినా రాలేదు. వచ్చినప్పుడు ఆదరించాలి కదా!" అని అనేవాడు.

మా చిన్నత్తయ్యకి మా అమ్మంటే నచ్చేది కాదు. 'ఆవిడ జమీందారిణిలా వెలగబెడితే, నేనేమంత తక్కువ తిన్నానా... నేనూ ముద్దుగా పెరిగినదాన్నే!" అని చాలాసార్లు అనడం నాకు బాగా జ్ఞాపకమే!

ఇదంతా నా వలనే!


నా కోసం మా అమ్మ మావయ్య ఇంటికి అప్పుడప్పుడు వచ్చేది! మా ఊర్లో గుడి లేదు, బడి లేదు. అంచేత హైస్కూలు చదువుకోసం నన్ను మా మావయ్య ఇంట్లో ఉంచి, చదివించవలసి వచ్చింది. ముందులో అత్తయ్య ఆధ్వర్యంలో విజయనగరంలో కాపురం పెట్టి చదివించాలనీ చూస్తే... ఆవిడ్ని ఓ ఆట ఆడించేవాడ్నిట!

"వీడికి కొంచెం చదువు అబ్బేటట్టు చూడు అన్నయ్యా! చచ్చి నీ కడుపున పుడతాను!" అని మా అమ్మ బ్రతిమాలుతుంటే, నాకూ ఏడుపు వచ్చేది!

చదువంటే ఎందుకంత అసహ్యమో... నాకు అర్థమయ్యేది కాదు. ఆటలంటే ఇష్టపడేవాడ్ని. అల్లరి చేయడంలో కూడా ఫస్టే! అన్ని ఆటలు బాగా ఆడతానని మెచ్చుకున్నవారే, అల్లరి చేస్తే తిట్టేవారు! చివరికి లెఖ్కలు నేర్పించడానికి, ప్రవేటుమాష్టారి దగ్గర పంపారు.

అయినా సరే... సెకెండ్ ఫారం పరీక్షలో నాకు బొటాబొటీ మార్కులు వచ్చాయని తెలిసి, మా మావయ్య నా గూబ గుయ్యిమనిపించాడు.

ఆ సంఘటనతో... నేను ఇంట్లోంచి పారిపోదామనుకున్నాను! బస్టాండ్ వెళ్ళి, ఓ బస్సులో కూర్చుని, ఏడుస్తుంటే, డ్రైవరు వచ్చి అడిగాడు.



'నీకెందుకు?' అన్నట్టు చూసాను.

అతను రెట్టించి "ఎందుకు ఏడుస్తున్నావు?" అడిగాడు.

"పరీక్ష పోయింది!" అంటూ బుర్ర దించుకున్నాను.

"ఓస్... అంతేనా!" అని నవ్వేసాడు.

ఆ నవ్వు చూస్తే, నాకు చాలా ఉక్రోషం వచ్చేసింది.

"నాలాగే అన్నమాట..." అంటూ నా వైపు వెటకారంగా చూస్తూ, "బాగా చదవకపోవడం వలన, నేను ఇలా డ్రైవరు ఉద్యోగంలో చేరవలసి వచ్చింది! నాలా పాడవకు, బాగా చదువుకో!" అంటూ భుజం తట్టాడు.

నాకు ఆ మాటలు పెద్దగా రుచించలేదు.

"ఇంతకీ మనదేవూరూ?" అంటూ అడిగాడు.

నేను మాట్లాడలేదు.

ఈసారి నన్ను తేరాపారా చూసి, "నువ్వు డాక్టరుగారి తాలుకా కదూ!" అంటూ తీక్షణంగా చూసాడు.

నేను గమ్మున బస్సులోంచి దూకబోయాను.

అతను అడ్డంగా నిల్చుని... "నువ్వు మళ్ళీ ఇలాంటి పిచ్చిపనులు చేస్తే, డాక్టరుగారితో చెప్పగలను!" అంటూ గదమాయించి, దారి ఇచ్చాడు.

నేను బస్సు దిగి ఇంటిదారి పట్టాను.

అతను నన్ను అలా దెబ్బలాడటంతో... నాలో మార్పు వచ్చిందనే విషయం నాకొక్కడికే తెలుసు!

నా పరీక్ష పోయిందని తెలుసుకున్న మా అమ్మ, నన్నేం అనకుండా, మావయ్యని బ్రతిమాలుతూ కంట్లో నీళ్ళు పెట్టుకున్న దృశ్యం చూసి నేను తట్టుకోలేకపోయాను.

అంతే... మా ఊరు వచ్చేసి, ఇంట్లో కూర్చుని ఏడ్చాను.

మావయ్య అసుపత్రి పని మధ్యలో వదిలేసి మా ఊరు వచ్చేసాడు. నా భుజం మీద చెయ్యివేసి... "కోపంలో ఏం చేసున్నానో తెలియదు గాని, నేను నీ మీద చెయ్యి చేసుకున్నానని మీ అమ్మకి తెలిస్తే... నా పని అయినట్టేరా!" అని తెగ నొచ్చుకున్నాడు.

"ఇంతమంది వుండగా, నీకొక్కడికే చదువు అబ్బకపోవడం చిత్రంగా వుందిరా! మీ ఇంట్లో ఎవరికీ బాధ లేదు. నీ ఒక్కడి కోసం మీ అమ్మ నన్ను ఎంతలా బ్రతిమాలిందో నీకు తెలిస్తే, నువ్వు ఇలా చెయ్యవు! మీ అత్తయ్య ఊర్లో లేదు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఆవిడ నిన్ను మాటలతొ చంపేసేది! బ్రతికిపోయావు!!" అంటూ ఒక్క నిమిషం ఆలోచించి, మళ్ళీ తానే అన్నాడు.

"సెకెండ్ ఫారమ్ కాబట్టి, నిన్నెలాగోలా థర్డ్ ఫారమ్ లోకి పంపే ఏర్పాటు చేస్తాను గాని, ఇక సరిగ్గా చదువుకోకపోతే, నువ్వు గేదెల్ని తోలుకోడానికి కూడా పనికిరాకుండా పోతావు! నా మాట విను!" అంటూ నా చేతులు పట్టుకున్నాడు.

ఆ క్షణంలో మా మావయ్య నాకు దేవుడులా కనబడ్డాడు!

ఆ తర్వాత ఎప్పుడో... "చెంప ఛెళ్ళుమనిపించాడు కాబట్టే, మీ వాడికి జ్ఞానం వచ్చింది! లేకపోతే బలాదూరుగా తిరిగేవాడే!" అని మా హెడ్ మాష్టారు, మా నాన్నతో అన్నారుట. ఆ విషయం మా అమ్మ చెవిలో పడింది గాని, ఆ సమయంలో మా అమ్మ ఆరోగ్యం కొద్దిగా దెబ్బతిని ఉంది!

మా అమ్మని తనతో తీసుకెళ్లి, కొన్ని రోజులు ఉంచుకుని వైద్యం చేద్దామని మా మావయ్య అనుకున్నాడు!

కానీ అమ్మ పడనీయలేదు. "నా ఇంటిని, ఆయన్ని ఎవరిమీదో వదిలిపెట్టి, నేను రాలేనురా! ఈ వయసులో ఆయన్ని జాగ్రత్తగా కనిపెట్టి ఉండకపోతే, పాడైపోతారు!" అంటూ చెప్పిసింది.

కాఫీ గ్లాసు మా మావయ్య కందిస్తూ... "మా చంటివాడ్ని నువ్వు బాగా చూస్తున్నా, అప్పుడప్పుడైనా, వాడు నా కళ్లకి కనబడకపోతే, నాకు అదోలా వుంటుందిరా! నా ఆరోగ్యం బాగుండాలంటే, వాళ్ళు వీళ్ళు బాగుండాలి కదా! అందుచేత నువ్వు మరోలా అనుకోకు... వీలుచూసుకుని వస్తానులే!" అంటూ నొచ్చుకుంటూ చెప్పేది.

ప్రతీసారి మా మావయ్య మా ఊరు వెళ్ళినప్పుడు, మా అమ్మకోసం ఎదురుచూస్తూ కూర్చునే వాడ్ని. మా మావయ్య ఒక్కడూ

తిరిగొచ్చి, ఆ విషయాలన్ని నాతో చెప్పేవాడు.

మా అమ్మ అలా తనని తాను నిర్లక్ష్యం చేసుకుంది. తెలియకుండానే క్షయవ్యాధి ఆమెని దహించేస్తోందన్న విషయం అలస్యంగా తెలిసింది. మద్రాసు తీసుకెళ్ళాలాని మా మావయ్య, నాన్న అనుకున్నారు గాని, ఆ విషయం మా అమ్మ దగ్గర చెప్పలేకపోయారు. చెప్పినా ఆవిడ వినే రకం కాదు!

ఆ పరిస్థితులలో కూడా మా అమ్మ మమ్మల్ని ముద్దు చేసేది. ఇంట్లో అంతమంది ఉన్నా, తానే వంటపని, ఇంటిపని చేసుకునేది! పైపెచ్చు... "పైవాళ్ళ చేతులతో తినిపిస్తే, వాళ్ళ బుద్దులే వస్తాయి!" అని అనేది.

ఒకరోజు వంటింట్లో వంట చేస్తూ స్పృహ తప్పి పడిపోయింది. అర్జంటుగా విశాఖపట్నం పెద్దాసుపత్రికి తీసుకురావలసి వచ్చింది. ఇంట్లో వాళ్ళందరిని వదిలి వెళ్తూ మా అమ్మ వెక్కి వెక్కి ఏడ్చింది. అది తలుచుకుంటే ఇప్పటికి నాకు ఏడుపు వస్తుంది.

"ఇదిగో లింగమ్మత్తా... ఇవి చేతులు కావు, కాళ్లు అనుకో! అభం, శుభం తెలీని అమాయకుడే వాడు. వాణ్ణి నీ చేతుల్లో పెడుతున్నాను. ఎంత అల్లరి చేసినా, విసుక్కోకుండా కాస్త కనిపెట్టు. వేళకింత అన్నం తినకపోతే నీరసపడిపోతాడు. నా కోసం బెంగ పెట్టుకోకుండా చూడు లింగమ్మత్తా! నీకు జీవితాంతం ఋణపడి ఉంటాను అత్తమ్మా!" అలా అంటూ, హృదయ విదారకంగా రోదిస్తూ, ఆసుపత్రికి వెళ్ళి, అలాగే వెళ్ళిపోయి మూడు దశాబ్దాలు గడిచిపోయాయి!

వందేళ్ళు నింపుకున్న మా అమ్మని ఫోటోలో చూస్తుంటే... 'ఏవిట్రా ఇవాళ ఆసుపత్రికి వెళ్ళవా?' అన్న మాటలు వినబడి వెనక్కి చూసాను.

అమ్మ కనబడలేదు... కాని అమ్మతనం ఇంకా నా కళ్ళల్లో కనబడుతునేవుంది!

# ముత్యాలు - రత్నాలు

డా. కేతు బుచ్చి రెడ్డి



అపుడపుడే చీకటి విచ్చుకుంటోంది.

రెండు రోజుల్నుంచి అన్నం ముఖం చూడని రత్నాలు కడుపులో ఆకటి చీకటి ఇంకా వీడిపోలేదు.

తైల సంస్కారం లేని, రేగిన పుల్లటి జుత్తు, నాలుగు రోజుల క్రిందట వెలిసిపోయిన నైలానురిబ్బను ముక్కతో కట్టిన జడతో, చిరుగులు పడ్డ రవికతో, వెలిసిపోయి, మాసిపోయి, చీలికలై చాలీచాలని వాయిలు చీరతో బస్ స్టాండులో నిల్చొనుంది రత్నాలు.

ఎరుపు రంగులో పాలిపోయిన బుగ్గల్తో, లోతుకు పోయిన కళ్ళతో ఉన్నా, అందంగానే ఉంటుంది పదేళ్ళ రత్నాలు. అపుడపుడే అవయవాలు ఎదగటం మొదలు పెట్టాయి ఆ పిల్ల ఒంటిలో, వయసుతో.

ఆబ కళ్ళతో అన్ని అంగళ్ళల్లోకి, మనుషుల ముఖాల్లోకి తొంగి చూస్తూ, అటు ఇటు తిరుగుతున్న రత్నాలుకు బస్ స్టాండ్ ప్రక్కనున్న వంకలోంచి నడచి వస్తున్న ముత్యాలు కనబడింది. రత్నాలు కళ్ళు సంతోషంతో మెరిశాయి.

సూర్యుడు తూరుపు దిక్కున రక్తపు మడుగులో అపుడే పుట్టిన పిల్లాడిలా కొట్టుకుంటూ ఎర్రగా పైకి లేస్తున్నాడు.

పరిగెత్తే శక్తి లేకున్నా, పరుగులాంటి నడకతో ముత్యాలుకు ఎదురు వెళ్ళింది రత్నాలు.

ముత్యాలు కాస్త మంచి చీర, జాకెట్టు వేసుకుంది. బట్టలు నలిగి ఉన్నాయి. ఉన్నా మల్లెపూల కుండాల్సిన తెల్లదనం, అందం, పరిమళం లేవు.

"అక్కా! నిన్నా, మొన్నా అగపడ్డేలేదే ! " బులిపిస్తూ, అలకగా, కాస్త ఏడుపు కంఠంలోకి రాగా, చెప్పకుండా తల్లి ఎక్కడికైనా పోయి వచ్చినపుడు చిన్న పిల్లలు అడిగినట్లు అడిగింది రత్నాలు.

"ఆ... అదా! కరునూలు ఎర్ర బస్సు డ్రైవరు నన్ను తీసుకపోయినాడు" అన్నది ముత్యాలు కాస్త గర్వంగా, కాస్త నొచ్చుకుంటూ.

వాళ్ళిద్దరూ రక్తం పంచుకున్న అక్కాచెల్లెళ్ళు కారు. రోజూ బస్ స్టాండులో ఆకలితో తిండికోసం తిరుగుతూ పరిచయమై, ఆత్మీయతను పెంచుకున్నవారు.

గంపెడు పిల్లల్ని కనటం వరకే తమ బాధ్యత అనుకున్న తలితండ్రులు, కని లోకం మీదికి తోలారు రత్నాలును. మన దేశంలో చాలామందికి అడుక్కునేదే వృత్తి. కడుపు చేత పట్టుకొని, నమ్ముకుని ఆ వృత్తినే చేపట్టిన రత్నాలు కడుపును ఆ వృత్తి మోసం చేసింది.

"అక్కా! ఆకలేస్తోంది" అంది రత్నాలు.

"సర్లే... దా! నా దగ్గరా ఇరవై పైసలే ఉండాది. టీ తాగుదాం దా. ఆ డ్రైవరోడు దుడ్డు ఇయ్యలేదు. మల్లా ఇస్తలే అన్నాడు" అంటూ టీ అంగడి వైపు పిల్చుకు వెళ్ళింది ముత్యాలు.

కడుపులో పడుతున్న వేడి వేడి టీ అమృతప్రాయంగా తోచింది రత్నాలుకు. అంత వేడిగా ఉన్న టీని రెండు గుక్కల్లో ముగించి, కృతజ్ఞతాభావంతో ముత్యాలు వైపు చూసింది రత్నాలు.

రెండు గ్లాసులు ఒక దానిలో ఒకటి పెట్టి పై గ్లాసులో పది పైసల బిళ్ళలు రెండు వేసి, టీ చేస్తున్నవాడికందించింది ముత్యాలు.

బస్ స్టాండు చివర చెట్టుక్రింద కూచున్నారిద్దరూ.

"అక్కా రెండ్రోజులప్పట్నుంచి బువ్వే లేదు. అడుక్కోగా వచ్చింది, ఆడు ఈడు ఇచ్చిందాంతో నిన్న పొద్దున రెండిడ్లీ తినినా. అప్పటినుంచీ అది గూడా లేదు. టీ తాగేదానిక్కూడా దుడ్డు లేదు. ఒట్టి కడుపుతో మాడి సస్తన్నా.... అక్కా! నీకు డైవరోల్లు, క్లీనరోల్లు అపుడప్పుడు అర్ధరూపాయి, రూపాయి ఇస్తాంటారే... నాకేమక్కా ఇయ్యరు... ఆడు ఈడు సెంపగిల్లి, ఒళ్ళు నలిపి, ఐదు, పది పైసలిస్తారంతేనే..."

రత్నాలు పూర్తి చెయ్యకుండానే, "ఓ అదా! నీకు తెల్దులేయే... సిన్నదానివి!" నవ్వుతూనే పూర్తి చేసింది ముత్యాలు.

"సెప్పక్కా! మాట్టాడే సత్తవ కూడా లేదు. పట్టరానంతాకలిగా ఉండాది. నేను నీ మాద్రి సంపాయించుకొని కడుపు నింపుకుంటా" కళ్ళలో నీళ్ళు తిరగ్గా చెప్పింది.

"నువ్వు పనికిరావే. ఇంకా సిన్నపిల్లవు..... ఇంకా రెండు మూడేండ్లు పోతేగాని...."

"అయితే నేనాకలితో సచ్చిపోవాల్సిందేనా అందాకా, సెప్పక్కా...." ఎంతో దీనంగా, ఎంతో ఆశగా మళ్ళీ అడిగింది.

ముత్యాలు మెదడులో ఆలోచనలు ముసిరినయ్. పద్దెనిమిదేళ్ళ ముత్యాలుకు గతం మనసులో మెరిసింది.

"అయితే నా ఎంబడి దా!" అంటూ బస్టాండుక్కొంచెం దూరంలో వున్న గుడిసెల దగ్గరికి తీసికెళ్ళింది.

గుడిసె లోపలికి పోయి తిరిగొచ్చిన ముత్యాలు, "మా యమ్మ నన్ను "పనికొచ్చేట్టు" సేసింది.

మల్లెప్పుడో రెండేండ్లకు పెద్దమనిషినయినాను... అయ్య సచ్చిపోయినాక ముసిల్దయిన మాయమ్మ, గంపెడు సిన్నపిల్లోల్లకు కూడేయలేక నన్ను సంపాయిచ్చక రమ్మని.... సేసింది. ఇపుడు ఆయమ్మ లేదు..... పోకిరీగా తిరిగిన అన్నా... సెల్లెల్లు, తమ్ముల్లు అంతా సెట్టుకొకరు, పుట్టకొకరు....... యాడుండారో తెల్దు..."

గుండెలో గూడు కట్టుకున్న కథను చెప్పింది.

కన్నీళ్ళతో కూడిన అక్క ముఖంలోకి రత్నాలు ఏడ్పు ముఖంతో చూసింది.

"దా, పోదాం." అంటూ బస్ స్టాండ్ పక్కనున్న వంకలోకి నడిచారిద్దరూ.

'ఇదుగో ఈ బెండు... నేను పెడ్తాను..." అంటూ చెట్టు చాటుకు తీసుకుపోయింది ముత్యాలు.

"ఇంక దా... గంటకో పాలి వంక నీల్లల్లో కూకో. అపుడు నువ్వు 'పనికొస్తావు'. బయంలేదులే. నేను సెప్పినట్టు సేత్తావుండు. ఆ డైవరోడు వచ్చినాడేమో సూసొస్తా. దుడ్డిస్తడేమో!" అన్నది ముత్యాలు మళ్ళీ.

రత్నాలు భయంగా చూసింది ముత్యాలు వైపు!

ముత్యాలు జాలిగా చూసింది రత్నాలు వైపు!!

ముత్యాలు బస్ స్టాండులోకి నడిచింది.

రత్నాలు తాగిన టీ నిప్పుపైన నీటిబొట్టులా కడుపు కుంపటిలో ఎప్పుడో హరించుకు పోయింది. కడుపు నిండా నీళ్ళు తాగింది.

ముత్యాలు చెప్పినట్లు వంక నీళ్ళలో కూచుంది.

సూర్యాస్తమయమైంది.

రత్నాలు నీరసంగా బస్ స్టాండులోకి నడిచింది. అపుడే వచ్చిన బస్సులోంచి దిగిన కండక్టరు పక్కన నిల్చున్న రత్నాలు బుగ్గలు పిండి బుజాల్ని గట్టిగా నొక్కి, ఐదు పైసలు చేతిలో పెట్టి "రైట్!" అన్నాడు. టైం లేదన్నట్లు.

బస్ కదిలింది.

'ఆకలేస్తోంది... ఈ ఆకలికి తట్టుకోలేను, ఆకలి... ఏదైనా తినాల....' అనుకుంటూ తిరిగి తిరిగి బఠానీలు అమ్ముతున్న కుర్రాడి చేతిలో ఆ ఐదు పైసల బిళ్ల పెట్టి, బఠానీలు చేతిలో పోయించుకుంది.

పెద్దవిగా, బొరుగు బొరుగ్గా ఉన్న బఠానీలన్నీ గబగబా తినేసింది. మిగిలిన గట్టి గట్టిగా ఉన్న బఠానీలు నమిలే శక్తిలేక దిగమింగి, బస్ స్టాండ్ బయట వున్న కుళాయి దగ్గరకెళ్లింది. అందరూ కడవలు, బిందెలు, బక్కెట్లు నింపుకుంటున్నారు. రత్నాలు కడుపును కుళాయి నీళ్లతో నింపింది!

చీకటి పడింది.

అక్కడా, ఇక్కడా తిరిగింది. బస్ స్టాండు అంతా వెదికింది. ముత్యాలు పొద్దుననగా పోయింది. ఇంతవరకూ జాడేలేదు.

దరిద్రుడికి ఆకలీ, సంతానం ఎక్కువైనట్టు రత్నాలు కడుపులో ఆకలి మళ్ళీ రగులుకుంది. ఆశ మేల్కొంది. ఆకలి ఆశను సతాయించింది.

బస్ స్టాండ్ మధ్యలో, బారులైటు వెలుగు కింద నల్లగా నిలుచున్నాడొక క్లీనరు. పదిగంటలప్పుడు వచ్చే నెల్లూరు బస్ కోసం, కాచుకొని, కూచొని ఉన్నాడు. రత్నాలుకి వాడు తెలుసు. వాడికి రత్నాలు తెలుసు.

"మామా" అంది వాడి దగ్గరకు పోయి. రత్నాలును చూసి, నల్లటి మొహంలో వాడి కళ్ళు మెరిసాయి... అమావాస్య రాత్రి ఆకాశంలో చుక్కలల్లే.

బుగ్గగిల్లి, భుజం అదిమి, ఐదుపైసల బిళ్ళ చేతిలో పెట్టబోయాడు.

రత్నాలు వాడి చేతిని పక్కకు తోసేస్తూ "వద్దు" అంటూ వాడి కళ్ళలోకి మత్తుగా చూసింది.

"మామా" అంది మళ్ళీ.

"ఇదేందే ఇయ్యాల నీ యవ్వారం కొత్తగా ఉండాది! అంతకంటే నువ్వు 'పనికి' రావే. ఇంకా రెండేళ్ళు పోనీ" అన్నాడు వాడు నవ్వుతూనే.

ఇంతలో వాళ్ళిద్దరి దగ్గరకి ముత్యాలు వచ్చింది.

"అక్కా పొద్దుట్నుంచీ కనిపించనేలేదే... నీ కోసం కాసుకొని కాసుకొని సచ్చినా..." అంటూ పలకరించింది రత్నాలు.

"ఆ దొంగనాయాలు దుడ్డియ్యలేదు...గిడ్డియ్యలేదు. బతిమాలితే కూడెట్టించినాడు. ఆడితోనే తిరిగి తిరిగి కాళ్ళు చచ్చుపడిపోయి వస్తున్నా" అంది ముత్యాలు.

"ముత్తేలూ నువ్వుండవే, బస్సొస్తానే మనం పోదాం. రత్తాలూ నువ్వు పోయే" అన్నాడు వాడు.

"సూడక్కా నేను పనికిరానంటున్నాడు. నువ్వన్నా సెప్పక్కా" అంది దీనంగా రత్నాలు.

"పనికొస్తాది" అంది ముత్యాలు.

"ఆ! ఎప్పుడే... ఎప్పట్నుండే, నేను కాసుకొనుండానే" కోరికను కక్కేడు వాడు.

"నీకే తెలుస్తాది సూడు" అంటూ ముత్యాలు అక్కడ్నుండి వెళ్ళిపోయింది.

బస్సొచ్చేసింది. క్లీనరు బస్సులోకి పోయి, పనిచేసి, డ్రైవరుకూ కండక్టరుకూ చెప్పి వచ్చాడు. వంకలోకి నడిచారిద్దరూ. తాటిచెట్ల వెనక చంద్రుడు తొంగి చూస్తున్నాడు.

బస్టాండ్ లో అటూఇటూ తిరిగింది ముత్యాలు. టీ అంగడి దగ్గరికెళ్ళింది. బెంచీల మీద కూర్చొని టీ తాగుతున్న డ్రైవర్ల, కండక్టర్ల పక్కనపోయి నిలుచుంది.

వాళ్లలో ఒక డ్రైవరు టీ తాపించి, ముత్యాలును తీసుకొని, బస్టాండ్ బయటకు నడిచాడు. వంకలోనుంచి బస్టాండ్లోకి వచ్చారు రత్నాలూ, క్లీనరూ. రత్నాలు చేతిలోని క్లీనరిచ్చిన రూపాయిబిళ్ళను మళ్ళీమళ్ళీ చూసింది. కళ్ళు సంతోషంతో మెరిసాయి. వాడు బీడీ తాగుతూ, నడుస్తున్న కొరివిదెయ్యంలా అక్కడ్నుండి వెళ్ళిపోయాడు.

రత్నాలు బస్టాండు బయటే, గేటు పక్కన అన్నం అమ్మే అవ్వ గంప దగ్గరకు చేరింది. అప్పుడే అవ్వ కిరసనాయిలు బుడ్డి మలిపి, సర్దుకుంటోంది.

"అవ్వా బువ్వైపోనాదా?" ఆత్రంగా అడిగింది రత్నాలు.

"ఆకర్న అడుగూ బొడుగూ తేరగా పెడతాననుకున్నావే పిల్లా! దుడ్డిస్తేనే పెట్టేది" అంది అవ్వ కరాఖండీగా.

"ఆ... ఇస్తాలేవ్వా. ఆకలిగా ఉండాది, ఏముందో పెట్టు" అంటూ రూపాయిబిళ్ల చూపించింది రత్నాలు.

అవ్వ "ఆ!" అని నోరు తెరిచింది. అయితే అవ్వనోట్లో పళ్ళులేవు బయట పడడానికి. గుండెలో అమృతం లేదు, తియ్యగా పలకడానికి.

"కూకోయే రత్తాలూ, ఒక సంకటిముద్ద మిగిలింది. ఎంకలపులుసు కూడా యేత్తాలేయే!" అంటూ ఆకులో పెట్టిచ్చింది.

అవ్వచేతిలో రూపాయిబిళ్ళ పెట్టి, ఆకుతో ముద్ద అందుకుంది. ఆబగా గబగబా మింగేసింది. చెయ్యికడుక్కొని, చెంబులో నీళ్ళు గుటగుటా తాగేసింది.

అవ్వ మిగిలిన చిల్లర, అరవైపైసలూ రత్నాలుకిచ్చింది.

అవ్వ గంప నెత్తికెత్తుకొని వెళ్ళిపోయింది.

బస్స్టాండులోని వెయిటింగ్ హాల్లోకి నడిచింది రత్నాలు. అరుగు కింద ఉమ్ముల్లో, దుమ్ములో, బీడీ, సిగరెట్ తుంటల్లో కొంగు పరచుకొని పడుకొంది.

ఒళ్ళంతా నొప్పులు. చీర వెనకభాగం కొంతమేర రక్తంతో తడిసింది. వేటినీ లెక్క చెయ్యలేదు రత్నాలు. లైట్లైనా లేని చీకటి వెయిటింగ్ హాలులో కళ్ళు మూసుకు పడుకుంది రత్నాలు.

బయట చంద్రుడు వెన్నెల కాస్తున్నాడు... రాజకీయనాయకుల దేశ సేవా ప్రపూరితమైన ఉపన్యాసాల జొల్లులా (జల్లు కాదు)!

వెన్నెల రత్నాలును తాకలేదు. ఎలక్షను వాగ్దానాల ఉపన్యాసాలు ఆ పిల్ల ఆకలి తీర్చలేవు.

బస్స్టాండ్ బయట ఎత్తైన బోర్డుపైన, ఏదో ఎరువుల కంపెనీ ఎడ్వర్టైజ్మెంటు "అధిక రాలుబడికి వరాల ఎరువులు" వాడడం వలన వచ్చిన పంటను చూపిస్తూ, అమాయకంగా మురిసిపోతున్న రైతు ఉన్నాడా ఎడ్వర్టైజ్మెంటులో.

పక్కనే ఎర్రత్రికోణం... "చిన్న కుటుంబం... చింతలు లేని కుటుంబం"... కుటుంబనియంత్రణ ఎడ్వర్టైజ్మెంటులో పేద దంపతులు.

కళ్ళు మూసుకున్న రత్నాలు మనసులో అంతా అన్నమే! ఆకలి లేదు... రేపటినుండి ఆకలి తననేమీ చెయ్యలేదన్న ధైర్యం... విశ్వాసం! తనింక బతగ్గలదు. ఆకలితో మాడి చావాల్సిన పనిలేదు. రేపటిని గూర్చిన భయం లేదు. ఏదో తృప్తి... ఏదో నమ్మకం. పొద్దున్న తను తీసుకున్న నిర్ణయం, చేసుకున్న పనీ తనకిస్తోంది.

ఆ పిల్ల తీసుకున్న నిర్ణయం, చేసుకొన్న పనీ 'పెద్ద' 'గొప్ప' వాళ్లకు చురక!

ఈ దేశంలో ముత్యాలూ, రత్నాలూ లాంటి అభాగ్యులెందరో...

అలాంటి ముత్యాలూ రత్నాలే మన దేశానికి సంపత్తి అయిపోయింది!!

# తాతా! ఆచ్చి!!

డా. పరుచూరి రాజారామ్



***ఉదయం తాతగారు పేపరు చూస్తున్నారు. కోడలు వంటింట్లో పనిలో ఉంది. పాప నాయనమ్మ దగ్గర చేరింది. చేత్తో తలమీద తట్టి చూపిస్తూ "ఎప్పో టామ్ము అప్పీ" అన్నది. ఆమెకర్థంకాక "ఏమిటమ్మా?" అని అడిగింది. మళ్ళీ చెప్పింది పాప "ఎప్పో టామ్ము అప్పీ" అని! రెండు మూడు సార్లు విన్నా ఆమెకర్థం కాలేదు. కోడల్ని పిలిచింది. "అమ్మాయ్! ఏమిటే అంటున్నది పాప!" అని అడిగింది. అమ్మకూ మరలా అదే చెప్పింది పాప.***

కాళ్ళకున్న వెండి పట్టాలు చిరుసవ్వడి చేస్తుండగా పరిగెత్తుకుంటూ వచ్చింది పాప.

"తాతా! ఆచ్చి!" చదువుతున్న పుస్తకం మూసేసి ఈజీ చైర్లోంచి లేచి పాప వైపు చూశారు. స్నానం పూర్తయింది కానీ ఒళ్ళు తుడుచుకోలేదు గుమ్మడి పండులా ఉన్న పాప. కాళ్ళకు చుట్టుకుని ఊపిరాడనివ్వకుండా, "తాతా! ఆచ్చి!", "తాతా! ఆచ్చి!" అనసాగింది.

పాప భాష తాతకూ, తాత చెప్పేది పాపకూ అర్థమవుతాయి. ఆమెని షికారు తీసుకెళ్ళాలి. పాప పదకోశంలో 'ఆచ్చి' అంటే షికారు వెళ్లటం. సాయంత్రం స్నానం చేస్తూనే వెంటపడుతుంది. ఎన్ని పనులున్నా, ఓపిక ఉన్నా లేకపోయినా పాపని షికారు తీసుకెళ్లాల్సిందే! ఆ వేళకి సిద్ధమైపోతుంది. తల్లిని ఒళ్ళు తుడవనివ్వదు. బట్టలు వేయనివ్వదు. పౌడరు వేయనివ్వదు. బొట్టు, కాటుక పెట్టనివ్వదు. తల్లి దగ్గర్నుంచి పారిపోయి "తాతా! ఆచ్చి!"అంటూ వెంటపడుతుంది.

పాప కంఠం తాతగారికి లేని ఓపికను తెస్తుంది. ఆమె కాలి గజ్జెల చప్పుడు ఆయనకు సంగీత సముద్రపు ఘోషలా వినిపిస్తుంది. పంచమస్వరాన్ని నినదించే కోయిలే 'తాతా' అని పిలిచినట్లు వినిపిస్తుంది.

★★★

ఆరోగ్యాన్ని లక్ష్యపెట్టకుండా శ్రమించిన ఫలితం వృద్ధాప్యంలో ప్రభావం చూపుతున్నది.


రోడ్డుమీదికి వెళ్ళాలంటే భయం. పోటీలుపడి పరుగెత్తే బస్సులు, కుడి ఎడమ అనే తేడా లేకుండా దూసుకుపోయే ద్విచక్రవాహనాలు! ఏ పక్కకు తప్పుకుందామనుకున్నా ఏ వాహనం కింద నలిగిపోవాలోననే భయం. వయసుతోపాటు మందగించిన చూపు మరింత భయాన్ని కలిగిస్తున్నది. రోడ్డుమీదకొస్తే రద్దీ మూలంగా ఉత్పన్నమయ్యే గుండెదడ! వీటితో పాపకేమీ సంబంధం లేదు. "తాతా! ఆచ్చి!" అంటుంది. సృష్టిధర్మాలతోనూ, ప్రకృతి నియమాలతోనూ తప్ప నిత్యనైమిత్తికాలతో ఏ సంబంధమూ లేని భగవంతుడిలాగా పాప "తాతా! ఆచ్చి!"అంటున్నది.

వేసిన తారురోడ్డు పోయి కంకరరాళ్ళు నరకటానికి సిద్ధంగా ఉన్న గొడ్డళ్ళలాగున లేచి ఉంటాయి. చూడకుండా అడుగులేస్తే ఏ గోతిలోనో పడాలి. ప్రతి రోజూ ప్రతి పేపర్లోనూ ఈ రోడ్ల గురించీ అస్తవ్యస్తమైన ట్రాఫిక్ గురించీ వార్తలు వస్తుంటాయి. మంత్రుల అధికార్ల హామీలు వస్తూనే ఉంటాయి. 'ఎందుకో ఈ శుష్కప్రియాలు! పదేళ్ళుగా ఈ రోడ్డు ఇలాగే ఉంది! జనం అతలాకుతలమవుతూనే ఉన్నారు' అనుకుంటారు తాతగారు దడదడలాడే గుండెని చిక్కబట్టుకుంటూ.

పాప నడక నేర్చుకోలేదు. పరుగుతోనే మొదలు పెట్టింది కాలానికి నేను ప్రతినిధిని అన్నట్లు! షికారు వెళ్ళటం మొదలుపెట్టిన తొలిరోజులలో రోడ్డు వారగా ఆగి వచ్చే పోయే బస్సులను కార్లను చూపిస్తుంటే 'మీరంతా నాకొకటే! జడమైనా జీవమైనా, ఒకరైనా మంది అయినా, జంతువైనా మనిషైనా అంతా సమానులే' అన్నట్లు తాత్వికంగా అందరికీ అన్నిటికీ 'టాటా' చెప్పేది.

పాపాయికి తాతగారి రెండో జత కళ్ళెందుకో అర్థంకాదు. కళ్ళజోడు పీకి విసిరేస్తుంది. చూపు మెదడుకి సంబంధించినదనీ, కళ్ళూ కళ్ళద్దాలు ఒట్టి వాహకాలేననీ శాస్త్రజ్ఞులు చెప్పే అంతిమసత్యం ఆమెకెలా తెలిసిందో తాత గారికి అర్థం కాదు. ఆయన ఆలోచనకే అందేది కాదు.

తాతగారు మంచి భక్తుడు. చిత్తశుద్ధితో భగవంతుణ్ణి ఉపాసించినట్లుగానే ఉద్యోగమూ చేశారు. చేయగలిగినదాని కంటే ఎక్కువే శ్రమించారు. పేదరికంవల్ల కాలేజీ చదువులకు నోచుకోలేదు. హైస్కూలు చదువయిపోగానే రెవిన్యూ డిపార్టుమెంటులో చేరారు. బల్ల క్రింద చేతులుపెట్టే అలవాటు లేనందువలన నలుగురిచేతా గౌరవించబడ్డారు. రిటైరయిపోయినా కొడుకు చేతికందివచ్చే వరకూ ప్రైవేటు కొలువు చేయక తప్పలేదు. పులిమీద పుట్రలా ముసలామె ఎప్పుడూ దీర్ఘవ్యాధులతో మంచంలోనే ఉంటుంది.



కొడుకు ఉద్యోగంలో చేరాకనే వివాహం చేశారు. రిటైరుమెంట్ ఆయనకు బాధాకరంగా లేదు. అవసరాలు తగ్గించుకున్నవాడికి ఆశలు రేపిన(లేని)వాడికి ఏ బాధా ఉండదు. కాలం గడవటం లేదు అని అనిపించేటప్పటికి నీకోసమేనన్నట్లు పాపాయి దేవదూతలా వచ్చేసింది.

కోడలికి వంటింట్లో సరిపోతుంది. పాపాయీ తాతగారూ మంచి స్నేహితులయారు. మాటలు రాకముందే ఉయ్యాలమంచంలోనే తాతని చూసి పాప కళ్ళు మెరిసేవి. నవ్వేది. అందరికంటే ముందు తాతగారినే గుర్తు పట్టేది. ఎత్తుకోమన్నట్లు చేతులూ కాళ్ళూ పైకెత్తేసేది. క్రమక్రమంగా ఎత్తుకోమన్న కోరికను చేతులూ కాళ్ళూ గిలగిలా కొట్టుకుని తెలియపరచుసాగింది.

తాతగారు ఎత్తుకోందే నిద్రపోదు. పెద్ద చదువులు చదువుకోలేకపోయాననే తపన వదలని తాతగారికి స్పష్టమైన ఉచ్చారణ అంటే ఎంతో వ్యామోహం. అర్థాలు తెలిసినా తెలియకపోయినా విన్న శ్లోకాలను విన్నట్లు గుర్తుపెట్టుకునేవారు.

పాప రాకకు ముందు తరచూ 'అనాయాసేన మరణం వినా దైన్యేన జీవనమ్ దేహాంతే తవ సాయుజ్యం దేహిమే పార్వతీపతే' అని తరచూ అనుకుంటూ ఉండేవారు.

బుజ్జి పాపాయి నెత్తుకుని నిద్రపుచ్చాల్సివచ్చేటప్పటికి శ్లోకం మారింది. 'బుద్ధిర్బలం యశో ధైర్యం, నిర్భయత్వ మరోగతా అజాడ్యం వాక్పటుత్వంచ శ్రీ హనుమత్ స్మరణాద్భవేత్' అంటూ పాపని జోకొట్టేవారు.

నిద్రపోయాక, జాగ్రత్తగా పడుకోబెట్టి పున్నమి చంద్రునిలాంటి పాపనే చూస్తూ కూర్చునేవారు. కోడలు పని పూర్తిచేసుకుని పాలు పట్టటానికి వచ్చినప్పుడు లేచి వెళ్ళి నడుం వాల్చేవారు.

పాప శబ్దకోశం పెద్దవుతున్నది. కొత్త పదాలకు అర్థాలు తెలుసుకోవటం, అన్వయించటం తాతగారికి తప్ప అందరికీ కష్టమవుతున్నది. మంచంలో ఉన్న నాయనమ్మకు కాసేపు కబుర్లు చెపుతుంది. ఆమె కథలు చెప్తే శ్రద్ధగా వింటున్నది. ఏమర్థమౌతుందో ఆమెకే తెలియాలి!

ఒకరోజు తాతగారు పెన్షన్ తెచ్చుకోవటానికి వెళ్లి ఆలస్యంగా వచ్చారు. పాప చాలా గోలచేసింది. తనను తీసుకెళ్లకుండా తాత వెళ్ళి వచ్చారని అలిగింది. పరుగులు తీయటం, పడిపోవడం, దెబ్బలు తగలటం మామూలైపోయింది. రోజుకొకచోట బొప్పికట్టి కనిపించేది.

★★★

ఉదయం తాతగారు పేపరు చూస్తున్నారు. కోడలు వంటింట్లో పనిలో ఉంది. పాప నాయనమ్మ దగ్గర చేరింది. చేత్తో తలమీద తట్టి చూపిస్తూ "ఎప్పో టామ్ము అప్పీ" అన్నది. ఆమెకర్థంకాక "ఏమిటమ్మా?" అని అడిగింది. మళ్ళీ చెప్పింది పాప "ఎప్పో టామ్ము అప్పీ" అని! రెండు మూడు సార్లు విన్నా ఆమెకర్థం కాలేదు. కోడల్ని పిలిచింది. "అమ్మాయ్! ఏమిటే అంటున్నది పాప!" అని అడిగింది. అమ్మకూ మరలా అదే చెప్పింది పాప.

"ఈ మనుమరాలి భాష ఆ తాతగారికే తెలియాలి! ఉండండి! కనుక్కుందాం!" అంటూ పాపను చంకన వేసుకుని నవ్వుతూ మామగారి దగ్గరకెళ్లింది.

"మావయ్యగారూ! మీ మనుమరాలేమిటో చెపుతోంది. మాకు తెలియటంలేదు. కాస్త చెబుతారా?" అనడిగింది.

"తాతా! ఎప్పో టామ్ము అప్పీ" అంది తల చూపిస్తూ.

"ఓస్! అదా!" అంటూ తాతగారు వివరణ ఇచ్చారు.

"బుజ్జితల్లి భాషలో ఎప్పో అంటే ఎప్పుడో అని అర్థం. టామ్ము అంటే దెబ్బ అని! అప్పీ అంటే నొప్పి! ఇప్పుడర్థమైందా? ఎప్పుడో తగిలిన దెబ్బ ఇప్పుడు నొప్పి పెడుతోందని"

మంచంలోని ముసలామెకు కూడా నవ్వొచ్చింది. పాప భాషకు అంత మనసారా నవ్వుకున్నారు. పాప రోజుల్ని క్షణాలుగా మార్చేస్తున్నది.

పాపకి జంతువులంటే ఎంతో ఆసక్తి. సీతాకోకచిలుక కనిపిస్తే చప్పట్లుకొడుతూ ఎగురుతూ కేరింతలు కొడుతుంది. అలాంటప్పుడు 'వెలిగిపోయే పాప ముఖాన్ని చూస్తే ఆకలిదప్పులే ఉండవు' అంటూంటారు తాతగారు.

కుక్కలు కనబడితే తదేకదీక్షతో చూసేది. "తాతా! బౌబౌ!" అనేది. వీధిలో కుక్క పిల్లల్ని పెట్టింది. అవి ముద్దుగా బొద్దుగా ఉన్నాయి.

పరుగెత్తి వాటిని పట్టుకోబోయేది. తల్లి అన్నం పెట్టడానికి రాగానే 'బౌబౌ' అని వేలు చూపించేది. వాటికి కూడా పెడితేనే తను తినేది.

దూరంగా కోయిల కూసేది. ఆడుతున్న ఆటలను తక్షణం ఆపి ఆలకిస్తుంది. కాసేపటికి 'కూ' అని తానే కోయిలలా కూసేది. కూత వినిపించిన వేపే, లేత పాదాలు నేల మీద ఆనుకున్నాయా లేదా అన్నంత వేగంగా పరుగులు తీస్తుంది.

పాపతో పాటు తాతగారు పరిగెత్తలేరు. ఆయాసం వస్తుంది. అయినా పరుగెత్తక తప్పదు. లేకపోతే ఆ పరుగు ఏ ప్రమాదమో పొంచి ఉన్నచోటికి కావచ్చునని తాతగారి భయం. తాతగారు పరుగెట్టగలరా లేదా అనే విషయం పాపకు పట్టదు. 'బ్రతకడానికే తినడం కానీ తినడానికి బ్రతుకు కాదు' అనే సత్యం అందరికన్నా పాపకు బాగా తెలుసు. ఎలా పెట్టినా ఏం పెట్టినా ఆకలి వేయందే తినదు. పెట్టిన ముద్ద పెట్టినట్లే నోట్లో ఉంచేస్తుంది. గంటలు గంటలు బ్రతిమలాడినా తినదు. ఆకలి వేస్తే మాత్రం గొంతు పెద్దది ఏడ్చేస్తూ "అమ్మా! ఆయ్! అమ్మా! ఆయ్!" అంటుంది. చేయి ఖాళీలేక అమ్మ ఆలస్యం చేస్తే "తాతా! అమ్మా ఆయ్!" అని సంజ్ఞాపూర్వకంగా చేతులు తిప్పుతూ పాలు ఇవ్వలేదని ఫిర్యాదు చేస్తుంది. అన్నం పెట్టేటప్పుడు, నోట్లో ముద్ద మింగించడానికి రోజుకొక కొత్త పద్ధతి కనిపెట్టేది తల్లి.

"అదిగో! కుక్క ఏమంటున్నదమ్మా!" అని కుక్కని చూపించేది.

"బౌబౌ" అనడానికి ముద్ద మింగేసేది పాప.

పాప ఏడుస్తుంటే ధ్యాస మళ్లించడానికి "చూడమ్మా! పాపా! అదిగో పిల్లి! ఏమంటున్నది? మ్యా .. వ్! మ్యా .. వ్!" పాప ఏడుపు మరిచిపోయి కేరింతలు కొట్టేది. తల్లిలాగా మ్యావ్ మ్యావ్ అనటం చేతకాక 'మీమీ మీమీ' అనేది. చీకటిపడితే నిద్ర వచ్చేవరకూ తాతగారి భుజంమీదే ఉండేది. కొంతసేపు జోకొట్టాక 'నాకు నిద్ర రావటం లేదు' అన్నట్లు తల అడ్డంగా తిప్పుతూ 'ఉఁ ఉఁ' అనేది.

వరండాలో లైట్ కింద ఎన్నో బల్లులుంటాయి. వాటిని తోలెయ్యమంటుంది. పైన ఉన్న తుండు గుడ్డ విసిరితే అవి పారిపోతాయి. వరండాలో అటూ ఇటూ తిరుగుతూ ఉంటే ఎప్పుడు చూసేదో ఎలా చూసేదో "తా.. తా.. బబ" అంటుంది. బల్లి అనే మాట పలక 'బబ' అంటుంది. మరల తోలేయటం అదొక ఆట. ఈ ఆటలు కొంతసేపు ఆడాక వరండా పచార్లు అయ్యాక తాతా అని తాతగారి పెదవులమీద చిగురుటాకుల్లాంటి తన మృదువైన వేళ్ళుంచేది. అంటే తాతగారు శ్లోకాలు మొదలుపెట్టాలి.

'బుద్ధిర్బలం యశోధైర్యం..' అంటూ మొదలు పెట్టగానే మొఖం ఆయన మెడకు వత్తిపెట్టి వెచ్చగా నిద్రపోతుంది.

తెల్లవారక ముందే లేచి అన్ని పనులూ పూర్తి చేసుకుని, పాప కళ్ళు తెరిచే సమయానికి ఆమె ముందుంటారు. ఆ రోజున పాప లేచింది. తాత కోసం చూసింది. లేకపోతే తాతా తాతా అని రెండు సార్లు పిలిచింది. పలకకపోతే ఏడవసాగింది.

కోడలు వంటింట్లోంచి వచ్చి పాపను తీసుకుని 'మామగారేమైనారా?' అనుకుంటూ వరండాలోకొచ్చింది. బయట ఈజీ ఛైర్ లో పడుకుని ఛాతీమీద రుద్దుకుంటున్నారు. 'తాతా' అంటూ దూకబోయింది పాప. పాపను ఆపుతూ, "ఒంట్లో బాగా లేదా మావయ్యా?" అని అడిగింది. "ఏం లేదమ్మా! ఎందుకో కొంచెం గుండెల్లో బరువుగా ఉన్నట్లు ఉంది!" అన్నారు.

పాపను చంక నుంచి దించకుండానే, "లేవకండి మామయ్యా! కాఫీ తాగితే కొంచెం సర్దుకుంటుందేమో! నే తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది. పాప ఆమె చేతిలోంచి జారి పరిగెత్తింది. వరండాలో తాతగారి పక్కనే వెళ్లి నిల్చుంది. బాధ ఎక్కువైందేమో

ఆయన సన్నగా మూలుగుతున్నారు. తాను రాగానే ఈజీ ఛైర్ లోంచి ఎత్తుకునే తాతగారు లేవలేదు. పైగా మూలుగుతున్నారు. ఆ లేతగుండెకు తాతగారి బాధ తెలిసింది కాబోలు. అద్భుతమైన ఆలోచన వచ్చింది.

"తాతా! తాతా!" అని పిలిచింది. పడుకునే తలమీద చేయివేసి నిమురుతూ "అమ్మా" అన్నారు.

పాప "తాతా! ఆచ్చి!" అనలేదు.

"తాతా! తాతా! క్యాట్ మీమీ! క్యాట్ మీమీ!" అన్నది. కాఫీ తెచ్చిన కోడలు విన్నది.

కళ్లు చెమర్చుతుండగా కోడల్ని అడిగారు. "అర్థమైందా అమ్మా! ఆ పసి మనసూ! భాషా!"

పాప శబ్దకోశానికి సంబంధం లేని విషయమైనా తల్లికర్థమైంది.

పాప ఏడుస్తున్నప్పుడు ముద్ద మింగించటానికి "క్యాట్ మీ! మీ!" అంటున్నది. తాతగారి బాధ మరిపింపచేయటానికి పాప అవే మాటలు వాడుతున్నది.

తన మాటలకు వారిద్దరూ సాంత్వన పొందారనుకున్నది పాప. కుర్చీకి ఆ వైపుకు పరుగెత్తీ, ఈ వైపుకి పరుగెత్తీ "తాతా! క్యాట్ మీ! మీ! క్యాట్ మీ! మీ!" అనసాగింది.

తాతగారు బాధను మరిచిపోక తప్పని స్థితి తెచ్చింది బుజ్జి తల్లి. కప్పూ సాసరూ తీసుకుని వెళ్ళిపోయింది కోడలు.

"ఏదమ్మా క్యాట్ ఎక్కడుందీ?" అంటూ లేచారు. తాతగారు లేచి నిల్చోగానే ఆయన బాధ తగ్గిపోయినట్లే అనుకున్నది పాప. వెంటనే ప్లేటు మార్చేసింది. "తాతా! ఆచ్చి!"అన్నది. ఆ మాటలు తాతగారికి ప్రాణం పోశాయి.

"అమ్మదొంగా!" అంటూ ఎత్తుకుని ముద్దు కురిపించి వరండాలోంచి మెట్లు దిగి బయటకు వచ్చారు. వాకిట్లో నిల్చుంటే రోడ్డు మీద వెళ్లే కార్లూ బస్సులూ అన్నీ కనిపిస్తాయి. వాటిని చూపించటం మొదలుపెట్టారు. "పాపా చూడమ్మా అదిగో బస్సు!". వాటిపై ధ్యాస కొద్దిసేపే ఉంది.

రోడ్డు మార్జిన్ లో మంచుతో తడిసిన పచ్చగడ్డి అందంగా మెరుస్తోంది. గడ్డిమీద వాలిన సీతాకోకచిలుక!

తాతగారి గడ్డం పుచ్చుకుని తనవైపు తిప్పుకుంటూ "తాతా! సితాచి! తాతా! సితాచి!" అంటూ ఎగరసాగింది. పాపను ఎత్తుకుని ఉండడం సాధ్యం కాలేదు.

క్రిందికి దించుతూ "అవునమ్మా! సీతాకోకచిలుక!" అన్నారు. పాప తాతగారి చేయి విదుల్చుకుని సీతాకోకచిలుక దగ్గరకు పరిగెత్తింది.

పాప దగ్గరకు రాగానే సీతాకోకచిలుక ఎగిరిపోయి ఇంకోచోట వాలింది. పాప గాలితో పాటు పోటీపడుతూ పరుగెత్తుతోంది. తాత గారికి గుండె దడ దడదడలాడసాగింది. "పాపా! ఆగమ్మా! ఆగు! పాపా! నేను వస్తున్నానుండమ్మా!"

"తాతా! సితాచి!" పాప సీతాకోకచిలుక వెంట పరిగెత్తుతోంది.

తాతగారికి గుండెల్లో బరువుగా నొప్పిగా ఉంది. పాప పరుగెడుతోంది.

"తాతా! సితాచి!" పాప వంగి సీతాకోకచిలుక దొరికిందనే అనుకుంది. పట్టుకోబోయేసరికి ఎగిరిపోయింది. పాప మళ్లీ పరుగందుకున్నది. లేత పాదాలు గాల్లో తేలుతున్నాయి.

"పాపా! ఆగమ్మా!" తాతగారి కేక. పాప వినిపించుకోలేదు. "తాతా! సితాచి!" అంటూ కిందకి వంగింది.

ఎక్కడ మెయిన్ రోడ్డు ఎక్కేస్తుందోనని తాతగారు మరింత వేగంగా పెద్ద పెద్ద అంగల్తో పరిగెట్టి పాపాయిని పట్టుకున్నారు.

కళ్ళు చీకట్లు కమ్మాయి. గుండెలలో భరించరాని నొప్పి. ఒకచేత్తో పాప మళ్ళీ పారిపోకుండా పట్టుకుని రెండవచేత్తో గుండెలమీద రుద్దుకుంటూ కూలబడ్డారు. నేలమీదకొరిగిపోతున్న తాతను చూస్తూ 'సితాచి'ని మరిచిపోయింది పాప!

పాపను గుండెలమీద పొదివి పట్టుకునే ప్రయత్నం విఫలమైంది. చేతులు పక్కకు పడిపోయాయి. తాతగారు కళ్ళుమూశారు.

పాపకి తాతకి 'అబ్బో' వచ్చిందనుకున్నది కాబోలు "తాతా! క్యాట్ మీ మీ! క్యాట్ మీ మీ!" అంటూ కదుపుతున్నది.

*స్వాతి సపరివార పత్రిక 01.04.1994 నుండి పునర్ముద్రణ*

ఈ పత్రిక నిర్వహణకు ప్రతి నెలా ఒకరు ఆర్థికంగా సహాయపడుతున్నారు. ఆసక్తితో పాటు అవకాశం ఉన్నవారిని కథామంజరి కథాయజ్ఞంలో పాలుపంచుకోవలసినదిగా సవినయంగా కోరుతున్నాం. వివరాల కోసం సంప్రదించండి.

అవసరాల వెంకటరావు
*9989976688*

జయంతి ప్రకాశ శర్మ
*9848629151*

◈

సద్విమర్శ ఒక రచన ఆరోగ్యాన్ని పరిరక్షించే ఔషధం. కథకులకి మార్గదర్శి వంటిది.
కథామంజరి కథల పైన మీ అభిప్రాయాలను, విశ్లేషణలను, విమర్శలను ఆహ్వానిస్తున్నాం.
మీ అభిప్రాయాలను పంపవలసిన చిరునామా
*submit@kathamanjari.in*
మంచి రచనలతో కూడిన సంచికను రూపొందించే కార్యక్రమానికి చేయూతనివ్వండి.

◈

కథామంజరి పాఠకులను పెంచండి. కథామంజరిని కథాభిమానులకు చేరువ చేయండి.
వారి ఇమెయిల్ లను నమోదు చేసుకొనడానికి..
*www.kathamanjari.in*

◈

కొత్త, పాత రచయితలు, రచయిత్రుల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం.
మీ రచనలను పంపవలసిన చిరునామా
*submit@kathamanjari.in*